అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 26-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 56 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



వామపక్షాలే ప్రత్యామ్నాయం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఎంసీ దుష్పరిపాలనను ఎండగట్టాలి : దంకుని బహిరంగ సభలో సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


కేంద్రంలో బీజేపీని, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీని ఓడించాలని సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ 27వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా మంగళవారం దంకుని ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రకాశ్‌కరత్ ప్రసంగించారు. ప్రజల మద్దతుతో సీపీఐ(ఎం) ముందుకు సాగుతోందని ఈ ర్యాలీ రుజువు చేస్తోందని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రతికూలతలన్నింటినీ ఎదుర్కొని ధైర్యంగా పని చేశారని తెలిపారు. "బీజేపీ మతతత్వ విధానాలకు, తృణమూల్ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా మతతత్వ శక్తులకు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. దేశ రాజ్యాంగాన్ని అంతం చేయడంలో బీజేపీ పాత్రకు వ్యతిరేకంగా మనం లౌకిక శక్తులతో కలిసి పోరాటం చేస్తున్నాం. రాష్ట్రంలోని తృణమూల్ ప్రభుత్వం అవినీతిమయమైంది. ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక స్వభావానికి వ్యతిరేకంగా, బీజేపీ మతతత్వ రాజకీయాలపై పోరాటం జరుగుతోంది" అని అన్నారు. గత మూడేండ్లుగా బెంగాల్‌లోని ప్రజలకు వంద రోజుల పని లభించడం లేదని, వారి పని హక్కును హరించారని అన్నారు. పని హక్కు చట్టం అందరికీ ఉందని, అయితే మమత ప్రభుత్వం ఆ చట్టాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. "రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు. నాలుగు రోజులుగా ఈ రాష్ట్రంలోని వివిధ వార్తాపత్రికలలో మహిళలపై హింసకు సంబంధించిన వార్తలు చూశాను. ఈ జిల్లా (హుగ్లీ)కు చెందిన ఓ మహిళ వేధింపుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో సోమవారం మరణించింది" అని అన్నారు. "ఈ గూండా రాజ్‌కు వ్యతిరేకంగా పార్టీ ముందుండి పోరాడుతోంది. తొలుత మన కార్యకర్తలపై గూండాలను ప్రయోగించారు. నేడు ప్రజలపై ఉపయోగిస్తున్నారు" అని ప్రకాశ్‌కరత్ అన్నారు. "రాష్ట్రంలో వామపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు ఏ మతతత్వ శక్తి కూడా తల ఎత్తలేకపోయింది. నేడు తృణమూల్ కారణంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తివంతంగా మారే వాతావరణం ఏర్పడింది. ఈ రాష్ట్రాన్ని హిందూ మత శక్తికి స్థావరంగా మార్చాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది. మోడీ ప్రభుత్వం తాము హిందువులమని ...3లో

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తలోదారి

ఐరాస భేటీలో బట్టబయలైన విభేదాలు

15లో





కిం కర్తవ్యం?

కెనడా వీసా ని'బంధనాల'తో భారతీయుల ఇబ్బందులు

వివరాలు 15లో

లైఫ్‌సైన్సెస్ పాలసీ తెస్తాం

త్వరలో 10 ఫార్మా విలేజీల ఏర్పాటు

- 5లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తాం
- ఆవిష్కరణలకు కేరాఫ్ హైదరాబాద్
- రాష్ట్రంలో మెగా డ్రైపోర్ట్ ఏర్పాటు
- ఏపీలోని సీ పోర్ట్‌తో అనుసంధానం : బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



బయో ఆసియా సదస్సులో ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌కు జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"హైదరాబాద్ నగరాన్ని కొత్త ఆవిష్కరణలు, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ సహా భారీ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 10 ఫార్మా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఐదు లక్షలకుపైగా కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలోనే మొట్ట మొదటి 'లైఫ్ సైన్సెస్ పాలసీ'ని అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. చైనా ప్లస్ వన్ అవసరాలు తీర్చే కేంద్రంగా దీన్ని అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును ఏర్పాటు చేసి.. ఇక్కడి నుంచి ఏపీలోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపా యాలు అభివృద్ధి చేస్తాం." అని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన బయో ఆసియా సదస్సు-2025ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంగళవారం ప్రోత్సహించాలనే దార్శనికతతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్ వివరించారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ ఎకానమీ సామర్థ్యం గల స్టేట్‌గా మార్చాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఫార్మా రంగం అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తోందని వివరించారు. ఏఐ, క్వాంటమ్, రోబోటిక్స్ సాయంతో వైద్య రంగం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. ఇక్కడి ఎకో సిస్టమ్ అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించే రాష్ట్రంగా తెలంగాణ మారిందని గుర్తు చేశారు. "అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పనకు రాష్ట్రం కేరాఫ్‌గా నిలిచింది. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాల్లో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.40,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడి దారులకు తెలంగాణ రెడ్ కార్పెట్ పరుస్తోంది. చిన్న పరిశ్రమల నుంచి భారీ పరిశ్రమల వరకు అనేక రాయితీలను అందిస్తున్నాం. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టండి" అని సదస్సులో పాల్గొన్న ప్రతినిధులను సీఎం కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి కల్పనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రత్యక్షంగా 51వేల మందికి, పరోక్షంగా 1.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని వివరించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య, మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. పరిశ్రమల ఏర్పాటు తోనే ఆగిపోకుండా వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న జనరిక్ మందులు, వ్యాక్సిన్లలో తెలంగాణ వాటా రోజురోజుకీ పెరుగుతోందని వ్యాఖ్యానించారు. దాదాపు 200కు పైగా దేశాలకు ఏటా ఐదు బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ 2025ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రిసిషన్ హెల్త్ రీసెర్చ్ (ప్రిసైస్) సింగపూర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొ. పాట్రిక్ టాన్‌కు బహూకరించారు.

ఈ కార్యక్రమంలో ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, దేశ, విదేశాలకు చెందిన సంస్థలతో పాటు ఆ రంగంలో నిపుణులు, నిష్ణాతులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

11 కంపెనీలతో ఒప్పందాలు

బయో ఆసియా సదస్సు మొదటి రోజు రాష్ట్ర ప్రభుత్వం 11 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. గ్రాన్యూల్స్, ఆర్చికుర్లర్, ఐజాంట్, బయోలాజికల్ ఇ, విర్చో, విరూపాక్ష, జూబిలెంట్, విమ్టా, అరజెన్, భారత్ బయోటెక్, సాయి లైఫ్ సైన్సెస్‌లు తమ పెట్టుబడులను పెట్టేందుకు అంగీకరించారు. కాగా ఇప్పటికే గ్రీన్ ఫార్మా సిటీలో 6 కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి.

ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు ప్రధాని మోడీతో భేటీ
- ఏఐసీసీ అగ్రనేతలతోనూ సమావేశం

వివరాలు 7లో..

సర్వశక్తులూ ఒడ్డుతాం

టన్నెల్‌లో సహాయ చర్యలను పరిశీలించిన మంత్రులు | అధికారులు, ప్రతినిధులతో సమీక్షా సమావేశం

- ఆ ఎనిమిది మందిని కాపాడేందుకు అత్యున్నత పరిజ్ఞానం వినియోగం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సహాయ చర్యలకు ఆటంకంగా నీటి ఊట, బురద
- 15 అడుగుల ఎత్తులో 200 మీటర్ల బురద
- కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు పూర్తయితే వేగంగా బయటకు పంపింగ్
- టన్నెల్‌లో 11 కిలోమీటర్ల తర్వాత నీరు
- 11.5 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లిన రక్షణ బృందాలు
- 13.50 కిలోమీటర్ల వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్





నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి / అచ్చంపేట

ఎస్ఎల్‌బీసీ సొరంగం టన్నెల్ ప్రమాదంలో చిక్కుకుపోయిన ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకు రావడానికి సర్వశక్తులూ ఒడ్డుతామని మంత్రులు చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. వారు మంగళవారం ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను అంచనా వేశారు. అనంతరం మంత్రులు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ప్రాజెక్టు స్థలంలోని జేపీ కార్యాలయంలో అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ సహా సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న వివిధ ఏజెన్సీల ప్రతినిధులు సహాయ చర్యలపై వివరించారు.

అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రమాద స్థలంలో 40 నుంచి 50 మీటర్ల మేర బురద నిండుకుందని తెలిపారు. ఈ బురద నీటిని వెలికి తీయడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని వివరించారు. ఎడమ కాల్వ టన్నెల్‌లో ...7లో



అలుపెరుగని పోరాటం చేస్తా

ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

- మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి: ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

రేపు (గురువారం) జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే.. శాసనమండలిలో మరోసారి ప్రశ్నించే గొంతుకనవుతానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించారని, నాటి నుంచి నేటివరకు ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుకగా పనిచేశానని అన్నారు. రాష్ట్రంలో 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ సాధనలో తన కృషి ఉందని గుర్తు చేశారు. ప్రమోషన్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేయించానని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2020 పీఆర్సీ, లీవుల మంజూరు, బదిలీలు, తదితర సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్స్, కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు, నిరసనలు, దీక్షలు చేపట్టామని అన్నారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుంచి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టులలో ప్రమోషన్స్ అమలు చేయించాలన్నారు. ఐదు రకాల గురుకులాల సమస్యలు, డిప్యూటీ వార్డెన్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ...15లో

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి

- ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్యకార్డులివ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ



వివరాలు 3లో

48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య



టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు

- సీఎం రేవంత్ ఢిల్లీ చక్కర్లు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ విమర్శ

వివరాలు 7లో

పైసా.. కైసా...?

'రోజురోజుకీ ఖర్చులు పెరిగి పోతున్నాయి.. చాలీచాలని సంపాదనతో ఇంటిని ఎలా నడపాలో? భవిష్యత్ అవసరాల కోసం ఎలా పొదుపు చేయాలో అర్థం కావటం లేదు...' ప్రఖ్యాత బీమా సంస్థకు సంబంధించి ప్రతీరోజూ టీవీల్లో వచ్చే వ్యాపార ప్రకటనలో ఓ బాధితుడి ఆవేదన ఇది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి కూడా అచ్చం ఇలాగే ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటికి వడ్డీలు ఒకవైపు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వాటికి నిధుల సర్దుబాటు మరోవైపు.. రాష్ట్రంపై కక్షగట్టినట్టుగా పైసా విదల్చని కేంద్రం తీరు ఇంకో వైపు... ఈ నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకోసం ఆదాయాన్ని రాబట్టుకోవటం ఎలా? అన్నది రాష్ట్ర ప్రభుత్వానికి ఓ సవాలుగా మారింది వెరసి 'పైసా.. కైసా...?' అనే విధంగా పరిస్థితి తయారైంది. చాలినన్ని నిధుల్లేకపోవటం, బడ్జెట్‌లో వేసుకున్న ఆదాయ అంచనాలను చేరుకోలేకపోవటం తదితర కారణాల రీత్యా వివిధ శాఖలు, విభాగాలకు సంబంధించిన దస్త్రాలు... సంబంధిత డిపార్టుమెంట్ల నుంచి ఆర్థిక శాఖకు, అక్కడి నుంచి సీఎస్, సీఎం కార్యాలయాలకు వెళుతున్నాయి తప్ప నిర్ణీత సమయంలో పనులు కావటం లేదనే విమర్శలొస్తున్నాయి. వాటిని పరిష్కరించాలంటే నిధులు కావాలి కాబట్టి ఉన్నతాధికారులు నెలల తరబడి పెండింగ్‌లో పెడుతుండటం పరిపాటిగా మారింది.

సర్కారుకు హామీల సవాళ్లు

ఆసరా సహా అనేక పథకాల కోసం జనం ఎదురుచూపులు

'ఖజానా' కష్టాలతో కాలయాపన ప్రధానమైన వాగ్దానాల అమలెప్పుడో?

బి.వి.యన్.పద్మరాజు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక తరగతులకు హామీలనిచ్చింది. వీటిలో ముఖ్యమైంది, ప్రజలు ఆశగా ఎదురు చూసేది 'ఆసరా' పింఛన్లు. రాష్ట్రంలో ప్రస్తుతం 15.25 లక్షల మంది వృద్ధులు, 15.26 లక్షల మంది వితంతువులు, 4.92 లక్షల మంది వికలాంగులు పింఛన్ పొందుతున్నారు. ఈ క్రమంలో 'ఆసరా' పథకం కింద వయో వృద్ధులకు నెలకు రూ.2,016, వితంతువులకు రూ.2,106, వికలాంగులకు రూ.4,016 పింఛన్ వస్తోంది. వీటన్నింటినీ రెట్టింపు చేస్తామంటూ కాంగ్రెస్ హామీనిచ్చింది. ఈ మూడు రకాల పింఛన్లకు కలిపి నెలకు సగటున రూ.వెయ్యి కోట్లు అవసరమవుతున్నాయి. అంటే ఏడాదికి పింఛన్ల కోసం రూ.12 వేల కోట్లను సర్కారు ఖర్చు చేస్తోందన్నమాట. వీటిని రెట్టింపు చేస్తే నెలకు అదనంగా మరో రూ.వెయ్యి కోట్లు, ఏడాదికి మరో రూ.12 వేల కోట్లను వెచ్చించాల్సి ఉంటుంది. ఆ రకంగా ఇప్పుడున్న పింఛన్లను రెట్టింపు చేయాలంటే ఏడాదికి రూ.24 వేల కోట్లను కేటాయించాలి. ప్రస్తుతానికి ఈ మొత్తాన్ని భరించే స్థితి లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా బీఆర్ఎస్ హయాంలో 2022 ఆగస్టు నుంచి కొత్తగా ఆసరా పింఛన్లు ఇవ్వలేదు. అప్పటి నుంచి ఇప్పటిదాకా సుమారు 15 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని వెరిఫికేషన్ చేసి, స్క్రూటినీ చేస్తే 12 లక్షల వరకూ అప్లికేషన్లు మిగులుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పింఛన్లకు అదనంగా వీటిని ఇవ్వాలనుకుంటే నెలకు అదనంగా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ కావాల్సి ఉంటుందంటూ ఆర్థికశాఖ లెక్క లేసింది. ఈ మొత్తాన్ని ...15లో



హామీలు ప్రభుత్వం నెరవేర్చాలి...

ఇవేగాక మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం, 50 ఏండ్లు నిండిన జానపద కళాకారులకు నెలకు రూ.3 వేల పింఛన్, రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, మత బోధకులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల గౌరవ వేతనం, వధువులకు (కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్) రూ.1.6 లక్షల ఆర్థిక సాయం తదితర ముఖ్యమైన హామీలను ప్రభుత్వం నెరవేర్చాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో సర్కారు వీటి జోలికే పోవటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 14 నెలలు పూర్తయింది. ఇప్పుడే కాసులకు 'కటకట'గా ఉంటే మున్ముందు ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్ షాడో ట్యాంకర్‌పై అమెరికా ఆంక్షలు

భారత కంపెనీలపైనా ప్రభావం

వివరాలు 15లో

అన్ని బడుల్లో 'తెలుగు' తప్పనిసరి

- సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ పాఠశాలల్లో అమలు చేయాల్సిందే : విద్యాశాఖ ఉత్తర్వులు



వివరాలు 15లో

సీసీ రోడ్ల నిర్మాణం ప్రమాణాలు పాటించాలి

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వస్తున్నాయనీ, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చారు. నాసిరకం పనుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులు జరిగిన చోట బిల్లులు ఎలా చెల్లించారని అధికారులను ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీ రాజ్ రోడ్లపై సమీక్ష చేశారు. దీనికి ఆ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాసిరకం రోడ్లకు మాట్లాడుతూ నాణ్యతా సర్టిఫికెట్లను ఎలా ఇచ్చారని వివరించారు. క్వాలిటీ కంట్రోల్ టీములను తక్షణం ఆయా ప్రాంతాలకు పంపాలని ఆదేశించారు. గ్రామీణ రహదారుల నాణ్యతపై రాజీ పడేది లేదని అభిప్రాయడ్డారు. నాణ్యతా లోపాలపై నివేదికలు తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కాంట్రాక్టర్లు ఏ స్థాయిలో ఉన్నా వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. నాసికం పనులు చేసిన చోట సస్పెన్షన్లు తప్పవని వ్యాఖ్యానించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో అధికారుల్లో టెన్షన్ నెలకొందని సమాచారం.

ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహాశివరాత్రి అంటే రాత్రి వేళ మేల్కొలుపు అని తెలిపారు. కోట్లాది మంది శివభక్తులకు ముఖ్యమైన పండుగ అని చెప్పారు. ఇది చీకటిని, అజ్ఞానాన్ని జీవితంలో ఎదుర్కోవడానికి గుర్తు అన్నారు. శివుడు అందరి జీవితాల్లో సంతోషాన్ని, అభివద్ధిని కలుగజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పండుగ మనలో ప్రేమ, ఆప్యాయత, దయ, సహోదరత్వం లాంటి ఉత్తమ భావనలను నింపాలని కోరుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు దూరంగా ఉండాలి

- పీఆర్టీయూ తెలంగాణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రేపు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు దూరంగా ఉండాలనీ, ఉపాధ్యాయుల వృత్తి గౌరవాన్ని కాపాడాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్లా కోరారు. ఈ ఎన్నికల్లో అవకాశవాదులను నమ్మకుండా నిజమైన ఉపాధ్యాయ నాయకులను ఎన్నుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలన్నీ సాధించామంటూ కొందరు ఉపాధ్యాయులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమయంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల గుణగణాలను గతంలో వారు చేసిన సేవలను గుర్తు చేసుకుని ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఆరేండ్లలో ఉపాధ్యాయులకు ఏమేరకు ఉపయోగపడతారో ఆలోచించాలని సూచించారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉండే వారిని ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని కోరారు. నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సూచించారు.

సీపీఎస్ ఉద్యోగుల ఉద్యమబాట : సీపీఎస్‌టీఈఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత సీపీఎస్ ఉద్యోగులు ఉద్యమబాట పడతారని సీపీఎస్‌టీఈఏ అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాక సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు.

మహిళా ప్రాంగణాలకు ప్రత్యేక బడ్జెట్ : సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జిల్లాల్లోని మహిళా ప్రాంగణాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో ఆ సంస్థ కార్యకలాపాలపై సమీక్ష చేశారు. మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, మహిళా శిశు,సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, మహిళా కార్పొరేషన్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక్కో మహిళా ప్రాంగణాన్ని ఒక్కో రంగంలో శిక్షణ కోసం ఉపయోగించాలని సూచించారు. మూస పద్ధతిలో కాకుండా అవకాశాలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. జిల్లా ప్రాంగణాల్లో మహిళలకు ఆటో డ్రైవింగ్, కార్ డ్రైవింగ్ సెంటర్లను నెలకొల్పి ఉచితంగా శిక్షణనిస్తామని చెప్పారు. మహిళా స్వయం సహాయక బందాలతో సమన్వయం చేసుకుని మహిళా కార్పొరేషన్ అధికారులు పనిచేయాలని సూచించారు. అప్పుడే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయ పడ్డారు. మహిళా కార్పొరేషన్, మహిళా సంఘాలు కలిసి పని చేస్తే కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావటం సాధ్యమవుతుందన్నారు. మహిళా ప్రాంగణాల భూముల్లో మహిళా పెట్రోల్ బంకులను ఆ ప్రాంగణాల్లోని శిక్షణా కేంద్రాల్లో మహిళా సంఘ సభ్యులకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. టైలరింగ్, బ్యూటిషన్, ఫుడ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ స్కిల్స్ వంటి రంగాల్లో మహిళలకు శిక్షణనివ్వాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి చిన్నారెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుపై కేసులు నమోదు చేయాలి :మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్



(ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి చేత రూ.90 కోట్లు ఖర్చు పెట్టించారనీ, ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఇచ్చారని చిన్నారెడ్డి బయటపెట్టారని హరీశ్‌రావు చెప్పారు. ఈ విషయంపై ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్నికల కమిషన్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్ ఐతే ఈడీ ఒక్క నోటీస్ ఇవ్వలేదని గుర్తుచేశారు. సుమోటోగా తీసుకొని కేసులు ఎందుకు పెట్టడం లేదు? అని ప్రశ్నించారు. వెంటనే కేసులు పెట్టి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటి కాపలాదారులుగా మారిపోయారని విమర్శించారు.

కోదండరాం మాట్లాడరెందుకు?

ఎల్‌ఆర్ఎస్ స్కీంను ఉచితంగా అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వసూళ్లు చేస్తుంటే కోదండరాం ఎందుకు మౌనంగా ఉన్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రజలు ఎల్‌ఆర్ఎస్ కట్టవద్దని ఆయన కోరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కతో పాటు ప్రొఫెసర్ కోదండరాం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి హోదాలో అబద్ధాలా?

ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు సంబంధించి బీఆర్ఎస్ హయాంలో తవ్వకాలు జరపలేదంటూ రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలాడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. 11.48 కిలోమీటర్లు తవ్వినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉత్తమ్ సహచర మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు కూడా తనతో పాటు ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు వచ్చారనీ, అలాంటి కృష్ణారావు కూడా తానా అంటే తందానా అంటూ అబద్ధాలాడుతున్నారని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో 230 కిలోమీటర్ల టన్నెల్ తవ్వి పూర్తి చేశామనీ, ఎస్ఎల్బీ సెట్‌లో అనేక సాంకేతిక సమస్యలున్నా 12 కిలోమీటర్లు పూర్తి చేసినట్టు తెలిపారు. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు ,15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లలో ,21 పంప్ హౌస్, 203 కిలోమీటర్ల టన్నెల్, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ లు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెన్, 141 ఎంసీల నీటి సామర్థ్యం. 530 మీటర్ల ఎత్తుకు నీటిని లిఫ్ట్ చేయడం. వీటన్నిటీ సమాహారమని తెలిపారు. అలాంటి కాళేశ్వరంలో ఒక్క బ్యారేజీలో ఒక్క బ్లాకు పిల్లర్ కుంగితే నానా యాగి చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో ఖమ్మంలో పెద్ద వాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిందనీ, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందనీ, పాలమూరు ప్రాజెక్టులోని వట్టెం పంప్ హౌజ్ నీట మునిగిందని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఓటర్లు బుద్ధి చెప్పాలి

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు మొండి చెయ్యి చూపించిన బీజేపీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హరీశ్ రావు కోరారు. దేశవ్యాప్తంగా 156 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి తెలంగాణకు ఒక్క కాలేజీ ఇవ్వలేదనీ, పాప్ కార్న్ నుంచి నిత్యావసర వస్తువుల వరకు జీఎస్టీ వేసి వేధిస్తున్న బీజేపీ అభ్యర్థులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

మెరుగైన అభ్యర్థికి ఓటేయండి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు కాకుండా మెరుగైన అభ్యర్థులకు ఓటేసి ఎన్నుకోవాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. రైతుబంధు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పొందిన యాజమాన్యం, సిబ్బంది, కళ్యాణలక్ష్మి, తులం బంగారం, ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, వెంటనే పెండింగ్ డీఏలు, ఆరు నెలల్లో పీఆర్సీ, నిరుద్యోగ భతి వస్తే కాంగ్రెస్‌కు ఓటు వేయాలనీ లేదంటే ఓడించాలని సూచించారు. కేఆర్ఎంబీ మొదటి సమావేశంలోనే రాష్ట్ర ప్రాజెక్టులను ఆ బోర్డుకు అప్పగించారని ఆయన విమర్శించారు.

నేడు ప్రధానితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



నవతెలంగాణ హైదరాబాద్:

సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం 10.30కు ప్రధాని నరేంద్ర మోడీని కలవనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అపాయింట్మెంట్ సమాచారం రావడంతో ఆయన మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. గత ఏడాది జులై తరువాత ప్రధానితో సీఎం భేటీ కానున్నడం ఇదే తొలిసారి. ఇటీవల ఎస్ఎల్బీసీ ప్రమాదంపై మోడీ ఆయనతో ఫోన్లో మాట్లాడారు. బుధవారం భేటీలో ఈ ఘటనను పూర్తిస్థాయిలో వివరించడం తోపాటు, పలు ప్రాజెక్టులపై కేంద్ర సాయం కోరనున్నట్టు తెలిసింది. మూసీ సుందరీకరణ, శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు మెట్రోరైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడంతోపాటు విభజన చట్టంలోని వివిధ పెండింగ్ సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకువెళ్లినున్నట్టు సమాచారం. పలువురు కేంద్ర మంత్రులను సైతం సీఎం కలిసే అవకాశం ఉంది. ఏఐసీసీ పెద్దలను సైతం కలసి ఎమ్మెల్సీ ఎన్నికలు, పీసీసీ రాష్ట్ర కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశాలున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బే ఆఫ్ బెంగాల్‌లో భూకంపం



నవతెలంగాణ - హైదరాబాద్ :

బే ఆఫ్ బెంగాల్ లో మంగళవారం ఉదయం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్పై భూకంప తీవ్రత 5.1గా నమోదైంది. సముద్రంలో 91కి.మీ లోతున ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు.

వికలాంగుల అభివృద్ధికి కృషి

సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు గ్రామీణభివృద్ధి శాఖ ద్వారా కృషి చేస్తున్నామని సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ చెప్పారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్‌ను ఆమె మంగళవారం హైదరాబాద్‌లోని సెర్ప్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వికలాం గునికి యూడీఐడీ కార్డు అందించేం దుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉపాధి హామీ చట్టం కింద జాబ్ కార్డులు జారీ చేసి 150 రోజులు పని కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఎస్‌హెచ్‌సీ డైరెక్టర్ మైత్రియి, ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు నరసింహ, నాయకులు భాగ్యలక్ష్మి, ఎ లక్ష్మి, మంగమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు, ఆయాల సమస్యలపై చర్చలు

రాష్ట్రంలో మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌హెచ్‌సీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ నేతలు సెర్ప్ సీఈవోను కోరారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న కార్యకర్తలు, ఆయాలకు అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు చెల్లిస్తున్న వేతనాలతో సమానంగా వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా ఒకటిన వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌హెచ్‌సీలలో పని చేస్తున్న వారికి ప్రభుత్వం తరుపున గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఎస్‌హెచ్‌సీ సెంటర్‌కు పిల్లలను రవాణా చేయటానికి ఆటో లు మంజూరు చేస్తా మని తెలిపారు. పెండింగ్ వేతనాలు వారం రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

మాదిగ అమరుల పోరాటంతోనే 'వర్గీకరణ'

మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ - బంజారాహిల్స్

మాదిగ అమరుల పోరాట ఫలితమే నేటి సామాజిక న్యాయపరమైన వర్గీకరణ అమలు విజయమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్ బేగంపేట టూరిజం హరిత ప్లాజాలో మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మాదిగ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, వేముల వీరేశం, లక్ష్మీకాంతరావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, చంద్రశేఖర్, ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ కొండేటి మల్లయ్యతో కలిసి మంత్రి మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగారు. అనంతరం అమరులకు పుష్పాంజలి ఘటించారు. అంతకుముందు అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎస్సీ కులాల్లో అసమానతల వల్లే ఆందోళనలు మొదలయ్యాయని తెలిపారు. హక్కుల సాధన కోసం సుదీర్ఘ పోరాటం జరిగిందని, ఈ పోరాటంలో అసువులు బాసిన అమరులకు నివాళ్లర్పిం చుకోవడం తమ కర్తవ్యమని అన్నారు. జాతి ప్రయోజనాల కోసం ప్రాణాల ర్పించిన అమరుల కుటుం బాలకు మాదిగలు జీవితాంతం రుణపడి ఉంటారని, ఎన్ని తరాలైనా అమరుల రుణం తీర్చుకోలేనిదని చెప్పారు. హక్కుల కోసం జరిగే పోరాటాలకు రాజకీయ రంగు పూయకూడదని హితవు పలికారు. మానవత్వంతో నిర్ణయాలు తీసుకోవాలని, వర్గీకరణ విషయంలో అదే జరిగిందని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేశారని గుర్తు చేశారు. మాదిగల పట్ల ఆయనకున్న నిబద్ధత, పేదల హక్కుల పట్ల చిత్తశుద్ధికి అది నిదర్శనం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుకూలంగా, వెనుకబడిన సామాజిక తరగతులకు న్యాయం చేసేలా అన్ని విధాల అధ్యయనం చేసిన తర్వాత వన్ మ్యాన్ కమిషన్ నివేదిక ఇచ్చిందని తెలిపారు. అందులో వంకలు పెట్టడానికేం లేదని, వర్గీకరణపై అబద్ధాలు, మోసం, రాజకీయం కోసం విమర్శలు చేయొద్దని సూచించారు. త్వరలో వర్గీకరణ చట్టం చేసిన తర్వాత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపడతామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త చరిత్ర రాయబోతున్నామన్నారు. ఎక్కడ అవసరమున్నా, ఏ ఆపదున్నా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదని హామీనిచ్చారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి టీఎస్‌సీపీఎస్‌ఈయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మంత్రి డి శ్రీధర్‌బాబును మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ నేతృత్వంలో కలిసి మద్దతు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లో ఓపీఎస్‌ను పునరుద్ధరించారని గుర్తు చేశారు. అదే మాదిరిగా తెలంగాణలో కూడా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు, పోలీసు, వైద్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సాంకేతిక సమస్యలతో ఓపీఎస్‌కు దూరమయ్యారనీ, తక్షణమే వారికి ఓపీఎస్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అతిత్వరలోనే వాటిని నెరవేరుస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ప్రజావాణికి 1195 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 1195 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 108, విద్యుత్ శాఖకు 66, రెవెన్యూ శాఖకు 30, ప్రవాసి ప్రజావాణికి 01, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 937 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.







వామపక్షాలే ప్రత్యామ్నాయం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఎంసీ దుష్పరిపాలనను ఎండగట్టాలి : ప్రకాశ్‌కరత్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పుకుంటుంది. కానీ వాస్తవానికి వారు అదానీ, అంబానీల కోసం పని చేస్తున్నారు. ఈ రాష్ట్రానికి బీజేపీ వస్తే, ఈ కార్పొరేట్ శక్తి బెంగాల్‌ను దోచుకుంటుంది. రాష్ట్ర ప్రజలు వామపక్ష ప్రత్యామ్నాయ శక్తిని చూడాలనుకుంటున్నారని ఈ ర్యాలీ రుజువు చేస్తుంది" అని స్పష్టం చేశారు.

ప్రతి రోజూ ఒక పోరాటమే : ఎండీ సలీం

"ఈ ర్యాలీ సీపీఐ(ఎం) ఉనికిలో ఉందని, ఉంటుందని నిరూపిస్తోంది. కొన్ని ఎన్‌జీవోలు, మీడియా వామపక్షాలు తుడిచిపెట్టుకు పోయాయని ప్రచారం చేశాయి. కానీ అది ఎన్నటికీ జరగదు. జరగబోదు. ఎర్రజెండా అమరవీరుల రక్తంతో తయారు చేయబడింది. రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, గిరిజనులు, విద్యార్థులు, యువజనులు, మైనారిటీలు, ప్రతి ఒక్కరి కోసం పోరాటానికి సీపీఐ(ఎం) ఏర్పడింది" అని సీపీఐ(ఎం) పశ్చిమబెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బుద్ధదేవ్ భట్టాచార్య రాష్ట్ర ప్రజల ప్రతిభను ఉపయోగించి రాష్ట్రాన్ని నిర్మించాలనుకున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ కాలంలో పాఠశాలలు నిర్మించారు. కానీ తృణమూల్ వాటిని కూల్చివేస్తోంది. బీజేపీ అభివృద్ధి అంటోంది. ఆర్జీకర్ కేసు కోల్‌కత్తా పోలీసులు, సీబీఐ దాని నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. ఢిల్లీ, కోల్‌కత్తా నిజాన్ని వెల్లడించడానికి ఇష్టపడవు. ప్రతిదీ బహిర్గతం చేయాలని కోరుతున్నాం. మనం గత మూడేండ్లుగా ప్రజలను ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ వారు ప్రజలను విభజించాలనుకుంటున్నారు. అల్లర్లు చెలరేగుతున్నాయి. అల్లర్లు చేసిన వ్యక్తికి మోడీ పద్మశ్రీ ఇచ్చారు. ఈ రాష్ట్రంలో గూండాలకు, అల్లర్లకు చోటు ఉండకూడదని మేము చెబుతున్నాం. మతం, రాజకీయాలను వేరుగా ఉంచాలి" అని ఎండీ సలీం అన్నారు. "బంగ్లాదేశ్‌లో



మతపరమైన మతతత్వ శక్తులు అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీలు, ప్రతిపక్ష సభ్యులపై దాడులు జరుగుతున్నాయి. ఈ సంఘటనలు మన దేశంలో కూడా చూస్తున్నాం. బంగ్లాదేశ్‌లోని పేదల హక్కుల కోసం పోరాడుతున్న వారితో మేము నిలబడతాం. ఈ రాష్ట్రంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. మన దేశం బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆర్‌ఎస్‌ఎస్ దేశం మొత్తాన్ని మత ప్రాతిపదికన విభజిస్తోంది. మమత బీజేపీతో కలిసి మనకు వ్యతిరేకంగా పోరాడతానని అంటోంది. ఈరోజు వారు కలిసి కూర్చున్నారు. ప్రతిరోజూ ఒక పోరాటం. సీపీఐ(ఎం)ను బలోపేతం చేయాలి. వామపక్ష ఐక్యతను నిర్మించాలి. మనం ప్రజలతో కలిసి ముందుకు సాగాలి. ప్రజలు మన వైపు వచ్చారు" అని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభలో సీపీఐ(ఎం) నేతలు డెబ్లినా హెంబ్రామ్, మీనాక్షి ముఖర్జీ, దేబబ్రతా ఘోష్ తదితరులు మాట్లాడారు.



యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వలస కార్మికుల కోసం సీఐటీయూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్-ఎల్‌బీసీ) టన్నెల్ చిక్కుకున్న ఎనిమిది మంది వలస కార్మికులను రక్షించడం కోసం యుద్ధ ప్రాతిపాదికన సహాయ చర్యలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సీఐటీయూ విజ్ఞప్తి చేసింది. అలాగే పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు చేపట్టని నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. టన్నెల్ నిర్మాణంలో బురద, నీరు వెల్లువెత్తడం కొత్తకాదని, ఇది సాధారణంగా జరిగేదనని, వీటిని నివారించడానికి ముందగానే చర్యలు తీసుకుంటారని సీఐటీయూ తెలిపింది. అయితే తెలంగాణలోని దోమలపేటకు సమీపంలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో కార్మికులు లోపలికి ప్రవేశించిన 30 నిమిషాల్లోనే నీరు, బురద సొరంగంలో పేరుకుపోవడం కాంట్రాక్టర్‌కు సరైన ఇంజినీరింగ్ నైపుణ్యం లేకపోవడాన్ని వెల్లడిస్తుందని, ఇది కాంట్రాక్టర్, ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమని సీఐటీయూ విమర్శించింది. ఈ నిర్లక్ష్యం వలస కార్మికుల జీవితాలను విషాదంలోకి నెట్టివేసిందని, వారి కుటుంబాలను కష్టాల్లోకి పడేసిందని సీఐటీయూ ఆవేదన వ్యక్తం చేసింది.

ఈ నిర్లక్ష్యంలో ప్రజా పనుల శాఖ, కార్మిక శాఖల పాత్ర సమానంగా ఉందని పేర్కొంది. చిక్కుకున్న కార్మికులు ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్), ఈఎస్ఐ పథకాల్లో ఉన్నారా లేదా అనే విషయాన్ని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వాలని సీఐటీయూ తెలిపింది. కార్మికులకు సరైన పరిహారాన్ని ఇవ్వాలని కోరింది.

ప్రలోభాలకు ఎర

ఓటర్లకు నగదు పంపిణీ మొదలెట్టిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

తాయిలాలను తిరస్కరించాలి: ఉపాధ్యాయులు, అధ్యాపకులకు టీఎస్‌యూటీఎఫ్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో కొందరు ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఓటర్లకు నగదు పంపిణీ మొదలుపెట్టారని తెలిపింది. తాయిలాలను తిరస్కరించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి పక్షాన గుర్తుతెలియని వ్యక్తులు రూ.రెండు వేలు ఫోన్ పే చేసి పూలు అని మెసేజ్ పంపారని వివరించారు. కొందరు ఓటర్లు వాటిని తిరస్కరించి వెనక్కి పంపారని తెలిపారు. మరో ప్రముఖ సంఘం (పీఆర్టీయూ) అభ్యర్థి పక్షాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.వెయ్యి, ఖమ్మంలో రూ.రెండు వేలు, మహబూబాబాద్ జిల్లాలో రూ.ఐదు వేలు పంపిణీ చేసినట్టు సమాచారమని పేర్కొన్నారు. అధికార పార్టీ అధికార ప్రతినిధి అని చెప్పుకునే అభ్యర్థి పక్షాన కొన్ని పాఠశాలల్లో ఓటరుకు రూ.రెండు వేల చొప్పున పంపిణీ చేసినట్టు తెలిసిందని వివరించారు. జాతీయ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ద్వారా ఇంటింటికీ రూ.రెండు వేల నుంచి ఐదు వేలు పంపిణీ చేస్తున్నట్టు సమాచారముందని తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు నగదు తీసుకోకుండా తిరస్కరించారనీ, వారిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు.పోటీలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు తాము దిగజారి ఉపాధ్యాయుల విలువను దిగజార్చడం పట్ల చావ రవి, ఎ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తాము చేసిన సేవలను వివరించి ఓట్లడగటం కాకుండా డబ్బు పంపిణీ చేసి గెలవాలనుకోవటాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కమిషన్ డబ్బు పంపిణీని అడ్డుకోవాలనీ, పంపిణీ చేసే ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.





కేరళలో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు

- ఎల్‌డీఎఫ్‌కు 17 స్థానాలు
- ఖాతా తెరవని బీజేపీ

తిరువనంతపురం : కేరళలో స్థానిక సంస్థలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ ఘన విజయం సాధించింది. 13 జిల్లాల్లోని 30 స్థానాల్లో ఈ ఉప ఎన్నికలు జరగ్గా, ఎల్‌డీఎఫ్ 17 స్థానాలను గెలుచుకుంది. తిరువనంతపురం మున్సిపాలిటీ కార్పొరేషన్‌లోని అనేక వార్డులను కూడా ఎల్‌డీఎఫ్ హస్తగతం చేసుకుంది. యూడీఎఫ్‌కు చెందిన నాలుగు సిట్టింగ్ స్థానాలను కూడా ఎల్‌డీఎఫ్ వశం చేసుకుంది. యూడీఎఫ్ కేవలం 12 స్థానాలతో సరిపెట్టుకుంది. కాంగ్రెస్ మద్దతుతో ఇస్లామిక్ సంస్థ ఎస్‌డీపీఐ ఒక్క స్థానంలో విజయం సాధించింది. ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ ఒక్క స్థానం కూడా గెలుచుకోలేకపోయింది. ఎల్‌డీఎఫ్ కూటమిలో సీపీఐ(ఎం)కు 12 స్థానాలు, సీపీఐకి రెండు స్థానాలు, కేరళ కాంగ్రెస్ (ఎం)కు ఒక్కటి లభించాయి. ఎల్‌డీఎఫ్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి ఒక్క స్థానంలో విజయం సాధించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు ప్రజల మద్దతును ఈ విజయం పునరుద్ఘాటించిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ఈ ఏడాది చివరిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు అధికార కూటమికి సానుకూలంగా ఈ ఫలితాలు వచ్చాయని చెబుతున్నారు. భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో కలిగి విజయాలకు ముందస్తు సూచనగా ఈ ఫలితాలను పరిగణిస్తున్నారు.

గాజాలో ప్రతికూల వాతావరణంలో

ఆరుగురు చిన్నారులు కన్నుమూత

మానవతా సాయం అనుమతించనందువల్లనే ఈ పరిస్థితి

గాజా : గాజాలో నెలకొన్న అత్యంత శీతల వాతావరణం కారణంగా గత రాత్రి నవజాత శిశువుతో సహా ఆరుగురు చిన్నారులు మృతిచెందారు. వీరిలో ఐదుగురు గాజాలోని రీమల్ ప్రాంతంలోని ఆస్పత్రిలో మరణించారు. ఖాన్ యూనిస్ నగరంలో ఆరవ చిన్నారి కన్నుమూసిందని వైద్య వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా స్వస్థలాలకు తిరిగివచ్చిన వేలాదిమంది పాలస్తీనియన్లు శిథిలమైన తమ ఇళ్ళ వద్దనే రాళ్ళు రప్పల్లో తాత్కాలికంగా వేసుకున్న శిబిరాల్లో నివసిస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి
ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్యకార్డులివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి వారు కృషి చేస్తు న్నారని తెలిపారు. వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. జర్న లిస్టులు చాలీచాలని వేతనాలతో జీవితాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసర ముందని సూచించారు. అనేక ఉద్యమాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. గత పదేండ్లుగా వివిధ కారణాలతో దాదాపు 500 మందికి పైగా జర్నలిస్టులు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో సంగారెడ్డిలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెస్తున్నామనీ, వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యలు

ఇండ్లస్థలాలు

ఈ సమస్య గత నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో సమస్య మరింత జఠిలమైంది. ప్రభుత్వాలు మారుతున్నాయి గానీ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు మాత్రం రావడం లేదు. జర్నలిస్టులకు వెంటనే ఇండ్లస్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

పెన్షన్ పథకం

రిటైరైన జర్నలిస్టులకు కేరళ, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టుగా పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలి.

మహిళా జర్నలిస్టులు

మీడియాలో మహిళా జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్నది. పత్రికా, ఎలక్ట్రానిక్, ఇతర సంస్థల్లో వారికి తగు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మీడియా సంస్థలను ప్రభుత్వం ఆదేశించాలి.

అక్రిడిటేషన్లు

ప్రతి రెండేండ్లకోసారి ఇవ్వాల్సిన అక్రిడిటేషన్లు ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ కొత్త కార్డులను ఇవ్వలేదు. ఉన్న వాటినే ప్రతి మూడు నెలలకోసారి గడువును పొడిగిస్తున్నారు. అర్హులైన జర్నలిస్టు లందరికీ అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి.

వేజ్‌బోర్డు, ఉద్యోగ భద్రత

జర్నలిస్టులకు తగిన ఉద్యోగ భద్రత లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. మండల, జోన్ విలేకర్ల పరిస్థితి మరీ దారుణం. మీడియా సంస్థల్లో వేజ్ బోర్డు అమలుకావడం లేదు. జర్నలిస్టులకు కనీస వేతనాలను ఇవ్వడం లేదు. జస్టిస్ గురుభక్షి మజీథియా కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఒక ఐఏఎస్ అధికారిని నియమించి అవి అమలయ్యేలా చూడాలి.



మీడియా కమిషన్

రాష్ట్రంలోని మీడియాలో నెలకొన్న పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేయడానికి సీనియర్ ఉన్నతాధికారులు, మేధావులు, జర్నలిస్టులతో కమిషన్ వేసి సమస్యలను గుర్తించాలి. ఆ కమిషన్ సిఫారసు మేరకు జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ప్రత్యేక రక్షణ చట్టం


జర్నలిస్టులపై భౌతిక దాడులు జరుగుతున్నాయి. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం ఉద్యోగుల తరహాలో తేవాలి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రెస్ కౌన్సిల్ ఉన్నా దాన్ని మోడీ సర్కారు తన రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నది. తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాన్ని అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి.

హెల్త్ కార్డులు

రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో, నిమ్స్‌లో తప్ప ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు జర్నలిస్టుల ఆరోగ్య కార్డుల ద్వారా సేవలను అందించడం లేదు. నిమ్స్‌లో కూడా మందులు బయట నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టు ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలి. వెల్‌నెస్ సెంటర్లను బలోపేతం చేయాలి.

మీడియా అకాడమీ

తెలంగాణ అకాడమీ చేపడుతున్న స్వల్ప సంక్షేమ పథకాలు సరిపోవు. జర్నలిస్టులకు శిక్షణా తరగతులను నిర్వహించాలి. చనిపోయిన జర్నలిస్టులకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. జర్నలిస్టు బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి.



ఉద్రిక్తతలకు మరింత ఊతం

యూసీసీపై గుజరాత్‌లో ఆందోళన

అహ్మదాబాద్ : ఉమ్మడి పౌరస్మృతిపై (యూసీసీ) చర్చించి ముసాయిదాను రూపొందించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. యూసీసీని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిన విషయం తెలిసిందే. ఉన్నత స్థాయి కమిటీకి నేతృత్వం వహించేందుకు ఉత్తరాఖండ్‌లో యూసీసీ బిల్లును రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజనా దేశాయ్‌ని గుజరాత్ ప్రభుత్వం ఎంపిక చేసింది. నివేదికను సమర్పించేందుకు కమిటీకి 45 రోజుల సమయం ఇచ్చారు. కాగా రాష్ట్రంలో యూసీసీ అమలుపై సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అసలే మతపరమైన ఉద్రిక్తతలతో అట్టుడికిపోయే గుజరాత్‌లో యూసీసీ అమలుతో ఘర్షణలు మరింత పెచ్చరిల్లుతాయని పలువురు సామాజిక కార్యకర్తలు, స్థానికులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామిక స్వభావాన్ని యూసీసీ విచ్ఛిన్నం చేస్తుందని సామాజిక, సాంస్కృతిక కార్యకర్త హిరేన్ గాంధీ చెప్పారు. 'గుజరాత్ ఇప్పటికే పూర్తిగా ఫాసిస్టుల లేబొరేటరీగా మారిపోయింది. 1980వ దశకం నుండి ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారు. 1980ల నుండే రాష్ట్రంలో యూసీసీ మూలాలు కన్పిస్తున్నాయి. అప్పటి నుండి అది బీజేపీ అజెండాలోనే ఉంది' అని ఆయన అన్నారు. యూసీసీ అమలుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను గుజరాత్‌లోని పలు మితవాద సంస్థలు ఇప్పటికే సమర్థిస్తున్నాయి. మైనారిటీలు మాత్రం తమ మతపరమైన గుర్తింపును కోల్పోతామని, హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా ఇది ఉమ్మడి పౌరస్మృతి కాదని, లక్షిత పౌరస్మృతి అని మైనారిటీ సమన్వయ కమిటీ కన్వీనర్ ముజాహిద్ నఫీస్ వ్యాఖ్యానించారు.

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలులోకి వచ్చిన రెండు వారాలకే ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా పౌరులు అందించే వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, తృతీయ పక్షానికి అందుబాటులో ఉంచబోమని ప్రభుత్వం నచ్చచెబుతోంది. గుజరాత్‌లో ప్రజల్లో భయాందోళనలు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. చట్టాలను ఆయుధాలుగా చేసుకొని ముస్లిం సమాజాన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో యూసీసీ కూడా భాగమేనని పీయూసీఎల్ సభ్యుడు ప్రసాద్ చాకో విమర్శించారు. ముస్లింల ప్రాబల్యాన్ని తగ్గించే దిశగా చట్టాలను రూపొందిస్తున్నారని, విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలతో కించపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి తరుణంలో యూసీసీ అవసరం ఉన్నదా అని ప్రశ్నించారు.

సంపాదకీయం

'రక్తహీనత ముక్త్‌భారత్' ఇంకెప్పుడు?

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడే మన భావి భారతం ఆరోగ్యంగా ఎదుగుతుంది. ఇది ఎవ్వరూ కాదనలేని సత్యం. కానీ మన దేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. దేశంలో 15 నుంచి 49 ఏండ్ల లోపు గర్భిణుల్లో సగానికన్నా ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారని తాజా లెక్కలు చెబుతున్నాయి. ఇవేవో ప్రయివేటు సంస్థలు చెప్పిన లెక్కలనుకుంటే పప్పులో కాలేసినట్టే. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఇటీవల ప్రకటించిన పచ్చినిజాలు. అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం మన దేశంలో గర్భం ధరించిన మహిళల స్థితి పై విధంగా ఉంది. అంతేకాదు రాష్ట్రాల వారీగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల శాతాన్ని కూడా ఈ నివేదిక బయటపెట్టింది. వీటిలో గుజరాత్, త్రిపుర వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలే అగ్రభాగాన ఉండటం గమనార్హం.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం నుంచి రక్తహీత సమస్యను తరిమేస్తామంటూ 2018లో 'రక్తహీనత ముక్త్‌భారత్' (రక్తహీనత రహిత భారతం) అనే విధానాన్ని ఎంతో గొప్పగా ప్రవేశపెట్టింది. ఇది అమల్లోకి వచ్చి ఏడేండ్లు గడుస్తున్నా ఫలితాల్లో పెద్దగా తేడాలు కనిపించడం లేదని తాజా సర్వేలే చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే 5 ప్రకారం కూడా మహిళలు, కౌమార దశలో ఉన్న బాలికల్లో, గర్భిణుల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని తేలింది. నిజానికి రక్తహీనత ముక్త్‌భారత్ అన్న సంకల్పంతో మొత్తం ఆరు లక్ష్యాలతో నివారణ మార్గాలను కేంద్రం సూచించింది. ఆ మేరకు ఆహార విధానం, వైద్య చికిత్స, ఐరన్ లోపాన్ని నివారించడం, తీవ్రమైన రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి వారికి తగిన చికిత్స అందించడం, దీని కోసం మెడికల్ ఆఫీసర్లకు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం వంటి విధానాలను ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చింది. కానీ ఇవేవీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.



మన తెలుగు రాష్ట్రాల్లో కూడా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. ఇక తెలంగాణలోనూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని అనేక లెక్కల సారాంశం. 15 నుంచి 45 ఏండ్లుగల మహిళలు మన రాష్ట్రంలో 57.6 శాతం ఉండగా, వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తేలింది. నిజానికి 2014-15తో పోల్చితే 2018-19లో సమస్య మరింత పెరిగింది. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో, బీజేపీ తీసుకొచ్చిన రక్తహీనత ముక్త్‌భారత్ ఏ మేరకు పని చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

గర్భిణి దశలో పోషకాహారం తీసుకోక పోవడం వల్ల తల్లీబిడ్డలపై దుష్ప్రభావం చూపుతోందని ఎన్నో నివేదికలు చెబుతున్నాయి. నాడీ సంబంధిత సమస్యలు, తక్కువ బరువు, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం, మృతశిశువు జన్మించడం వంటి సమస్యలకు గర్భిణులు ఎదుర్కొంటున్న రక్తహీనతే ప్రధాన కారణం. రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులకు పౌష్టికాహార సరుకులు అందడం గగనంగా మారిపోయిందనేది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. ప్రభుత్వాలు ఏండ్లుగా ఎన్ని విధానాలు తీసుకొచ్చినా రక్తహీనతను నివారించలేకపోతున్నాయి. పైగా నేడు మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా గర్భిణుల ఆరోగ్యం మరింత అధ్వాన్నంగా తయారవుతోంది.

దేశంలోని పెద్ద రాష్ట్రాల కేటగిరిలో అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 71.7 శాతం మంది రక్తహీనత బాధితులు నమోదయ్యారు. ఈ దుస్థితికి పౌష్టికాహార లోపమే ప్రధాన కారణమనేది నిపుణుల మాట. అలాగే ప్రసవ సమయంలో అధిక రక్తస్రావమైనప్పుడు రక్తహీనత ప్రాణాంతకంగా కూడా మారుతోంది. బాలింత మరణాలకు దాదాపు 70 శాతం ఇదే ప్రధాన కారణం. వీటికి తోడు విటమిన్ బి12, ఫోలేట్, ఎ విటమిన్ లోపాలు, వాయు కాలుష్యం కూడా తోడై సమస్యను మరింత జఠిలం చేస్తున్నదని నిపుణులు చెబుతున్నారు. కనుక పాలకులు సమస్య పరిష్కారం కోసం ఈ వైపుగా కూడా తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

సమస్య మూలాల్లోకి వెళ్లకుండా పరిష్కరించడం సాధ్యంకాదు. ఆరోగ్య భారతం నిర్మితమవ్వాలంటే గర్భిణులకు పౌష్టికాహారం అందుబాటులో ఉండాలి. రక్తహీనతకు గురికాకుండా వారు ఆరోగ్యంగా ఉండేలా చూడాలి. ఇది ప్రభుత్వాల కనీస బాధ్యత. దేశంలో మహిళల ఆరోగ్యాన్ని, భావిభారతాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించాలి. అభివృద్ధిని ప్రజల అవసరాలు తీర్చడంలో, వారి జీవన ప్రమాణాలను పెం పొందించే విధంగా చూడాలి. తాజా నివేదికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో తక్షణ చర్యలు చేపట్టాలి.

> ఇక తెలంగాణలోనూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని అనేక లెక్కల సారాంశం. 15 నుంచి 45 ఏండ్లుగల మహిళలు మన రాష్ట్రంలో 57.6 శాతం ఉండగా, వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తేలింది. నిజానికి 2014-15తో పోల్చితే 2018-19లో సమస్య మరింత పెరిగింది. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో, బీజేపీ తీసుకొచ్చిన రక్తహీనత ముక్త్‌భారత్ ఏ మేరకు పని చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

ఐరాసలో ఉక్రెయిన్ తీర్మానాలు - వివాదాస్పదమవుతున్న ట్రంప్ నిర్ణయాలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన రెండవ పదవీ కాలం తొలి నెల రోజుల్లో చేసిన ప్రకటనలు, తీసుకున్న నిర్ణయాల పరిణామాలు, పర్యవసానాల గురించి పరిపరి కథనాలు వెలువడుతున్నాయి. నిజంగా ఏం జరిగేది ఎవరూ చెప్పలేని స్థితి. రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలనే ఎత్తుగడతో అమెరికా ఉందని చెబుతున్నారు. సోమవారం నాడు ఐరాసలో జరిగిన పరిణామాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.తమపై నాలుగో ఏడాదిలో ప్రవేశించిన రష్యా సైనిక చర్యలను ఖండిస్తూ దాడులు నిలిపివేయాలని ఐరాస సాధారణ అసెంబ్లీలో ఉక్రెయిన్ సోమవారం నాడు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దానికి అనుకూలంగా 93, వ్యతిరేకంగా 18 దేశాలు ఓటు చేయగా, భారత్, చైనాతో సహా 65 దేశాలు తటస్థంగా ఉన్నాయి. గతంలో 140దేశాలు రష్యా చర్యను ఖండించే తీర్మానానికి మద్దతు ఇవ్వగా ఈసారి 93కు తగ్గాయి. ఉక్రెయిన్ తన తీర్మానాన్ని వెనక్కు తీసుకుని " త్వరగా సంక్షోభాన్ని ముగించాలని " తాను ప్రతిపాదించిన దానికి మద్దతు ఇవ్వాలని అమెరికా ఒత్తిడి చేసింది. మరోవైపున రష్యా మీద ఎలాంటి విమర్శ చేయకుండా సంక్షోభాన్ని ముగించాలని కోరుతూ భద్రతా మండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతుగా పది ఓట్లు రాగా ఐదుదేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. వాటిలో వీటో హక్కు కలిగిన బ్రిటన్, ఫ్రాన్సు కూడా ఉండటం విశేషం.

తమకు నాటో సభ్యత్వమిస్తే పదవి నుంచి వైదొలగటానికి కూడా సిద్ధమే అని, తమ ప్రాంతాలను ఆక్రమించిన పుతిన్ అక్కడే తిష్టవేయటాన్ని అంగీకరించేది లేదని జెలెన్‌స్కీ అంతకుముందు చెప్పాడు. తాము చేసిన ప్రతి డాలరు మిలిటరీ సాయానికి రెండు డాలర్లు చెల్లించాలని అమెరికా డిమాండ్ చేస్తోందన్నాడు. ఐదువందల బిలియన్ డాలర్ల ఖనిజాలను అప్పగించాలన్న వాషింగ్టన్ ఒత్తిడికి లొంగేది లేదని కూడా చెప్పాడు, అవసరమైతే వచ్చే పదితరాల వారు తమ రుణాలను తీర్చుకుంటారని అన్నాడు. విలువైన ఉక్రెయిన్ ఖనిజాల్లో 350 బిలియన్ డాలర్ల విలువ గలవి రష్యా అధీన ప్రాంతాల్లోనే ఉన్నాయని ఉపప్రధాని యులియా చెప్పాడు. ఉక్రెయిన్‌కు మద్దతు తెలిపేందుకు సోమవారం నాడు అనేక మంది ఐరోపా నేతలు కీవ్ చేరుకున్నారు. ఉక్రెయిన్‌పై ఒక నిర్ణయం తీసుకొనేందుకు, ఐరోపా రక్షణ గురించి చర్చించేందుకు మార్చి నెల ఆరోతేదీన సమావేశం కానున్నారు. రానున్న రెండు వారాల్లో రెండవసారి సమావేశమయ్యేందుకు అమెరికా, రష్యా ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. తప్పుడు సమాచార బుడగలో ట్రంప్ ఇరుక్కు పోయాడని అన్న జెలెన్‌స్కీని నియంత అని ట్రంప్ వర్ణించటాన్ని అర్థం చేసుకోదగినదే అని రష్యా సమర్థించింది.

రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలని నిజంగా ట్రంప్ భావిస్తే అది ఇప్పటికైతే ఊహాజనితమే. ఒకవేళ అదే జరిగితే ఇప్పటికే మరోవైపు ఉన్న భారత్, మూడో వైపు ఉన్న జపాన్‌తో కథ నడిపించి చైనాను దెబ్బ తీయా లన్న వ్యూహం ఉందన్నది ఒక దృశ్యం. ఇది కార్యరూపం దాలిస్తే ఐరోపాలో అమెరికా ప్రాబల్యం తగ్గి చైనా పలుకుబడి పెరుగుతుందని మరికొందరి హెచ్చరిక. ఉక్రెయిన్‌ను ఫణంగా పెట్టి రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంటే ప్రపంచంలో అమెరికాను నమ్మే పరిస్థితి ఉంటుందా? ట్రంప్‌ను నమ్మి రష్యా ముందుకు పోతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే అమెరికన్లు జి7 కూటమిని జి8గా మార్చి రష్యాను చేర్చుకొనేందుకు చూశారు. అది బెడిసికొట్టడంతో రష్యాను వ్యతిరేకించటమే గాదు, దానికి ముప్పు తెచ్చేందుకు చూశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి కారణం అదేకదా! గడచిన మూడేండ్లుగా ఆంక్షలతో ఆర్థికంగా దెబ్బతీసేందుకు చూసిన తీరు, ఉక్రెయిన్ పోరులో సంభవించినట్లు చెబుతున్న ప్రాణ, ఆర్థిక నష్టాలను మరచి రష్యన్లు కొత్త బాటలో నడు స్తారా? కష్ట సమయంలో ఆదుకున్న చైనాకు వ్యతిరేకంగా జట్టు కడుతుందా? పుతిన్ లేదా పాలకవర్గం లొంగిపోయినా జనం సమ్మతిస్తారా ? అమెరికాయే చేతగాక బేరసారాలకు దిగు తుంటే రష్యన్లు చైనాను కట్టడి చేయగలరా? ఇలాంటి అనేక ఊహాజనిత దృశ్యాలను కొందరు ఆవిష్కరిస్తున్నారు.



చరిత్రను చూస్తే నాటి సోవియట్-చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య తలెత్తిన సైద్ధాంతిక వివాదాలు, దేశాల మధ్య విభేధాలకు దారితీశాయి.1969లో ఆరు నెలలకు పైగా సరిహద్దులో ఇరు సైన్యాలను మోహరించటమే గాదు, స్వల్ప ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. దాన్ని వినియోగించుకొని సోవియట్‌ను దెబ్బతీసేందుకు అమెరికన్లు ప్రజా చైనాను గుర్తించి భద్రతా మండలిలో ప్రాతినిధ్యానికి అంగీకరించారన్నది ఒక అభిప్రాయం. తమ సమస్యల నుంచి బయటపడేందుకు విదేశాలకు మార్కెట్‌ను తెరిచే సంస్కరణలు అవసరమని చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. ఈ అవకాశాన్ని అక్కడ ఉన్న విస్తారమైన శ్రమశక్తిని కారుచౌకగా పొందేందుకు, మార్కెట్లో ప్రవేశించేందుకు అమెరికా విని యోగించుకుందన్నది మరొక సూత్రీకరణ. అంతిమంగా నాలుగు దశాబ్దాల అనుభవంలో ఎవరు ఎవరిని విని యోగించుకున్నారని బేరీజు వేస్తే ఎగుమతులతో చైనా దిగుమతులతో అమెరికా, ఐరోపా లబ్దిపొందాయి. కొన్ని లాటిన్ అమెరికా దేశాలు ఎగుమతి ఆధారిత వ్యవస్థలతో కొనసాగిన మాదిరి చైనా కూడా అలాగే ఉంటుందని భావించిన అమెరికా ఘోరంగా దెబ్బతిన్నది. అన్ని రంగాలలో తననే సవాలు చేసే విధంగా మారుతుందని అది అంచనా వేయ లేక పోయింది, గుర్తించేసరికే తమ చేతులు దాటిపోయినట్లు గమనించింది. దాని పర్యవసానమే డోనాల్డ్ ట్రంప్ తొలి పాలనా కాలంలో ప్రారంభించిన వాణిజ్య యుద్ధం. ఇప్పుడు దాని కొనసాగింపుతో మరోసారి ముందుకు పోనున్నట్లు సూచనలు.

చైనా గురించి మరోసారి అమెరికా అంచనాలు తప్పనున్నాయా? అట్లాంటిక్ పత్రిక వ్యాఖ్యాత కథనం చైనాకు ప్రపంచాన్ని అప్పగించనున్న ట్రంప్ అంటూ సాగింది. ఇది సామ్రాజ్యవాదుల కోణంలో ఆలోచిస్తున్నవారి బుర్రలో పుట్టిన బుద్ధి అని చెప్పవచ్చు." అమెరికా ప్రపంచ నాయకత్వం ముగుస్తున్నది. ఇది అమెరికా దిగజారి లేదా బహుధ్రువ ప్రపంచం ఉనికిలోకి వచ్చికాదు లేదా అమెరికా ప్రత్యర్థుల చర్యలతో జరుగుతున్నది కాదు. నాయకత్వ ముగింపు, ఎందుకంటే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నాడు గనుక. ఇంటా బయటా ట్రంప్ విధానాలు అత్యంత వేగంగా అమెరికా అధికార పునాదులను నాశనం చేస్తున్నాయి. ప్రపంచ అగ్రశక్తిగా ప్రస్తుతం అమెరికాను పక్కకు నెట్టి దాని స్థానాన్ని ఆక్రమించాలని చూస్తున్న చైనా నేత షీ జిన్‌పింగ్ ప్రధాన లబ్దిదారు అవుతాడు. ప్రపంచాన్ని హ్రస్వదృష్టితో చూస్తున్న ట్రంప్‌కు తానేం చేస్తున్నదీ తెలియటం లేదు, అతడి చర్యలు అంతర్జాతీయ భద్రతకు ముప్పు తెస్తున్నాయని, అమెరికా భవిష్యత్ కూడా దానితోనే ముడిపడి ఉందని తెలుసుకోలేక పోతున్నాడు, అమెరికా వదలిన ఖాళీలో చైనా ప్రవేశాన్ని ఇతర ధనిక దేశాలు అడ్డుకోవలేవంటూ ఆ పత్రిక విశ్లేషణ కొనసాగింది.

వాణిజ్య యుద్ధం గురించి అమెరికా గతంలో వేసుకున్న అంచనాలు తప్పాయి. 2024లో అమెరికా వాణిజ్య లోటు లక్ష కోట్ల డాలర్లుగా ఉంటే చైనా వాణిజ్య మిగులు కూడా అంతే ఉంది. అమెరికా, ఐరోపాలో కోల్పోయిన మార్కెట్లను మరోచోట పొందేందుకు చైనా ముందుకు పోతున్నది.ట్రంప్ ప్రకటించినట్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి వాటి నుంచి అమెరికా వైదొలిగినా, యుఎస్ఎయిడ్ ఆకస్మికంగా నిలిపివేసినా ఆ స్థానాన్ని చైనా ఆక్రమిస్తుందని కొందరు ఇప్పటికే హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్ధరించే పేరుతో సాయం బిస్కెట్లతో పలు దేశాల్లో పాగా వేయాలని చూసిన అగ్రదేశపు అమెరికా ఎత్తుగడ ఫలించలేదు. అలాంటిది అంతశక్తిలేని చైనా వల్ల అవుతుందా? నిజానికి చైనా నేరుగా అప్పులిస్తున్నది తప్ప అమెరికా, జపాన్, మరొక ధనిక దేశం మాదిరి సాయం పేరుతో షరతులతో కూడిన నిధులు ఇవ్వటం లేదు, అలాంటి ఏర్పాట్లు కూడా లేవు. అమెరికా సాయం పొంది బాగుపడిన దేశాలేమిటంటే ఎవరూ చెప్పలేరు, కానీ అనేక దేశాల్లో మౌలిక సదుపాయాల్లో చైనా పెట్టుబడుల ఫలితాలు కనిపిస్తున్నాయి. చరిత్రలో మార్కెట్ల కోసం ఏకంగా దేశాలనే ఆక్రమించుకోవటం తెలిసిందే. తొలి వాణిజ్య యుద్ధం చైనా-బ్రిటన్ మధ్య నల్లమందు దిగుమతుల మీద జరిగింది. రెండవది కూడా అదే సమస్య మీద బ్రిటన్, ఫ్రాన్స్ కలసి చేశాయి. తొలి యుద్ధంలో నల్లమందును ధ్వంసం చేసినందుకు చైనా నష్టపరిహారం చెల్లించటంతో పాటు హాంకాంగ్ దీవులను బ్రిటన్‌కు 99 సంవత్సరాల పాటు కౌలుకిచ్చేందుకు ఒప్పందం జరిగింది. రెండవ యుద్ధంలో నల్లమందు విక్రయాలను చట్టపరంచేసేందుకు ఒప్పందాన్ని రుద్దారు. వర్తమాన వాణిజ్య యుద్ధాన్ని చైనా మీద అమెరికా 2018లో ప్రారంభించింది.ట్రంప్ దిగిపోయినా బైడెన్ కొన సాగించాడు, తిరిగి ట్రంప్ వచ్చాడు. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడూ చైనా కుంగిపోలేదు, ఇప్పుడు మరింత సమర్థవంతంగా ఎదుర్కొనే బలాన్ని కలిగి ఉంది.వాణిజ్యపోరు కరెన్సీ పోరుకు విస్తరించింది.

కెనడా, మెక్సికోల మీద 25శాతం పన్ను విధిస్తానన్న ట్రంప్ చైనా దగ్గరకు వచ్చేసరికి పదిశాతమే అన్నాడు.నిజానికి 2024లో జో బైడెన్ చైనా నుంచి దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాలపై 100, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ల మీద 50, లిథియం అయాన్ బాటరీలపై 25శాతం చొప్పున దిగుమతి సుంకాలు విధించాడు. తాజాగా ట్రంప్ చేసిన ప్రక టనను అసలు చైనా పట్టించుకోలేదనే చెప్పాలి. కొన్ని నామమాత్ర చర్యలు తీసుకుంది. అవి అమెరికా నుంచి దిగుమతయ్యే వాటిలో పదో వంతు వస్తువుల మీదనే అని వార్తలు.పెద్ద మొత్తంలో సుంకాలు విధిస్తే ఎక్కువగా నష్టపోయేది అమెరికాయే గనుక ఎంతవరకు ముందుకు పోతుందో చూద్దాం అన్నట్లుగా చైనా ఉంది. ఎనిమిదేండ్ల నాటితో పోలిస్తే తాజా బెది రింపు లెక్కలోది కాదని భావిస్తోంది. అందుకే ట్రంప్ ప్రకటనలను అది ఖాతరు చేయటం లేదు.దీని అర్థం అసలేమీ ప్రతికూల ప్రభావాలు ఉండవని కాదు.

ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్న పూర్వరంగంలో అమెరికా పాలకవర్గం చూస్తూ ఊరుకుంటుందా? శత్రువుగా పరిగణించే చైనాతో పాటు తన కనుసన్నల్లో నడిచే కెనడా, మెక్సికో, ఐరోపా దేశాలు, చేతులు కలిపేందుకు తహతహలాడుతున్న భారత్ మీద కూడా బస్తీమే సవాల్ అన్నట్లుగా మాట్లాడుతున్నాడు. ఆయా దేశాలతో బేరమాడేందుకు అయితే సరే, మొదటికే మోసం వస్తే పాలకవర్గం సహించే సమస్యే లేదు. దాని డిఎన్ఏలో ఎలాంటి మార్పులు ఉండవు. ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువగా పాల్గొనేందుకు ప్రోత్సహించటానికి మనమెందుకు డబ్బు ఇవ్వాలంటూ ట్రంప్ చేసిన ప్రకటన అమెరికా సామాన్యులను ఆకట్టుకుంటుందనటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సాయం పేరుతో జరుపుతున్న కార్యకలాపాలు వేరు. ఇప్పటి వరకు జరిపిన వాటితో ఫలితం లేకపోతే సమీక్షల తరువాత కొత్త రూపాలతో అమెరికా రంగంలోకి దిగుతుంది తప్ప వెనక్కు తగ్గే అవకాశం లేదు !

> రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలని నిజంగా ట్రంప్ భావిస్తే అది ఇప్పటికైతే ఊహాజనితమే. ఒకవేళ అదే జరిగితే ఇప్పటికే మరోవైపు ఉన్న భారత్, మూడో వైపు ఉన్న జపాన్‌తో కథ నడిపించి చైనాను దెబ్బ తీయా లన్న వ్యూహం ఉందన్నది ఒక దృశ్యం. ఇది కార్యరూపం దాలిస్తే ఐరోపాలో అమెరికా ప్రాబల్యం తగ్గి చైనా పలుకుబడి పెరుగుతుందని మరికొందరి హెచ్చరిక. ఉక్రెయిన్‌ను ఫణంగా పెట్టి రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంటే ప్రపంచంలో అమెరికాను నమ్మే పరిస్థితి ఉంటుందా? ట్రంప్‌ను నమ్మి రష్యా ముందుకు పోతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే అమెరికన్లు జి7 కూటమిని జి8గా మార్చి రష్యాను చేర్చుకొనేందుకు చూశారు. అది బెడిసికొట్టడంతో రష్యాను వ్యతిరేకించటమే గాదు, దానికి ముప్పు తెచ్చేందుకు చూశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి కారణం అదే కదా!

> కెనడా, మెక్సికోల మీద 25శాతం పన్ను విధిస్తానన్న ట్రంప్ చైనా దగ్గరకు వచ్చేసరికి పదిశాతమే అన్నాడు.నిజానికి 2024లో జో బైడెన్ చైనా నుంచి దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాలపై 100, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ల మీద 50, లిథియం అయాన్ బాటరీలపై 25శాతం చొప్పున దిగుమతి సుంకాలు విధించాడు. తాజాగా ట్రంప్ చేసిన ప్రక టనను అసలు చైనా పట్టించుకోలేదనే చెప్పాలి. కొన్ని నామమాత్ర చర్యలు తీసుకుంది. అవి అమెరికా నుంచి దిగుమతయ్యే వాటిలో పదో వంతు వస్తువుల మీదనే అని వార్తలు.పెద్ద మొత్తంలో సుంకాలు విధిస్తే ఎక్కువగా నష్టపోయేది అమెరికాయే గనుక ఎంతవరకు ముందుకు పోతుందో చూద్దాం అన్నట్లుగా చైనా ఉంది.

'అందరికీ విద్య' అందని ద్రాక్షేనా?

ఒకప్పుడు ఎంతగానో ఆరాధించిన ప్రభుత్వ విద్య రానురానూ ప్రజాధారణ కోల్పోతున్నదేమోననే ఆందోళన కలుగుతున్నది. మరోపక్క ప్రయివేటు రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈవ్యాపారంలో కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు కూడా నేరుగా భాగస్వాములవుతున్న పరిస్థితి నేడు నెలకొంది. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా, అమలు చేయ గలిగిన సామర్థ్యంగల అధికారగణం ఉన్నా పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రయివేటు బడుల్లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో ఇవి నడిచేవి. వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభ నష్టాలతో సంబ ంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో విద్యనందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి బడులు నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రయివేటు పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండా పోయింది. అందుకే చట్టాల అవసరం అప్పట్లో తలెత్త లేదు. ఇక ప్రభుత్వరంగంలో కూడా ఆనాడు ఎంతో ప్రతిష్టంగా నడిచేవి. రాజకీయ జోక్యం ఉండేది కాదు. కానీ రానురానూ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు



అడుగంటి పోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రయివేటు పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపే మొగ్గు చూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతులు లేనివారు, మరోదారి లేక విధిలేని పరిస్థితుల్లోనే ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ఇటీవల కాలంలో గ్రామాలకు కూడా ఈ ప్రయివేటు విద్యావ్యాపారం విస్తరించింది. ఇక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. ఏడాదికేడాది చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రయివేటు రంగంలో పెరిగిపోతున్నది.

ఇటీవల సాక్షాత్తూ తెలంగాణ సర్కార్ పాఠశాలల విద్యకు సంబంధించిన వివరాలు అసెంబ్లీలో వెల్లడించింది. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వబడుల్లో చదివే విద్యార్థులు 30లక్షల 78వేల 109 మంది ఉండగా ప్రయివేటులో 20లక్షల67వేల 597 మంది ఉన్నారు. అయితే 2022-23 విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సంఖ్య తగ్గి ప్రయివేటు రంగంలో పెరిగిపోయింది. సర్కారు బడులకంటే ప్రయివేటు స్కూల్లో దాదాపు రెండు లక్షల మందికి పైగా విద్యార్థులు అదనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింత తగ్గిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇరవైఆరు లక్షల ముప్పైఆరువేల ఆరువందల ముప్పైకి పరిమితం కాగా, ప్రయివేటు బడుల్లో ముప్పైనాలుగు లక్షలకుపైగా ప్రవేశాలు పెరిగిపోయాయి. అంటే దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ఏడు లక్షలకుపైగా ఎక్కువమంది చేరారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం కూడా అదే పరిస్థితి. ఇలాగే ప్రభుత్వరంగంలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ఆ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో? ఎందుకు ఈ పరిస్థితి? కారకులెవరు? కారణాలేమిటి? అనేది అటు అధికార వర్గాలకు కానీ, పాలకులకు కానీ తెలియనిది కాదు. 'మధ్యాహ్న భోజనం పెడతాం, పుస్తకాలు ఉచితంగా ఇస్తాం, బోధన ఫ్రీగా చేస్తా మంటూ' సకల విధాల ప్రాధేయపడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలితాలనివ్వడం లేదు.దానికి కారణం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు పాలకులు సరైన అవగాహన కల్పించకపోవడమే.

భరించలేని ఫీజులు ప్రయివేటు రంగంలో కట్టాల్సివస్తున్నా అటువైపే మొగ్గు ఎందుకు చూపుతున్నారో ఇప్పటికైనా సర్కార్ ఆలోచించాలి. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉన్నా, ఆచరణకొచ్చేసరికి అసలు సమస్యలే గుదిబండలా మారుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యం గా పాఠశాలల్లో కనీసవసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. మన రాష్ట్రం వరకు పరిశీలించినా వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంచినీరు, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు లేక పోవడం ప్రత్యేకంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కనుచూపుమేరలో కన్పించడం లేదు. దేశాభివృద్ధికే కాదు మానవజాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. 06 నుంచి 14 యేళ్ల బాలబాలికలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమాన్ని పదేండ్లలోనే పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే 'కన్నుమూసింది'. ఇక డిపెప్, ఎపెప్ సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడుతుంటే ప్రేక్షక పాత్ర వహించ డం ఏమాత్రం సరికాదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి.

- సభావట్ కళ్యాణ్, 9014322572

పాటలు పుట్టిన తావుల్లో 'ప్రజా సంస్కృతి'



భూపతి వెంకటేశ్వర్లు
9490098343

మనిషి బతికేందుకు గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, వాటి సమానస్థాయికి సరితూగ గలిగేది ఏదైనా ఉందంటే అది మన 'సంస్కృతి'. మూఢనమ్మకాల సుడిగుం డంలో కొట్టుకు పోతున్న నేటి సమాజానికి ఇది చాలా ముఖ్యం. దీనికి కావాల్సింది ధనమో, దర్పమో కాదు, ఒక మహత్తరమైన సాంఘిక శక్తి సమహారం. 'అబద్ధాల ఫ్యాక్టరీ'లో, 'వాట్సాప్ యూనివర్సిటీ'లో తమకు కావాల్సిన భావజాలాన్ని ఉత్పత్తి చేసుకున్నట్టుగా ఇది ఉండదు. శ్రమైక జీవన సౌందర్యపు చెమటచుక్కల నుంచి పుట్టు కొచ్చేది. సామాజిక అవసరాలకు ఉప యోగపడే వృత్తుల నుంచి ఉద్భవించేది. పొలంలో పని చేస్తున్న కూలీల గొంతులో కడలి స్వరంలా ఉప్పొంగేది. ఒక్కటేమిటి? చూసే కోణం ఉండాలి గానీ, అది మనతో, ప్రకృతితో ముడి వేసుకున్న బంధం. అందులో అణువణువునా దాగి ఉన్నదే 'ప్రజాసంస్కృతి'. దీన్ని నియమ బద్ధంగా, శాస్త్రీయంగా వర్ధిల్లేలా చూస్తేనే పురోగమన భావాల వైపు ప్రజా చైతన్యంగా పురోగమిస్తుంది. లేదంటే చైతన్య హీనమై చతికిల పడుతుంది.ఇది మానవ జాతికి అతిపెద్ద ప్రమాదకరం.

ఈ దశాబ్దకాలంగా జరుగుతున్న ఘటనల్ని చూస్తే మనం దేశం ఎటువైపు పయనిస్తోందో తెలుస్తూనేవుంది. కలంపై దాడి, గళంపై దాడి, మతంపై దాడి, విశ్వాసంపై దాడి, చివరకు సంస్కృతిపైన కూడా దాడే. చిమ్మ చీకట్లో కూడా ప్రశ్న బతికి బట్టకట్టాలన్నా, మనిషి స్వేచ్ఛగా జీవించాలన్నా ఒక మహా ప్రయత్నమే చేయాల్సిన అవసరం ఉన్నది. అందుకు యువతీయువకుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడం ఒక్కటే మార్గం. మానవ జీవితాలను ముందుకు నడిపించే జ్ఞానమే సంస్కృతి. ఈ జ్ఞానమే లేనప్పుడు అశాస్త్రీయ వాదనలు, అన్యాయాలు, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం, కర్మ, రాత ఇలాంటివే ముందుకొస్తాయి. దేశంలో అలుముకుంటున్న ఒక తీవ్ర జాతీయవాద నిరంకుశ వాతా వరణాన్ని ఏదో ఒక స్థాయిలో నిలువరించాలి. దానికో సువిశాల వేదిక ఏర్పడాలి. అలాంటి బాధ్యతను భుజాల మీదేసుకుని ప్రజల్ని చైతన్యపరుస్తున్నది తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే).

దేశంలో రాజకీయ అనిశ్చితి పరిస్థితులు, వాటికి కొమ్ముకాస్తున్న ఆధిపత్య శక్తులు, తిరోగమనం వైపు నడిపించే 'పరివార్' కుట్రల గురించి సమాజానికి నిరంతరం తెలియజేస్తూ వారిని జాగరుకత పరుస్తున్నది టీపీఎస్‌కే. ఇటీవల కాలంలో సుద్దాల హనుమంతు పేరుమీద ప్రజా సాంస్కృతిక ఉత్సవాలను మహబూబ్‌నగర్ పట్టణంలో రెండురోజుల పాటు వైభవంగా నిర్వ హించింది. పండుగ సాయన్న, మీర సాయబ్, దున్న ఇద్దస్, సురవరం లాంటి మహనీయులకు ప్రఖ్యాతి గాంచిన నేల పాలమూరు. ఎక్కడెక్కడో సెలయేళ్లలో వర్షపు నీరంతా వచ్చి మహా సముద్రంలో మమేకమైన ట్టుగా విద్యార్థి, యువజనులంతా ప్రజా సంస్కృతిలో భాగమై ఒక్కటిగా నిలిచారు. ఏకకాలంలో భారత రాజ్యాంగంలోని ప్రధాన సూత్రాలైన ప్రజాస్వామ్య, సార్వభౌమ, గణ తంత్ర, స్వేచ్ఛా సమానత్వం పేర్లతో ఏర్పాటైన నాలుగు వేదికలపై, ఇరవైఆరు కళాశాలల నుంచి వచ్చిన పన్నెండు వందల మంది ఏకధాటిగా సంస్కృతిని ఎలుగెత్తి చాటారు. పరీక్షలకు పదినిమిషాలుండగా కూడా వేదికపై ఆడి పాడి పరీక్షలు ప్రశాంతంగా రాసి ఆటాపాటలు చదువుకు అడ్డుకాదని నిరూపించారు. జానపద సాహిత్యం ద్వారా జాతి సంస్కృతిని తెలిపారు. వీరుల చరిత్రను, ధిక్కార వారసత్వాన్ని కాపాడుకోవాలని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గుర్తుచేశారు. సహేతుకమైన సత్యాలను కళల ద్వారా అందించారు.

తెలంగాణ భూమి పండిన "పంట పొలం" వంటిది. ఎన్నో రకాల జానపద కళల్ని సుసంపన్నం చేసిన చరిత్ర ఈ తెలుగు నేలది. దానికి తగినట్టుగానే కట్టిపడేసే కళారూపాలు, గిరిజనుల నృత్యాలు, అలరించే ఆటలు, పట్టణ ప్రజల్ని ఆలోచింపజేసి అడుగడుగునా వారి అభిమానాన్ని ఈ ఉత్సవాల్లో చురగొన్నారు. శాంతి సామరస్యం, ఐక్యత, సృజనాత్మకత, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఆఫ్రికా ఖండం నమిభియా దేశ ఆరోగ్య శాఖ మంత్రి బెర్నాడ్, స్థానిక ఎమ్మెల్యే, సినీ సంగీద దర్శకుడు సుద్దాల అశోక్ తేజ వంటి ప్రముఖులు హాజరై ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చారు. ఉర్దూ పాఠశాల విద్యార్థినులు స్వయంగా రాసి ప్రదర్శించిన లఘునాటిక 'ఊడలు దిగిన వికృత సంస్కృతి' అందర్నీ ఆకట్టుకుంది. ఈ నాటికలో దేశాలకు సరిహద్దులుంటాయి, ప్రపంచ ప్రజల మధ్య అసమానతలుంటాయి, విశ్వమానవాళి ఇంటర్‌నెట్‌కి ఏ హద్దుల్లేవు, అంతర్జాలాన్ని ముంచెత్తుతున్న అశ్లీల దృశ్యాల నడుమ బాల్యం బాధాకరంగా మారిందని మొబైల్‌కు "బై" చెప్పి, పుస్తకాలకు "హాయ్" చెప్పే చక్కటి సందేశాన్నిచ్చారు. మరోవైపు "నేనెప్పుడూ రాజ్యానికి ప్రతిపక్షమే " అంటూ కవులు, కవయిత్రులు కవి సమ్మేళనం నిర్వహించారు. చిత్రకారులు "మేమంతా ఒక్కటే " అంటూ దేశ సమైక్యత చిత్రాలు గీసారు. శాస్త్రీయ నృత్యాలు, బతుకమ్మ, కోలాటం, లఘు నాటికలు, భజన, జానపద కళారూపాలు, తీరొక్క వేషాలు, సాహిత్య, సాంస్కృతికంగా కోలాహలంగా.. గుంపులు గుంపులుగా తరలివచ్చారు. సుద్దాల వేదిక అంటేనే పాటల యుద్ధాల, ప్రగతిశీల ప్రభాత దృక్పథాన్ని ప్రతిబింబించాయి. మైనార్టీ పిల్లలు, ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. విదేశీ సంస్కృతి అన గానే..? చెత్త అని స్వదేశీ సంస్కృతి అంతా బంగా రమని, అలాంటి వివాదాలకు పోకుండా విదేశీ, స్వదేశీ అనేవి కలగలిసిపోయాయి. వాటి వర్గ సారాన్ని బట్టి మన వైఖరి ఉండాలని బ్రేక్ డ్యాన్స్, వెస్ట్రన్ డాన్స్, పాప్ సంగీతం, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం అన్ని రూపాలను ప్రజలకు చక్కటి సందేశాన్ని అందించే భావజాలంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సమానత్వ అవగాహనను శక్తివంతంగా చూపించారు. ప్రత్యామ్నాయ భావజాలాన్ని బలంగా చెప్పారు. లౌకిక భావాలు, ప్రజాస్వామిక విలువలు, సామాజిక వివక్షలు, పురుషాధిక్య భావజాలంతో ముడిబడ్డ సమస్యలు, వినిమయతత్వం, వ్యక్తి వాదంతో వచ్చే పర్యావ సానాల వంటి అంశాలను కళారూపాల్లో వ్యక్తం చేశారు. భావ సారూప్యత గలిగిన వ్యక్తులు, అనేక సంస్థలు కలగలిసిన కార్యక్రమమిది. "ఆట పాటలు సమాజంలో మంచి, చెడ్డల విచక్షణ విప్పి చెప్పే ఆయుధాలు. వాటిని ధరించిన యువకులతో అడు గులు కలపడమే నేటి ప్రత్యామ్నాయం, సుద్దాల సాంస్కృతిక ఉత్సవాలు ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చినవి. ప్రజా సంస్కృతిని పాదుకొల్పేలా ఊతమిచ్చినవి. ఇలాంటివి గల్లీ గల్లీనా, పల్లెపల్లెనా, ఊరుఊరునా ఈ ఉత్సవాలు నిరంతరం నిర్వహించాలి. 'సముద్రం విషపూరితం కానంత వరకే జలచరాల మనుగడ' ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి గమనంలో ఉండాలి. మనువాద సాహిత్యం ఎక్కడ జడలు విప్పుతుందో.. నిజమైన సాహి త్యం, ప్రజాసంస్కృతి అక్కడ పుట్టుకు రావాలి.ఫాసిస్టు ఆధిపత్యపు రెక్కల్ని విరిచేలా ప్రజల్లో మానసికతను చైతన్యాన్ని పెంపొందించాలి. 'ఇక చీకటి యుగం ముగుస్తుంది.. పోరాడే వారు గెలుస్తారు' అన్న భరోసా, ఆత్మవిశ్వాసం ఈ ఉత్సవాల్లో పాల్గొన్న యువతరంలో కనిపించింది. యువజనుల కలయికలో కలవరం వుంది, ఇది వాస్తవం. వాళ్ల సాంస్కృతిక పోరాటంలో న్యాయం ఉంది, ఇది చైతన్యం. వారి పాటలో నైతికత ప్రకటన ఉంది, ఇది దాని మౌలిక స్వరూపం. ఈ విష యాల న్ని సాంస్కృతిక ఉద్యమాల కిందకు వచ్చే విధంగా చూడాలి. వాళ్ల సృజనకు తగిన వేదికలు ఆ పోరా టాలే కల్పించాలి. అంధకారంలో జీవిస్తున్న ప్రజా నీకాన్ని సాంస్కృతికరంగం వైపు మళ్లించాలి. ఇది ఆరంభం కాదు, ముగింపు అంతకన్నా కాదు, ఒక అనుభవం మాత్రమే. దీన్ని అణచివేయబడుతున్న వారి బాటల్లో విస్తరించే బాధ్యత లౌకిక సమాజానిదే.

> 'ఇక చీకటి యుగం ముగుస్తుంది.. పోరాడే వారు గెలుస్తారు' అన్న భరోసా, ఆత్మవిశ్వాసం ఈ ఉత్సవాల్లో పాల్గొన్న యువతరంలో కనిపించింది. యువజనుల కలయికలో కలవరం వుంది, ఇది వాస్తవం. వాళ్ల సాం స్కృతిక పోరాటంలో న్యాయం ఉంది, ఇది చైతన్యం. వారి పాటలో నైతికత ప్రకటన ఉంది, ఇది దాని మౌలిక స్వరూపం. ఈ విష యాల న్ని సాంస్కృతిక ఉద్యమాల కిందకు వచ్చే విధంగా చూడాలి.



పసికందుల విక్రయ అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

నలుగురిని రక్షించిన మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ బృందం • 11 మంది నిందితుల అరెస్ట్ • ఎస్‌వోటీ బృందాన్ని అభినందించిన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి, సరిగా కండ్లు కూడా తెరువని చిన్నారులను దళారులు ఎత్తుకెళ్తున్నారు. పసికందులను తల్లి పొత్తిళ్ల నుంచి దూరం చేస్తున్న దుండగులు గుజరాత్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. డబ్బుల కోసం రాష్ట్రాలు దాటించి అమ్మేస్తున్న ముఠా గుట్టును మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ బృందం రట్టు చేసింది. నలుగురు పసికందులను (ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు) రక్షించిన ఎస్‌వోటీ బృందం.. 11 మంది నిందితులను అరెస్టు చేసింది. మంగళవారం రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ వి.రమణారెడ్డితో కలిసి సీపీ జి.సుధీర్‌బాబు పూర్తి వివరాలు వెల్లడించారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన కోలా కృష్ణవేణికి సంతానం కలగలేదు. ఈ కారణంతో ఆమెను భర్త వదిలేయడంతో ఓ ప్రయివేటు సంస్థలో మెడికల్ రిప్రజెంటీవ్‌గా చేరింది. ఈ క్రమంలో ఆమెకు తెలిసిన ఓ వ్యక్తి తనకు పిల్లలు కావాలని, దత్తత తీసుకుంటానని, అందుకు కావాల్సినంత డబ్బులు చెల్లిస్తానని కృష్ణవేణికి చెప్పాడు. దాంతో ఆమె సోషల్‌మీడియాలో సెర్చ్ చేసింది. ఈ క్రమంలో 2024లో ఢిల్లీకి చెందిన మనోజ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతను పిల్లలను విక్రయిస్తుంటాడు. రూ.ఐదు లక్షలకు బాబును విక్రయించేందుకు హైదరాబాద్‌కు వచ్చాడు. బాబును విక్రయిస్తుండగా ఇద్దరినీ గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు.

జైలు నుంచి బయటకు వచ్చిన కృష్ణవేణి కొత్తపేటకు చెందిన దీప్తి, సికింద్రాబాద్‌కు చెందిన సంపత్‌కుమార్‌తో కలిసి సోషల్‌మీడియా సహాయంతో గుజరాత్‌కు చెందిన వందన అనే నిందితురాలితో పరిచయం పెంచుకున్నారు. వీరితోపాటు కొత్తపేటకు చెందిన బి.శ్రావణ్ కుమార్, ఫలక్‌నుమాకు చెందిన ఏ.శారదా, సికింద్రాబాద్‌కు చెందిన బి.సంపత్‌కుమార్ కలిసి ముఠాగా ఏర్పాడ్డారు.

మగ పిల్లవాడు అయితే రూ.1.5లక్షలు, అమ్మాయి అయితే రూ.2.5లక్షలు ఇచ్చేలా కృష్ణవేణితో వందన ఒప్పందం చేసుకుంది. గుజరాత్ నుంచి పసికందులను (ఇద్దరు మగ, ఇద్దరు ఆడ పిల్లలు) హైదరాబాద్ తీసుకొచ్చారు. ఈ ఏడాది జనవరి 28న ఓ పాపను విజయవాడలో రూ.2.7లక్షలకు విక్రయించారు. ఈ నెల 4న మరో పాపను రూ.2.5లక్షలకు సైదాబాద్‌లో విక్రయించారు. ఈనెల 12న మగ పసికందును మహబూబాబాద్‌లో ఓ జంటకు రూ.4.8లక్షలకు విక్రయించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు పిల్లలకు సంబంధించిన పత్రాలను నిందితులు సృష్టించారు. మరో బాబును చైతన్యపురి బస్టాండ్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్‌వోటీ డీసీపీ రమణారెడ్డి సీపీ దృష్టికి తీసుకెళ్లారు. సీపీ ఆదేశాలతో అదనపు డీసీపీ ఎన్.నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జానయ్య బృందాన్ని అప్రమత్తం చేశారు. చైతన్యపురి ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావుతో కలిసి ప్రత్యేక నిఘా వేశారు. పసికందును విక్రయిస్తున్న సమయంలో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణలో నిందితులు చెప్పిన వివరాల మేరకు చిన్నారులను విక్రయించిన వారితోపాటు తరలించినవారు, పిల్లలను కొనుగోలు చేసిన వారిని కూడా అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వందన కోసం గాలిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పిల్లలను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేయడం, చిన్నారులను రక్షించడంతో ఎస్‌వోటీ బృందాన్ని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వి.శ్రీకాంత్ గౌడ్, ఎస్‌వోటీ, చైతన్యపురి పోలీసులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలివ్వాలి

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమయ్య, బసవపున్నయ్య

హైదరాబాద్‌లో హెచ్‌యూజే ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి బసవ పున్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (రిజిస్టర్డ్ నెంబర్ బి-2794)(హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్ అనుబంధం) సభ్యత్వ నమోదు కార్యక్రమం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే)లో మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవ పున్నయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్‌యూజే అధ్యక్షుడు బి అరుణ్ కుమార్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు జర్నలిస్టులకు హెచ్‌యూజే సభ్యత్వాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య, బి బసవ పున్నయ్య మాట్లాడుతూ టీడబ్ల్యూజేఎఫ్ అనుబంధ సంఘంగా కొనసాగుతున్న హెచ్‌యూజే చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నెలరోజులపాటు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటం చేస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ నగరంలోని జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పనిచేసే సంఘం హెచ్‌యూజే మాత్రమేనని వారు ఉద్ఘాటించారు. అర్హులైన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల స్థలాలను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్డులను ఇవ్వాలనీ, అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్ట్ బీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలని సూచించారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలనీ, అందుకోసం ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. హెచ్‌యూజే అధ్యక్షుడు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం హెచ్‌యూజే నిరంతరం పోరాడుతున్నదని అన్నారు. సమస్యలపై జరిగే పోరాటాల్లో జర్నలిస్టులు భాగస్వామ్యం కావాలని కోరారు. హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు అండగా ఉండేది ఈ సంఘమేనని చెప్పారు. హెచ్‌యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం వచ్చేనెల 25 వరకు కొనసాగుతుందని వివరించారు.

హైదరాబాద్‌లో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె నిరంజన్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు వి కిష్టయ్య, సంయుక్త కార్యదర్శులు ఎం జీవన్ రెడ్డి, కె నర్సింహా, అచ్చిన ప్రశాంత్, కార్యవర్గ సభ్యులు పి విజయ, ఎండీ నిస్సార్, కె వెంకటస్వామి, పురుషోత్తం, సభ్యులు రమాదేవి, ఆర్ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఎం శ్రీనివాస్, ఖుర్షీద్, సునీల్ యాదవ్, లక్ష్మీనారాయణ, సంతోష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం అదనంగా యూరియా ఇవ్వలేదు

• మంత్రి తుమ్మల వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అడిగినదానికంటే అదనంగా యూరియా ఇచ్చిందంటూ బీజేపీ నేతలు చెప్పడాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌కు 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని చెప్పి, 6.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ చేసినప్పటికి రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు ప్రణాళికతో యూరియా సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకున్నామని తెలిపారు. బీజేపీ నేతలు చెబుతున్నట్టు అదనంగా ఇచ్చారన్నది అవాస్తవమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నట్టు రాష్ట్రంలో యూరియా కొరత లేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో ఎరువుల కొరత లేదు

• కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు • రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఎరువుల కొరత లేదనీ, కొందరు కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఒక్కరోజు ఆలస్యం కాకుండా రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ యోజన డబ్బులను వేశామని తెలిపారు. తెలంగాణలో 31 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎరువుల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి జేపీ నడ్డాతో ఫోన్‌లో సంప్రదించాననీ, రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే ఎక్కువ కోటా విడుదల చేశామని తెలిపారని వివరించారు. రాష్ట్రానికి 9.5 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే 10 లక్షల మెట్రిక్ టన్నులను పంపామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే కొంతమంది వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంకా 1.22 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అదిగాక 6వేల టన్నులను కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ద్వారా తెలంగాణకు తీసుకొచ్చేందుకు ప్రణాళిక చేశామన్నారు. యూరియాను సరఫరా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని నొక్కిచెప్పారు. యూరియా కోసం రైతులు క్యూలో ఉండటం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను వ్యక్తిగతంగా కలిసేందుకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు ఎవరినో ఒకరిని ఎన్నుకుంటే లాభం లేదన్నారు. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకలు, ప్రభుత్వాలను నిలదీసే సత్తా ఉన్న వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ పోరాడుతున్నదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అతని అసమర్థతను తమపై రుద్దుతున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో నిర్మాణం చేయదలిస్తే కేంద్రం ఎందుకు అడ్డుకుంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు నిర్మాణం చేస్తే తమకు అడ్డుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర ప్రభుత్వం విచారిస్తుందా? సీబీఐకి అప్పజెప్పుతుందా? అనే దాన్ని తేల్చాలన్నారు. నీటి వివాదాలపై సమిష్టిగా నిర్ణయం తీసుకుని పోరాడాలనీ, సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కాళేశ్వరం, ఈరేసు, ఫోన్‌ట్యాపింగ్ కేసుల్లో చేతనైతే దర్యాప్తు చేసి శిక్షించాలనీ లేదంటే సీబీఐకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

టన్నెల్ ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్ వేయాలి : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎనిమిది మంది ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతుంటే ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 14 నెలల కాలంలో మూడు భారీ ప్రమాదాలు జరిగాయని గుర్తుచేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సహాయక చర్యలను పర్యవేక్షించే తీరిక సీఎం రేవంత్ రెడ్డికి లేదా? అని ప్రశ్నించారు. రిటైనింగ్ వాల్ కూలిపోయి రూ.వందల కోట్ల నష్టం వాటిల్లిందని కేటీఆర్ తెలిపారు. ప్రమాదం జరిగి 72 గంటలు గడిచినా చిక్కుకున్న వారిని బయటకు తీసుకురాలేకపోయారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఏ చిన్న సంఘటన జరిగినా లక్షల కోట్ల అవినీతి, వేల కోట్ల అవినీతి అంటూ గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు, మేధావులు ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణుల అనుమతి తీసుకోకుండా, ఆ సంస్థ ఇంజినీర్లు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకముందే టన్నెల్ పనులు ప్రారంభించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని కేటీఆర్ విమర్శించారు. నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపి సుంకిశాల రిటైనింగ్ వాల్ ఎందుకు కూలింది? ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదానికి కారణాలను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ఒకవైపు సహాయ కార్యక్రమాలను వేగవంతంగా చేపడుతూనే, ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేటీఆర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్మీ ఇతర సంస్థల సహకారంతో కార్మికులను వెంటనే రక్షించేందుకు ప్రభుత్వం మరింత చొరవ చూపాలని కోరారు.

రాష్ట్ర ప్రజలకు స్పీకర్ మహా శివరాత్రి శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇది పవిత్రమైన రోజనీ, ఏడాదికి ఒకసారి వచ్చే శివరాత్రి రోజు ఉపవాసాన్ని ఆచరించడం, జాగారం చేయడం ద్వారా శివుని ఆశీస్సులు అందుతాయని పేర్కొన్నారు. 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా ఈ శివరాత్రితో ముగుస్తుందని తెలిపారు.

ఆ 11 కుటుంబాలకే ఇండ్లు మంజూరు

ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోయడానికొచ్చిన అధికారుల అడ్డగింత

పట్టా పేపర్లు చించివేత
గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట లబ్దిదారుల ఆందోళన



నవతెలంగాణ-చివ్వెంల


సొంత గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పట్టాలిచ్చిన అధికారులు.. అందులో సగం మంది పేర్లే తుది జాబితాలో వచ్చాయని చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాలు పొందిన 28కుటుంబాల్లో 11 కుటుంబాలకు మాత్రమే ఇండ్లు మంజూ రయ్యాయంటూ ముగ్గు పోయడానికి వచ్చిన అధికారులను మిగతా లబ్దిదారులు అడ్డుకున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని భీమ్లాతండాలో జరిగింది. భీమ్లా తండా గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు 28 మందిని అర్హులుగా గుర్తించారు. గత నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా వారికి ఇండ్ల పట్టాలు అందజేశారు. తుది జాబితాలో మాత్రం 11 మంది పేర్లే వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం తండాలో ధరావత్ ప్రమీల ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి శంకుస్థాపన చేయడానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు నిలదీయడంతో వాగ్వాదం జరిగింది. గత నెల మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా 28 మందికి పట్టాలు పంపిణీ చేసి.. నేడు తుది జాబితాలో 11 మందికి మాత్రమే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయనడంతో.. పనికిరాని ఈ పట్టాలు మాకెందుకంటూ అధికారుల ముందే చింపేశారు. గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ సిబ్బంది, మండల అధికారులు రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా సర్వే చేసి 11 మందిని మాత్రమే గుర్తించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. చివరకు హౌసింగ్ ఏఈ రాంబాబు, ఎంపీవో దయాకర్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఇతర అధికారులు వెనుదిరిగారు.



వికలాంగుడిని.. నా పేరు తొలగించారు: ధరావత్ రాజు

వికలాంగుడిని అని చూడకుండా జాబితా నుంచి నాపేరు తొలగించారు. నేను పుట్టుకతో నిరుపేద వికలాంగుడిని. జీవనోపాధి గడవని పరిస్థితి. కూడు గుడ్డకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. గత నెలలో నాకు ఇల్లు వచ్చిందంటే చాలా ఆనందం వ్యక్తం చేశా. తుది జాబితాలో పేరు లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

పార్టీ ఫిరాయింపుల పిటిషన్ పై విచారణ మార్చి 4 కు వాయిదా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టీ ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్ కు ఆదేశాలివ్వాలని కోరుతూ ఎమ్మెల్యే కేటీఆర్ సహా మరికొందరు రిట్ పిటిషన్(సివిల్) దాఖలు చేయగా, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపైనా చర్యలకు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ వేర్వేరుగా రెండు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ మూడు పిటిషన్లు మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు రావాల్సి ఉంది. అయితే, స్పీకర్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి లేని కారణంగా పిటిషన్లపై విచారణ వేయాలని కోరగా... ఈ విజ్ఞప్తి ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం మార్చి 4కు వాయిదా వేసింది.

సిరిసిల్ల కలెక్టర్‌పై చర్యలు తీసుకోండి

సీఎస్‌కు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిరిసిల్ల కలెక్టర్ తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకరా పార్టీ మండలి విపక్ష నేత మధుసూదనా చారి, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద సీఎస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు సచివాలయం మీడియాపాయింట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ సిరిసిల్లలో కేటీఆర్ పేరుతో ఓ వ్యక్తి టీ షాప్ నిర్వహిస్తున్నారనీ, అధికారులు ట్రేడ్ లైసెన్స్ లేదనే సాకుతో మూసేయడమే కాకుండా... వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొంత మంది అధికారులు కాంగ్రెస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సిరిసిల్ల కలెక్టర్‌తో పాటు అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరినట్టు తెలిపారు. చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

- మార్చి 1 నుంచి ప్రారంభం : కన్వీనర్ డీన్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. మంగళవారం సాయంత్రం 4.45 గంటల నుంచే ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సిన విషయం తెలిసిందే.

ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

- తీర్పు వెలువరించిన రంగారెడ్డి జిల్లా కోర్టు



నవతెలంగాణ-కందుకూరు

బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితునికి 20 ఏండ్ల శిక్ష పడింది. నిందితుడికి శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని కందు కూరు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం పులి మామిడి గ్రామానికి చెందిన తిమ్మగళ్ళ శ్రీనాథ్ ఓ బాలికపై లైంగికదాడికి పాల్ప డ్డాడు. ఈ కేసులో అతనిపై క్రైమ్ నెంబర్ 236 / 2017 కేసులో కందుకూరు పోలీస్ స్టేషన్‌లో యూ/ఎస్ 376, 417 ఐపీసీ సెక్షన్ నెంబర్ 749/ 2018 ప్రకారం కేసు నమోదైంది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసి క్యూటర్ మంజులాదేవి వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి నిందితునికి శిక్ష విధిం చారు. 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాధితురాలికి రూ.3 లక్షల పరి హారం ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు నిచ్చారు.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాత

- పది గొర్రెలకు తీవ్ర గాయాలు
- సిద్దిపేట జిల్లా ములుగులో ఘటన



నవతెలంగాణ-ములుగు

గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ములుగు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి ఎక్కాల మల్లయ్య సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని కొట్టంలో గొర్రెలను తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపుగా వచ్చి గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 16 గొర్రెలు మృత్యువాత పడగా.. 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం తెల్లవారుజామున కొట్టం వద్దకు వచ్చే సరికి గొర్రెలు మృత్యువాత పడి ఉండటం చూసి మల్లయ్య కన్నీటిపర్యం తమయ్యాడు. మిగతా 10 గొర్రెలు కూడా బతికే అవకాశం లేదని, సుమారు రూ.3.20 లక్షల వేలపై గానే నష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- మృతుల్లో తల్లి, కొడుకు, కోడలు
- కన్నీరు మున్నీరవుతున్న చిన్నారులు

నవతెలంగాణ-మునిపల్లి

గుర్తు తెలియని ఓ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుదేరాలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రవి(36) అతని తల్లి లక్ష్మి(54), భార్య శోభ(28)తో కలిసి ముంబై హైవే రహదారిపై గల బుదేరా చౌరస్తాలోని ఫ్లై ఓవర్ పై వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. దాం తో వారు ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు రవికి ఇద్దరు కొడుకులు (చిన్నపిల్లలు) ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

హెచ్‌యూజే నాయకులకు మంత్రి కొండా సురేఖ హామీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. హెచ్‌యూజే డైరీని అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ తీసుకెళ్లారు. జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్తగా ఇస్తున్న హెల్త్‌కార్డులతో కలిపి జర్నలిస్టులకు హెల్త్ కార్డులివ్వాలని విన్నవించారు. లేనిపక్షంలో ప్రతి జర్నలిస్టుకూ ఏటా రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతు బీమా మాదిరిగా అక్రిడేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా అమలు చేయాలని కోరారు. ఏదేని కారణంతో జర్నలిస్టులు చనిపోతే వారి కుటుంబాలకు కనీసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు అందేలా జీవిత బీమా పథకం తీసుకురావాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ... జర్నలిస్టుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ ఇన్‌చార్జి మంత్రి, ఐ అండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కూడా జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తానని భరోసానిచ్చారు. ఇండ్ల స్థలాల సమస్య విషయంలో సీఎం నిర్ణయానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే కార్యవర్గ సభ్యులు, సీనియర్ మహిళా జర్నలిస్టులు కంచి లలిత, పెద్దిరెడ్డి విజయ తదితరులు మంత్రి కొండా సురేఖను శాలువా కప్పి సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో హెచ్‌యూజే కార్యనిర్వాహక అధ్యక్షులు గండ్ర నవీన్, కోశాధికారి బి.రాజశేఖర్, నాయకులు చిట్యాల మధుకర్, క్రాంతి, కొడవటి నవీన్, పూర్ణచందర్, రాజు, రేణయ్య తదితరులున్నారు.

మాటల్లో రక్షణ... చేతల్లో భక్షణ

రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న కాంగ్రెస్ : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల హక్కులను హరించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మాటల్లోనే రాజ్యాంగ రక్షణ, చేతల్లో రాజ్యాంగ భక్షణ అన్న విధంగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాశిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి, మానవ హక్కుల ఉల్లంఘనలకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యం..పోలీసు రాజ్యమైందనీ, బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమై పోయాయని పేర్కొన్నారు. కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. "గతంలో జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఇప్పుడు వనపర్తిలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.. బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టటంలో చూపించే అత్యుత్సాహం, కాంగ్రెస్ నేతల అవినీతి, అక్రమాలపె ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ, ఈడీ, సీబీఐ, ఐటీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు

హైదరాబాద్ తాగు నీటి కష్టాలపై హరీశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు."వేసవి రాకముందే బోర్లు ఎండిపోతున్నాయి, ప్రజలు భారీ మొత్తంలో డబ్బు వెచ్చించి వాటర్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతకుముందెప్పుడూ హైదరాబాద్‌లో ఇలాంటి తాగునీటి సంక్షోభం లేదు. సర్కార్ తగిన చర్యలు తీసుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

సైన్స్‌తోనే సమాజ పురోగతి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు

తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాల ప్రదర్శన



నవతెలంగాణ - ముషీరాబాద్

సైన్స్‌తోనే సమాజ పురోగతి సాధ్యమని, పాలకులు సైంటిఫిక్ అక్షరాస్యులు కావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయ్య అధ్యక్షతన సైన్స్ ప్రయోగాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆరోగ్యం, వ్యవసాయ సమస్యలపై ప్రభుత్వాలు నాణ్యమైన నిర్ణయాలు చేయాలన్నారు. అందుకే పాలకులు సైంటిఫిక్‌గా అక్షరాస్యులు కావాలని, అలా కానందునే కొందరు సమాజంలో మూఢనమ్మకాలు, అశాంతి, కర్మ సిద్ధాంతం ముందుకు తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ప్రయోగమూ మానవ జీవితాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడాలి కానీ మానవ హననానికి దారి తీయకూడదని చెప్పారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అజ్ఞానం రాజ్యమేలుతున్న తరుణంలో విజ్ఞానానికి పునాదులు వేద్దామని పిలుపునిచ్చారు. ప్రశ్నించడం.. సమాధానం రాబట్టడమే శాస్త్రీయ ఆలోచన అని అన్నారు. సైన్స్‌కు నమ్మకాలు, విశ్వాసాలు ఉండవని, సైన్స్ అంటేనే దేశాభివృద్ధిని సాధించే దిశగా మనిషిని మహోన్నతునిగా తీర్చిదిద్దేది అని చెప్పారు. విజ్ఞాన శాస్త్రం అంతిమ విజయం సైన్స్ ఎంత అభివృద్ధి అయిందో కాదని, సైన్స్ ఏ మేరకు ప్రజల వద్దకు వెళ్లి అందుబాటులో ఉందనేది ముఖ్యమన్నారు. ఎంతటి సమస్య అయినా శాస్త్రీయ పద్ధతిలోనే ఎదుర్కోవాలని సూచించారు. ఉపాధ్యక్షురాలు కె.సుజావతి మాట్లాడుతూ.. సైన్స్ అయినా సూడో సైన్స్ అయినా రుజువైతేనే నమ్మాలన్నారు. వైద్య రంగంలో హాని చేసే మందులను నిషేధించినా దేశంలో ఇంకా అమ్ముతున్నారంటే.. పాలకులు ప్రజల కోసమా బహుళ జాతి కంపెనీల కోసం పని చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులుగా అంకమ్మ, సుజావతి వ్యవహరించారు. అనంతరం విద్యార్థులందరికీ సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు. బాలోత్సవం కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, నవీన్, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి ఇష్టం లేక.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



నవతెలంగాణ-భువనగిరి

పెండ్లి ఇష్టం లేక ఏఆర్ కానిస్టేబుల్ మామిడాల అనూష (కీర్తి)(30) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొహెడ మండలం వరూకోలు గ్రామానికి చెందిన అనుష 2020 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్. నాలుగేండ్లుగా భువనగిరిలో విధులు నిర్వహిస్తోంది. స్థానిక విద్యానగర్‌లో ఓ ఇంట్లో మరో మహిళా కానిస్టేబుల్‌తో కలిసి అనూష అద్దెకు ఉంది. ఈనెల 22వ తేదీన తన పుట్టిన రోజు వేడుకను సహచరులతో కలిసి చేసుకుంది. అయితే, కొహెడ మండలానికి చెందిన ఓ వ్యక్తితో ఈనెల 14న ఆమెకు నిశ్చితార్థం అయింది. కుటుంబీకులు మార్చి 6వ తేదీన వివాహం నిర్ణయించారు. కాగా తనకు ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో అద్దెకు ఉన్న ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు మామిడాల పద్మ, లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ లక్ష్మినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిజినెస్



డాలర్ దెబ్బ..రూపాయి వామ్మో

- టారిఫ్‌ల సెగకు 51 పైసలు పతనం

న్యూఢిల్లీ : అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చిత్తులకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ భారీగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్‌ఐఐలు తరలిపోవడంతో రోజు రోజుకు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.23కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.23కి పడిపోయింది. తుదకు 51 పైసలు కోల్పోయి 87.23 వద్ద ముగిసింది. ముడి చమురు బ్యారెల్ ధర 0.12 శాతం తగ్గి 74.69 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో రూ.6,286.70 కోట్ల ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. ఈ ఫిబ్రవరి నెల దాదాపు రూ.30 కోట్ల విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే డాలరుతో రూపాయి విలువ 90కి చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని నిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వ వర్గాలకు ట్రంప్ టారిఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు. రూపాయి పతనంతో దిగుమతి, దిగుమతి ఆధారిత ఉత్పత్తులు భారం కానున్నాయి. బంగారం ధర మరింత పెరగనుంది. అదే విధంగా ప్రభుత్వ విదేశీ అప్పు చెల్లింపులు భారంగా మారనున్నాయి. ఈ పరిణామాలు అంతిమంగా దేశ ఆర్థిక వ్యవస్థను మందగమనంలోకి నెట్టనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సరికొత్తగా సామ్‌సంగ్ సర్వీసు సెంటర్లు

గూర్‌గావ్ : ప్రీమియం డిజైన్, అద్భుతమైన కస్టమర్ సర్వీస్‌తో స్మార్ట్‌ఫోన్ సర్వీస్ సెంటర్లను సమూలంగా మారుస్తున్న సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తెలిపింది. సౌకర్యవంతమైన లాంజ్, స్టైల్ సీటింగ్, వైర్‌లెస్ ఛార్జింగ్, ఉత్పత్తి మద్దతు కోసం ప్రత్యేక కియోస్క్‌లను ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. లైన్ల రద్దీనీ నియంత్రించేందుకు 3,000కు పైగా సర్వీస్ టచ్ పాయింట్లతో, కొత్త సర్వీస్ సెంటర్ ఫీచర్లు ప్రధాన నగరాల్లో దశలవారీగా అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది.



ఆర్థిక అక్షరాస్యతపై వాకథాన్

నవ తెలంగాణ - హైదరాబాద్

ఆర్థిక అక్షరాస్యతపై ఎస్ఎల్‌బీసీ సహకారంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అవగాహన కల్పిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల షెడ్యూల్‌కు అనుగుణంగా మంగళవారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో వాకథాన్ నిర్వహించారు. దీనికి వివిధ బ్యాంక్‌లు, ఆర్‌బిఐ నుంచి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆర్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ టి జగదీశ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఈ ఏడాది మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాలని ప్రత్యేక లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర అత్యంత కీలకమని.. వారిలో అర్థిక అక్షరాస్యత పెంచాలని నిర్దేశించుకున్నామన్నారు.

వారానికి 47.5 గంటల పని

- క్యాప్‌జెమినీ సిఇఒ అశ్విన్



న్యూఢిల్లీ : ఉద్యోగ, కార్మికుల పని గంటల పెంపునపై కార్పొరేట్లు తమదైన ఎత్తుగడలను, సన్నాయి నొక్కులను నొక్కుతున్నారు. కార్మిక చట్టాలను మార్చాలనే మోడీ సర్కార్ వ్యూహాలకు అనుగుణంగా మరో కార్పొరేట్ దిగ్గజం ప్రతినిధి చిలుకపలుకులు పలికారు. తాజాగా క్యాప్‌జెమినీ ఇండియా సిఇఒ అశ్విన్ యార్డి మాట్లాడుతూ.. రోజుకు 9.30 గంటల చొప్పున వారానికి ఐదు రోజులు పనిచేస్తే చాలని పేర్కొన్నారు. మంగళవారం నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరంలో అశ్విన్ మాట్లాడుతూ.. వారంలో ఐదు రోజులు పని చేస్తే చాలని పేర్కొన్నారు. వారాంతంలో ఇ మెయిల్స్ పంపొద్దన్నారు. నాలుగేళ్లుగా తాను అదే పని చేస్తున్నానని తెలిపారు. కొన్ని సార్లు వారాంతాల్లో పని చేస్తానని చెప్పారు. పని వేళల కంటే ఉత్పాదకతే ముఖ్యమని నాస్కామ్ ఛైర్‌పర్సన్ సింధు గంగాధరన్ పేర్కొన్నారు. భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని ఇటీవల ఇన్ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి తొలుత చర్చ లేపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఎల్‌అండ్‌టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తన ప్రభుత్వ భక్తిని మరింత ప్రదర్శించుకోవడానికి ఏకంగా 90 గంటలు పని చేయాలని వ్యాఖ్యానించారు.

ప్రచయ్ క్యాపిటల్ నుంచి ఎన్‌సిడి పబ్లిక్ ఇష్యూ



హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి) అయినా ప్రచయ్ క్యాపిటల్ లిమిటెడ్ సెక్యూర్డ్ నాన్ కన్వర్టేబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి)లను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.100 కోట్ల నిధుల సమీకరణకు గాను సెక్యూర్డ్, రేటెడ్, రిడీమబుల్ ఎన్‌సిడిలను విడుదల చేస్తోన్నట్లు పేర్కొంది. ఈ ఇష్యూ ఫిబ్రవరి 28న ప్రారంభమై.. 2025 మార్చి 13న ముగుస్తుందని వెల్లడించింది. నెలవారి వడ్డీ చెల్లింపులతో ఏడాదికి 13 శాతం వరకు రాబడిని అందిస్తాయని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష్ మురళీధర్ లఖోడియా తెలిపారు. ఈ మొత్తాన్ని మూలధన వినియోగానికి ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. తమ పెట్టుబడిదారులకు బలమైన, స్థిరమైన రాబడులను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

విద్యుత్ పరిశ్రమ బలోపేతమే లక్ష్యం

- ఎలిక్రామ 2025లో మంత్రి పియూష్ గోయల్



న్యూఢిల్లీ : విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా ఒక అంతర్జాతీయ ప్రదర్శన వేదికను రూపొందించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఎలిక్రామ 2025లో మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ పెట్టుబడిదారులను, వ్యాపారాలను ఆకర్షిం చేలా ప్రస్తుతం ఉన్న ప్రదర్శనలను ఒక పెద్ద స్థాయి ఈవెంట్‌గా విలీనం చేయాలని మంత్రి సూచించారు. బహుళ ఎక్స్‌పోలను ఏర్పాటు చేయడానికి బదులుగా సామర్థ్యాలు, సాంకేతికతను హైలైట్ చేసే ఒకే, పెద్ద స్థాయి వేదికను సృష్టించాలన్నారు. ప్రపంచ ఇంధన అభివృద్ధిలో భారత్ ముందంజలో ఉందన్నారు.

నేడు నథింగ్ ఫోన్ (3ఎ) సీరిస్ విడుదల

న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా పని చేస్తోన్న టెక్నాలజీ కంపెనీ నథింగ్ తన ఫోన్ (3ఎ) సీరీస్‌ను భారత్‌లో మార్చ్ 4న మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అత్యాధునిక ఆవిష్కరణలు, ప్రాసెసర్లు కోరుకునే వారికి ఇది మంచి అనుభవాన్ని ఇవ్వనుందని ఆ సంస్థ ఇటీవల పేర్కొంది.

ఐపిఒకు టాటా క్యాపిటల్

ముంబయి : టాటా గ్రూపునకు చెందిన టాటా క్యాపిటల్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీని ద్వారా రూ.1,504 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 23 కోట్ల తాజా షేర్లను ఇష్యూ చేయనుంది. గృహ, వ్యక్తిగత, వాహన తదితర రుణాలను జారీ చేయడానికి 2007లో ఈ సంస్థ కార్యకలాపాలను ప్రారంభించింది.

సర్వశక్తులూ ఒడ్డుతాం

(మొదటిపేజీ తరువాయి)

11 కిలోమీటర్ల తర్వాత నీరు ఉందన్నారు. అయినప్పటికీ 11.5 కిలోమీటర్ల దూరం వరకు వివిధ ఏజెన్సీల రక్షణ బృందాలు వెళ్లగలిగాయని చెప్పారు. 13.50 కిలోమీటర్ల వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్ (టీ.బీ.ఎం) ఉందని, అక్కడికి వెళ్లే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. ఇక్కడి నుంచి ఎయిర్ సప్లై పైప్‌లైన్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైనదని తెలిపారు. సొరంగంలో ఎంత దూరం వరకు బురద, నీరు ఉందనేది జీఎస్ఐ, ఎంజీఆర్ఐ అధ్యయనం చేస్తున్నాయని వెల్లడించారు. చివరి 40 మీటర్లలో నీరు, బురద మట్టి ఉందని, రాళ్లు ఉన్నా కనిపించడం లేదని అన్నారు. 15 అడుగుల ఎత్తులో 200 మీటర్ల వరకు ఈ బురద ఉందని ప్రతినిధులు, అధికారులు వివరించారు. ప్రస్తుతం టన్నెల్‌లో 10 వేల ఘనపుటడుగుల (క్యూబిక్ మీటర్లు) బురద ఉందని ప్రాథమికంగా అంచనా వేశామని, దాన్ని బయటికి తీయడమే ప్రధాన సవాలుగా ఉందని అన్నారు. కన్వేయర్ బెల్ట్‌కు బుధవారం సాయంత్రం లేదా ఎల్లుండిలోగా మరమ్మతులు పూర్తవుతాయని తెలిపారు. ఈ కన్వేయర్ బెల్ట్ ద్వారా గంటకు 800 టన్నుల బురదను బయటికి తీయొచ్చన్నారు. వీటిని మరింత త్వరితగతిన వెలికి తీయడానికి అక్కడికి వెళ్లగలిగే జేసీబీలను తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టన్నెల్‌లో గంటకు 3600 నుంచి 5వేల లీటర్ల ఊట నీరు వస్తుందని తెలిపారు. లోపలి నుంచి నీటితోపాటు, బురదను కూడా బయటికి తీయడానికి ఒకే పైప్‌లైన్ వినియోగించనున్నామని స్పష్టం చేశారు. వాటర్ ఫ్లోటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులతోపాటు సహాయక చర్యలు చేపట్టిన వారితో ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

పదేండ్లపాటు పెండింగ్‌లో పెట్టి ఇప్పుడు విమర్శలా : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

పదేండ్లపాటు ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి.. ఇప్పుడు జరిగిన టన్నెల్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలు చేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేయడం కూడా ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చన్నారు. ఏ టన్నెల్ నిర్మాణం జరిగినా లీకేజ్‌లు సర్వసాధారణం అని, సొరంగం తవ్వకాల సమయంలో ఏర్పడిన లీకేజ్ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చని చెప్పారు. ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్మీ, నేవీ, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఇతర ఏజెన్సీలు సమిష్టిగా పని చేస్తున్నాయని, వేగంగా, సురక్షితంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డీ వాటరింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల కోసం నిరంతరం ఆక్సిజన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ మంగళవారం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తాజా సమాచారం కోరగా, ప్రధాని మోడీ ఇప్పటికే సీఎంకు ఫోన్ చేసి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రమాద స్థలంలో పరిస్థితి తీవ్రంగా ఉందని, నీటి ప్రవాహం సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తోందని చెప్పారు. టన్నెల్‌లోని మట్టి దిబ్బలను తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నా మని వివరించారు. టన్నెల్‌లోని సహజ రాతి నిర్మాణాలు సడలడంతో అకస్మాత్తుగా నీరు, మట్టి ప్రవహించా యన్నారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి, దీనిని పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని చెప్పారు.

ఈ సమీక్షా సమావేశంలో సీఎండీ ముషరాఫ్ అలీ, స్పెషల్ ఆఫీసర్ ఈ.శ్రీధర్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, టన్నెల్ రంగనిపుణులు క్రిస్ కూపర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధి గ్రేన్ మేకర్డ్, ఉత్తరాఖండ్ దుర్ఘటన రెస్క్యూ ఆపరేషన్ నిపుణుల బృందం, జేపీకి చెందిన పంకజ్ గౌర్, నేవీకి చెందిన మరికోస్, ప్రసాద్, ఆర్మీ కల్నల్ వికాస్, కల్నల్ సురేష్, మోర్త్ డైరెక్టర్ అన్ను కల్యు, కమాండెంట్ ప్రసన్న, అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైయిర్ ఆఫీసర్ సుధాకర్ రావు, హైడ్రాకు చెందిన పాపయ్య, అధికారి సదానందం, ఉత్తరకాశీ టన్నెల్ రెస్క్యూ ర్యాట్ మైనర్స్ గ్రూప్ ప్రతినిధి ఫిరోజ్ కురేషి, నవయుగకు చెందిన కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో వివరాలు చెప్పండి

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్



నవతెలంగాణ-ఓయూ

కుల గణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మళ్లీ జరుగుతున్న సర్వేలో పాల్గొనాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ అన్నారు. కుల గణన సర్వేలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్, సీతాఫల్ మండి తదితర డివిజన్లలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే వివరాలు ప్రజల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వారాసిగూడలోని జడ్ఎం ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు తప్పకుండా సర్వేలో వివరాలు తెలపాలని కోరారు. ఆన్‌లైన్‌లో, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు గానీ వివరాలు తెలిపి సర్వేలో పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కుటుంబం కుల గణన సర్వేలో పాల్గొనాలని, అందుబాటులో లేని వారు 040 21111111 నెంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మాజీ ఉపాధ్యక్షులు సజన్ కుమార్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, షకీల్ ఖాన్, జామ అనిల్ కుమార్, వాహిదుద్దీన్ లడ్డు, ప్రతాప్, చక్రధర్, బబ్లు, కుద్దూస్, శేఖర్, శోభ, రాధ, కల్పన, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో నిరాశ..!

పల్లె పోరుకు మరింత సమయం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికలపై సందిగ్ధం
- 34 జీపీలను 3 మున్సిపాల్టీలుగా మార్చే యోచనలో సర్కార్
- ఇప్పటికే ఎన్నికలకు సిద్ధమైన గ్రామస్థాయి నేతలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని మొన్నటి వరకు ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల్లో నేతలు పదవులపై ఆశతో ఉన్నారు. అధికారులు సైతం ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర పనులు పూర్తి చేశారు. అయితే మరోసారి కులగణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడంపై.. ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మరికొంత కాలం పట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పల్లె పోరుపై సందిగ్ధం నెలకొంది. జిల్లాలో ఉన్న 61 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే కొన్నింటినీ సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేయగా.. మిగిలిన 34 జీపీలను 3 మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఎన్నికలు జరుగుతాయా..? లేదా..? అనే సందేహంలో ఆశావహులు ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది.

పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడాదిపైనే..



గ్రామ పంచాయతీల పాలక కమిటీల కాలపరిమితి ముగిసి ఏడాది దాటిపోయింది. గత ఆగస్టులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో జిల్లాలోని 34 గ్రామపంచాయతీల్లో ఆశావహులు అన్నీ సిద్ధం చేసుకునే పనుల్లో ఉన్నారు. ఇదే క్రమంలో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో 19 ఎంపీటీసీలు, 3 జెడ్పీటీసీ స్థానాలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆయా పార్టీల నాయకులు కూడా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ పై నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ రిజర్వేషన్ అయితే ఎవరు పోటీ చేయాలనే విషయంలో గ్రామాల్లో నేతలు చర్చించుకున్నారు. ఈ నెల 15 నాటికి షెడ్యూల్ వెలువడుతుందని అంతా భావించారు. కానీ, బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పట్లో ఎన్నికలు జరగవని తేలిపోయింది.

ఓటరు జాబితా, రెండు మండల పరిషత్‌లు రద్దు

సమీప మున్సిపాల్టీల్లో విలీనమైన గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను రద్దు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని 7 మున్సిపాల్టీల్లో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. పంచాయతీ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా గతేడాది సెప్టెంబర్‌లో పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో విలీనమైన గ్రామాలను గత నెల 4న ప్రభుత్వం రాష్ట్ర గెజిట్‌లో ప్రకటించింది. సదరు పంచాయతీల ఉన్నతీకరణ కారణంగా పంచాయతీరాజ్ చట్టం 2018లో సవరణ చేసి ఆ శాఖ పరిధిలో నుంచి తొలగించారు. ఈ అంశాలను ఉదహరిస్తూ 28 విలీన గ్రామాల్లో ఓటరు జాబితాలు చెల్లవని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీనికితోడు ఇటీవల ఘట్‌కేసర్, కీసర మండలాల్లోని గ్రామాలన్నీ సమీప మున్సిపాల్టీల్లో విలీనం



కావడంతో ఈ రెండు మండల పరిషత్‌లను ఇటీవల రద్దు చేశారు.

34 జీపీలు.. 3 మున్సిపాల్టీలు

పల్లెలను పట్టణాలుగా మార్చేందుకు రాష్ట్ర సర్కార్ చర్యలు చేపట్టింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆ దిశగా సన్నాహాలను వేగవంతం చేసింది. జిల్లాలో 34 గ్రామ పంచాయతీలతో మూడు కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. 3 మున్సిపాల్టీలను ప్రతిపాదిస్తూ ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా పంచాయతీ రాజ్‌కు అక్కడి నుంచి రాష్ట్ర పురపాలక సంచాలకుల కార్యాలయం (సీడీఎంఏ), ఆ తర్వాత సర్కార్‌కు చేరాయి. ఈ ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే వీటిపై సర్కార్ నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా గత పంచాయతీ ఎన్నికల నాటికి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు, 5 గ్రామీణ మండలాలు ఉండేవి. వీటిలోంచి ఔటర్ రింగ్ రోడ్డు లోపల, బయట ఉన్న 28 గ్రామాలను గతేడాది సెప్టెంబర్‌లో 7న మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. విలీనం వల్ల 33 గ్రామాలు మాత్రమే మిగిలి ఉండగా, కొత్తగా మరో గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారు.

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- నేడు ప్రధాని మోడీతో భేటీ
- ఏఐసీసీ అగ్రనేతలతోనూ సమావేశం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన రేవంత్ బుధవారం ప్రధాని మోడీతో.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించేలా బడ్జెట్‌ను సవరించాలని కోరనున్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన పలు పెండింగ్ సమస్యలను సీఎం...ప్రధాని ముందుంచనున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు నిధులు ఇవ్వాలని కోరనున్నారు. భేటీ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటన గురించి ప్రధానికి వివరించనున్నట్టు తెలిసింది.

ఏఐసీసీ అగ్రనేతలతోనూ...

తన ఢిల్లీ పర్యటన సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులపై వారితో ఆయన చర్చించనున్నారు. ఈ కోటాలో దాదాపు పది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సీపీఐ, ఎంఐఎం పార్టీలు కూడా ఒక్కొక్కటి చొప్పున ఎమ్మెల్సీ సీటును కోరుతున్నాయి. ఈ విషయాన్ని సీఎం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించనున్నారు. సీఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కొత్త మంత్రివర్గ విస్తరణపై ఈసారైనా క్లారిటీ వస్తుందా? రాదా? అనేది చూడాలి.

48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్ర వ్యాప్తంగా గత 48 గంటల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల జాడ దొరకడం లేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను పలకరించే తీరిక, ప్రమాద ఘటనను సందర్శించే ఓపిక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదు. ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటూనే ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎంపై విమర్శలు గుప్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో పాటు 500 మంది కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోజుకు ఒక రైతు చొప్పున ఇప్పటివరకు 450 మంది రైతులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 36వ సారి రేవంత్ ఢిల్లీకి వెళ్లినా కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. 15 నెలల స్వల్ప కాలంలోనే అధికార కాంగ్రెస్ పార్టీని వదిలి ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటే రేవంత్ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్ మాత్రమే కాదనీ, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్, ఎస్ఎల్‌బీసీ, ఖమ్మం పెద్దవాగు ప్రమాదాలు జరిగినా బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం పిల్లర్ పగిలినప్పుడు హడావుడి చేసిన ఎన్‌డీఏ, ఈ ప్రమాదాల విషయంలో మౌనంగా ఎందుకుందని నిలదీశారు. తాము గత పదేండ్లలో ఏటా రూ.40 వేల కోట్ల అప్పులు చేస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 14 నెలల్లో 1,50,000 కోట్ల అప్పు చేసి ఒక్క ఇటుకైనా పేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రామ్ రామ్ అవుతుందని కేసీఆర్ ముందే హెచ్చరించారని గుర్తు చేశారు. ఏడాది కాలంలో చేసిన రూ. లక్షన్నర కోట్ల అప్పుతో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాటి కొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలని రెచ్చగొట్టడమేంటి?

- బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రతి ఎన్నికల సమయంలోనూ హిందూ, ముస్లింలని రెచ్చగొట్టడమేంటి? బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్..పాకిస్తాన్..హిందూ..ముస్లిం మాటలు తప్ప వేరేవి రావా?' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రశ్నించారు. "భారతీయులంతా నా సోదరులే. భారత రాజ్యాంగాన్ని కాపాడతాను" అని ప్రమాణం చేసిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాలు చేయడం అవసరమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికపై ఎన్నికల ప్రచారానికి రండి అని సవాల్ విసిరారు. అన్ని రంగాల్లోనూ వెనుకబడ్డ పాకిస్తాన్‌తో పదేపదే పోల్చి మన దేశాన్ని గొప్పతనాన్ని తగ్గించొద్దని బండి సంజయ్‌కు సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 ఏండ్లుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలైనా ఇచ్చారా? తెలంగాణలో ఎంతమందికి ఉద్యోగాలిచ్చారు? ఎంత మందికి ఉపాధి కల్పించారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశ ప్రయోజనాల కోసం నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ సర్కారు అమ్ముకుంటూ పోతున్నదనీ, ప్రయివేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నదని విమర్శించారు. నిరుద్యోగులకు, యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలనలో చెప్పుకోవడానికి అభివృద్ధి లేదు..ఆయనలో సబ్జెక్టు అంతకన్నా లేదు అని విమర్శించారు. రాష్ట్రంలోని పట్టభద్రులకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదని తెలిపారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ అగర్‌బత్తీలపై మీద కూడా జీఎస్టీ వేసిందని విమర్శించారు. ఉన్నత విద్యపై 18 శాతం జీఎస్టీ ఏంటని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీల మాట ఏమైందని ప్రశ్నించారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టని అసమర్థ స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు.

నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్టు..

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



మాట్లాడుతున్న చావ రవి

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి కోరారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చావా రవి మాట్లాడారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గత ఆరేండ్లుగా.. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని తెలిపారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను 100 శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీల్లో నెల మొదటి తేదీనే వేతనాలు ఇస్తామన్న హామీ అమలు కావడం లేదని అన్నారు. రెండేండ్లుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జీపీఎఫ్, జీఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డీఈఓ, డిప్యూటీ ఈవో, ఎంఈఓ, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు చేపట్టేందుకు కృషి చేస్తారని తెలిపారు. గురుకులాల పని వేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని, కేజీబీవీ ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని, కేర్ టేకర్లను నియమించాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్న సమస్యలపై పోరాడుతున్నామని తెలిపారు. నర్సిరెడ్డి మళ్లీ ఎమ్మెల్సీగా గెలిస్తే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, టీపీటీఎఫ్ బాధ్యులు ఎంవీ నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షమీ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఉద్దండు షరీఫ్, జిల్లా పూర్వ కార్యదర్శి జి.రాజశేఖర్, వైరా మండల బాధ్యులు జి.రామకృష్ణ, ఎ.సుధాకర్, బి.అనితదేవి, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్.వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మాది ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం

ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లోనూ కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం : కేంద్ర మంత్రి బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'మా పార్టీ ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం.. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లో కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం' అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. '14 నెలల కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందాం?.. ఉద్యోగాల కల్పన, నిధుల ఖర్చుపై బహిరంగ చర్చకు సవాల్ విసిరితే సీఎం తోకముడిచారు' అని ఆయన విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు.



గుజరాత్, మధ్యప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణలోనూ ఎప్పటి నుంచో దూదేకుల వంటి సామాజిక తరగతులకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, దానికి తాము ఏనాడూ అభ్యంతరం పెట్టలేదని చెప్పారు. 12.5 శాతం ముస్లిం జనాభాలో 10.8 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటామని అన్నారు. నూటికి 88 మందికిపైగా ముస్లింలను బీసీల్లో కలిపి బీసీల పొట్టకొడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ఫోన్ ట్యాపింగ్ దొంగలు విదేశాలకు పారిపోయింది నిజం కాదా? అని, సీబీఐ విచారణ కోరితే హైకోర్టు ముందే తమ అడ్వకేట్ జనరల్ ఒప్పుకోని మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము మీకు లేదా? అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప పాల్గొన్నారు.

పోలింగ్ రోజు ప్రయివేటు స్కూల్స్, కాలేజీలకు సెలవివ్వండి

బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

ఈ నెల 27న గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు సంబంధించి విలువైన ఓటు హక్కును వినియోగించు కునేందుకు పట్టభద్రులు అందరికీ అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసింది. చాలా కళాశాలల్లో, పాఠశాలల్లో ఓటు హక్కు కలిగిన సిబ్బందికి కొన్ని గంటలు మాత్రమే పర్మిషన్ ఇస్తామని చెబుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కచ్చితంగా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు యాజమాన్యాలు ఓటు కలిగిన సిబ్బందికి రోజంతా సెలవు దినాన్ని ప్రకటించాలి. వారికి ఏడాదిలో అందిం చే సీఎల్‌లకు వీటికి సంబంధం లేకుండానే అదనంగా పోలింగ్ రోజు సెలవు దినంగా అవకాశాన్ని ఇవ్వాలి.

బండి సంజయ్.. దిగజారుడు మాటలు మానుకో..

- ప్రతి అంశంలో ముస్లిములు, పాకిస్తాన్‌ను ముడిపెట్టడం సరికాదు
- ప్రతి ఎన్నికల్లోనూ మతవిద్వేషాలను రెచ్చగొట్టడం అలవాటైంది
- అభ్యర్థిని పెట్టకుండా బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు : టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రతి అంశంలోనూ.. దేశానికి, పాకిస్తాన్‌కు, హిందువులకు-ముస్లిములకు ముడిపెట్టడం.. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇకనైనా పద్ధతి మార్చుకో.. దిగజారుడు మాటలు మానుకో..' అని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థిని పెట్టకుండా బీజేపీకి మద్దతుగా నిలుస్తోందని, పదేండ్లుగా ఆ రెండు పార్టీల మధ్య ఉన్న చీకటి లోపాయికారి ఒప్పందం మరోమారు బయటపడిందని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ బిడ్డగా తమరికి కేంద్రంలో స్థానం రావడం తమకు సంతోషంగా ఉందని, ఆ బాధ్యతను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వర్తించాల్సింది పోయి.. మళ్లీ పాత పద్ధతిలోనే హిందూ ముస్లిం, ఇండియా- పాకిస్తాన్ అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దుబాయ్‌లో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో ఇండియా గెలిస్తే.. అది బీజేపీ గెలిపించినట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టభద్రుల ఎన్నికలు అంటేనే రాష్ట్ర స్థితిగతులు, రాష్ట్ర అంశాలను అవగాహన చేసుకుని ఓటు వేసే అంశమని చెప్పారు. 'మీరెన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని మత విద్వేషపు మాటలు మాట్లాడినా మా అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఆపలేరు.. సీఎం నాయకత్వంలో ఏడాదిలో చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన సంక్షేమాలు.. మీరు పది సంవత్సరాల్లో చేసిన దానిపై చర్చకు సిద్ధం' అని సవాల్ విసిరారు. పదేండ్లలో కనీసం 50వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదని, తాము వచ్చిన ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాలనూ భర్తీ చేస్తామని తెలిపారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారన్న దానిపై తాము నోటీసులు ఇవ్వలేదంటున్న సంజయ్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో తేల్చాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.



గుజరాత్ గురించి మాట్లాడే బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు మాట్లా డరని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్రం నుంచి రావాల్సిన మెట్రో రైల్ నిధులు, ఫోర్త్ సిటీ అంశం తదితర వాటిపై ఎప్పుడైనా ప్రధానిని అడిగారా? కనీసం పార్లమెంట్‌లో ప్రశ్నించారా? అని అన్నారు.

ఈ రోజు ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగు తున్నారంటూ విమర్శించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.



చిక్కుల్లో లక్ష్యసేన్!

ఏజ్ ఫ్రాడ్ కేసులో విచారణకు ఆదేశం


బెంగళూర్ : భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ చిక్కుల్లో పడ్డాడు. తప్పుడు వయసు ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన కేసులో లక్ష్యసేన్ సహా కుటుంబ సభ్యులు, కోచ్ విమల్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు ఆదేశిస్తూ కర్ణాటక హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. జూనియర్ సర్క్యూట్‌లో పోటీపడేందుకు లక్ష్యసేన్, అతడి సోదరుడు చిరాగ్ సేన్ బర్త్ సర్టిఫికేట్లను రెండున్నర సంవత్సరాలు తగ్గించి ఫోర్జరీ చేసిన కేసులో లక్ష్యసేన్, చిరాగ్ సేన్ తల్లిదండ్రులు ధీరేంద్ర సేన్, నిర్మల సేన్ సహా విమల్‌కుమార్‌పై 2022లోనే ఎఫ్ఐఆర్ నమోదు కాగా.. విచారణపై న్యాయస్థానం స్టే విధించింది. 'ఏజ్ ఫ్రాడ్ అంశంలో స్పష్టమైన పత్రాలు ఉన్నాయి. పలుమార్లు అవకాశాలు ఇచ్చినా పిటిషనరు తరఫు న్యాయవాది వాదనలు వినిపించకుండా వాయిదాలు కోరుతున్నారు. ఇక ఈ కేసులో విచారణ నిలిపివేయడానికి ఎటువంటి కారణాలు లేవు. క్రిమినల్ ప్రొసిడింగ్స్ మొదలుపెట్టండి అని క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ ఎం.జీ ఉమ ఆదేశాలు జారీ చేశారు. ఏజ్ ఫ్రాడ్ అంశంలోనే చిరాగ్ సేన్‌పై భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) 2016లో వేటు వేసింది.

ఆసీస్, సఫారీ పోరు వర్షార్పణం

అగ్ర జట్లు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సమరానికి వరుణుడు అడ్డుపడ్డాడు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్ తర్వాత ఆసీస్, సఫారీలు తలపడుతున్న తొలి మ్యాచ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. రావల్పిండి స్టేడియంలో నిలకడగా వర్షం కురవటంతో మ్యాచ్ సాధ్యపడలేదు. మ్యాచ్ రద్దు కాగా ఇరు జట్లు పాయింట్లను పంచుకున్నాయి.

- టాస్ పడకుండానే కీలక మ్యాచ్ రద్దు
- ఆసక్తికరంగా గ్రూప్-బి సెమీస్ రేసు

నవతెలంగాణ-రావల్పిండి



ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో అభిమానులు ఎదురు చూసిన మ్యాచుల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఢీ ఒకటి. ఐసీసీ ఈవెంట్లలో ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడినా ఆఖరు బంతి వరకు ఉత్కంఠ ఖాయం. ఇటు ఆసీస్, అటు సఫారీలు తొలి మ్యాచ్‌లో మెరుపు విజయాలు నమోదు జోరుమీదుండగా.. మంగళవారం రావల్పిండి స్టేడియంలో జరగాల్సిన గ్రూప్-బి మ్యాచ్ వర్షం కారణంగా సాధ్యపడలేదు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు చెరో పాయింట్ పంచుకున్నాయి. ఐసీసీ ఈవెంట్లలో దక్షిణాఫ్రికాపై ఆసీస్‌కు పైచేయి ఉంది. ఈ రెండు జట్లు తలపడిన తొమ్మిది మ్యాచుల్లో కంగారూలు నాలుగింట గెలుపొందగా, దక్షిణాఫ్రికా మూడు మ్యాచుల్లో గెలుపొందింది. 1999 వరల్డ్‌కప్ మ్యాచ్ టై కాగా.. తాజా మ్యాచ్ వర్షం కారణంగా రద్దుగా ముగిసింది.

ముందుగానే నిర్ణయం

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కావాల్సింది. మ్యాచ్ ఆరంభం కావాల్సిన సమయం నుంచి సరిగ్గా మూడు గంటల 10 నిమిషాల తర్వాత ఫీల్డ్ అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వర్షం అంతరాయం కలిగించినా.. కనీసం 20 ఓవర్ల మ్యాచ్ కోసం రాత్రి 7.32 గంటల వరకు వేచి చూడవచ్చు. అయినా, మరో రెండు గంటల 22 నిమిషాల సమయం ఉండగానే అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. నిలకడగా వర్షం కురవటం, సాయంత్రం తర్వాత సైతం వర్షం తగ్గే సూచనలు లేకపోవటంతో అంపైర్లు ఈ నిర్ణయానికి వచ్చారు. టాస్ పడకపోవటంతో ఆసీస్, సఫారీలు తుది జట్లను ప్రకటించాల్సిన అవసరం రాలేదు.

రేసు ఆసక్తికరం


గ్రూప్-బి సెమీఫైనల్ రేసు ఆసక్తికరంగా మారింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దు కావటంతో నేడు ఇంగ్లాండ్, అఫ్గనిస్థాన్ మ్యాచ్ నాకౌట్‌గా మారింది. ఇంగ్లాండ్, అఫ్గాన్‌లు తొలి మ్యాచ్‌లో పరాజయం పాలయ్యాయి. నేడు మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు మాత్రమే సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలుస్తాయి. ఓడిన జట్టుకు మరో మ్యాచ్ ఉన్నప్పటికీ.. సెమీఫైనల్స్‌కు చేరుకునే అవకాశాలు ఉండవు. ఆస్ట్రేలియా గ్రూప్ దశ మూడో మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్‌తో ఆడనుండగా.. ఇంగ్లాండ్‌తో దక్షిణాఫ్రికా ఢీకొట్టనుంది. గ్రూప్-బి టాప్-2 స్థానాలు ఈ మ్యాచుల్లోనే తేలనున్నాయి.

సఫారీలకు ఊరట!

ఆస్ట్రేలియాతో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావటంతో నిరాశపరిచినా.. సఫారీలకు మాత్రం ఒకింత మేలు చేయనుంది. ఆ జట్టు కీలక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఎల్బో గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అందుకే, అఫ్గనిస్థాన్‌తో తొలి మ్యాచ్‌కు క్లాసెన్ దూరమయ్యాడు. గ్రూప్ దశలో దక్షిణాఫ్రికా చివరి మ్యాచ్ ఇంగ్లాండ్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్ శనివారం షెడ్యూల్ చేశారు. మరో మూడు రోజుల సమయం ఉండటంతో హెన్రిచ్ క్లాసెన్ పూర్తిగా కోలుకునేందుకు వీలుంది. బలమైన ఇంగ్లాండ్‌తో పోరుకు క్లాసెన్ అందుబాటులోకి వస్తే.. సఫారీలకు కొండంత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగే అవకాశం చిక్కుతుంది.

సారథ్యానికి సిద్ధమే!

నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్



ముంబయి : ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అందరి దృష్టిని ఆకర్షించనున్న ఆటగాళ్లలో మధ్యప్రదేశ్, కోల్‌కత నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ ఒకరు. ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో వెంకటేశ్ అయ్యర్ రూ.23.75 కోట్ల రికార్డు ధరను దక్కించుకున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను వేలంలోకి వదిలేసిన కోల్‌కత నైట్‌రైడర్స్.. వెంకటేశ్ అయ్యర్‌ను తిరిగి సొంతం చేసుకుంది. ఫ్రాంచైజీకి మూడో టైటిల్ అందించిన కెప్టెన్‌ను తర్వాతి సీజన్‌ను అట్టిపెట్టుకోని కోల్‌కత నైట్‌రైడర్స్ 2025 ఐపీఎల్‌కు కొత్త కెప్టెన్‌ను ఇంకా ప్రకటించలేదు. భారత సీనియర్ క్రికెటర్ అజింక్య రహానెతో పాటు ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ సైతం కెప్టెన్సీలో రేసులో ఉన్నాడు. శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్‌ను నాయకుడిలా ముందుండి నడిపిస్తున్న అయ్యర్.. కోల్‌కత నైట్‌రైడర్స్ సారథ్యం దక్కితే తప్పకుండా సిద్ధంగా ఉన్నానని వెల్లడించాడు. 'డ్రెస్సింగ్‌రూమ్‌లో ఆటగాళ్లను నడిపించేందుకు కెప్టెనే అవసరం లేదు. మధ్యప్రదేశ్ డ్రెస్సింగ్‌రూమ్‌లో ఈ గౌరవం పొందుతున్నాను. ఓ రోల్‌మోడల్‌గా సహచరులు నన్ను చూశారు. కెప్టెన్ కాకపోయినా.. ఓ ఆటగాడి అభిప్రాయాలను గౌరవించటం మంచిగా అనిపించింది. కోల్‌కత నైట్‌రైడర్స్ డ్రెస్సింగ్‌రూమ్‌లోనూ ఓ ఆటగాడు ధర 20 లక్షలు, 20 కోట్లు అనే వ్యత్యాసం లేకుండా.. అందరికీ సమ ప్రాధాన్యం ఉండాలని అనుకుంటున్నాను. నాకు కెప్టెన్సీ అవకాశం వస్తే.. కచ్చితంగా తీసుకుంటాను. అందులో ఎటువంటి సందేహం లేదు' అని వెంకటేశ్ అయ్యర్ తెలిపాడు.

సాధన షురూ : ఐపీఎల్ డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ రానున్న సీజన్‌కు సన్నాహకం మొదలుపెట్టింది. కోల్‌కత నైట్‌రైడర్స్ ఆటగాళ్లు ముంబయిలో వారం రోజుల పాటు సాధన చేయనున్నారు. సహాయక సిబ్బందితో పాటు అందుబాటులోని ఆటగాళ్లు మంగళవారం నుంచి ముంబయిలో సాధన షురూ చేశారు. వారం రోజుల శిక్షణ శిబిరం అనంతరం నేరుగా కోల్‌కతకు చేరుకోనున్నారు. మార్చి 22న కోల్‌కత ఈడెన్‌గార్డెన్స్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌తో ఐపీఎల్ 2025 సీజన్ ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.

బాక్సింగ్ గందరగోళం

ఐఓఏ అడ్‌హాక్ కమిటీపై వ్యతిరేకత

న్యూఢిల్లీ : అంతర్గత సమస్యలనే పరిష్కరించుకోలేని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) జాతీయ క్రీడా సమాఖ్యల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వివాదాలకు కేంద్రంగా నిలుస్తోంది. భారత బాక్సింగ్ సమాఖ్య (బిఎఫ్ఐ) ఎన్నికలు ఫిబ్రవరి 2న జరగాల్సి ఉండగా.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో బాక్సింగ్ సమాఖ్య పర్యవేక్షణకు అడ్‌హాక్ సంఘాన్ని నియమిస్తూ ఐఓఏ అధ్యక్షులు పిటి. ఉష నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ఐఓఏ కోశాధికారి సహదేవ్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఐఓఏ పేరిటి అడ్‌హాక్ కమిటీ వేశారు. కానీ ఆ అంశంపై ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ)లో చర్చ చేయలేదు. ఇది పూర్తిగా పిటి ఉష ఏకపక్ష నిర్ణయం. జాతీయ క్రీడా సమాఖ్యలపై ఐఓఏలకు ఎటువంటి అధికారం లేదు. ఈ అంశంలో బాక్సింగ్ సమాఖ్య న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే అందుకు అయ్యే ఖర్చులను ఐఓఏ నుంచి భరించాల్సిన అవసరం లేదని' సహదేవ్ యాదవ్ తెలిపారు. రాజేశ్ భండారి, డిపి భట్, బాక్సర్ శివ థాప, వీరేంద్ర సింగ్ ఠాకూర్‌లు అడ్‌హాక్ కమిటీలో ఉన్నారు.



కేరళ కొట్టేనా?

- ఊరిస్తోన్న రంజీ ట్రోఫీ తొలి టైటిల్
- టైటిల్ పోరులో విదర్భ, కేరళ అమీతుమీ
- రంజీ ట్రోఫీ ఫైనల్ నేటి నుంచి షురూ

నవతెలంగాణ-నాగ్‌పూర్

దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీ. సహజంగా టైటిల్ పోరులో ముంబయి, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక వంటి జట్లను చూడటం అలవాటైన అభిమానులకు.. ఈ ఏడాది సరికొత్త అనుభూతిని తీసుకొచ్చింది. అభిమానులు, సినిమా తారలు సైతం రంజీ ట్రోఫీ ఫైనల్ గురించి చర్చిస్తున్నారు. అందుకు కారణం, కేరళ తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరటం. 2018-19లో కేరళ టైటిల్ పోరుకు చేరే అవకాశం చేజార్చుకోగా.. ఈసారి వదిలిపెట్టలేదు. ఉత్కంఠభరిత మ్యాచుల్లో పైచేయి సాధించిన కేరళ చరిత్రలో తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను వేటాడుతూ నేడు నాగ్‌పూర్‌లో బరిలోకి దిగుతోంది. రెండు సార్లు చాంపియన్ విదర్భ సొంతగడ్డపై రెట్టించిన ఉత్సాహంతో మూడో టైటిల్‌పై కన్నేసి మైదానంలో అడుగుపెడుతోంది. విదర్భ, కేరళ రంజీ ట్రోఫీ ఫైనల్ సమరం నేటి నుంచి ఆరంభం.



విదర్భ, కేరళ అమీతుమీ :

భారత క్రికెట్ సర్క్యూట్‌లో పెద్దగా వినిపించని పేర్లు విదర్భ, కేరళ. ఇటీవల కాలంలో విదర్భ దేశవాళీ క్రికెట్‌ను శాసించే స్థాయికి ఎదుగుతోండగా.. కేరళ ఇప్పుడిప్పుడే తొలి కేక వినిపించేందుకు సిద్ధమవుతోంది. జూనియర్ క్రికెట్‌ను స్ఫూర్తిదాయక రీతిలో నడిపించటమే ఈ రెండు జట్ల విజయ రహస్యం కావటం గమనార్హం. గ్రూప్ దశలో విదర్భ ఎదురులేని విజయాలు సాధించగా.. కేరళ ఆ స్థాయిలో ఆధిపత్యం చూపించలేదు. క్వార్టర్స్‌లో తమిళనాడు, సెమీస్‌లో ముంబయి వంటి అగ్రజట్లను ఓడించిన విదర్భ సహజంగానే నేడు ఫైవరేట్‌గా బరిలోకి దిగుతోంది. గ్రూప్ దశలో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాలతో గట్టెక్కిన కేరళ.. గుజరాత్‌ను నాటకీయ రీతిలో సెమీస్‌లో 2 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో వెనక్కి నెట్టింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ నిలదొక్కుకుని పైచేయి సాధించిన అనుభవం కేరళ సొంతం కాగా.. విదర్భ దండయాత్ర ప్రదర్శనల అండతో కవ్వించనుంది. కరుణ్ నాయర్, యశ్ రాథోడ్, హర్ష్ దూబె, అథర్వ , ధ్రువ్ శోరెలు విదర్భకు కీలకం కానున్నారు. సచిన్ బేబి, జలజ్ సక్సేనా, మహ్మద్ అజహరుద్దీన్, అక్షయ్ చంద్రన్, వరుణ్ నయనర్‌లు కేరళకు కీలకం కానున్నారు. కేరళ, విదర్భ సెమీఫైనల్ మ్యాచ్ నేడు ఉదయం 9.30 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం కానుంది.

'మజాకా'.. పక్కా ఎంటర్‌టైనర్




రాజేష్ దండా



త్రినాథరావు

సందీప్ కిషన్ నటించిన తన 30వ సినిమా 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మించారు. బాలాజీ గుత్తా సహ నిర్మాత. రీతు వర్మ హీరోయిన్ కాగా, మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషించారు. శివరాత్రి కానుకగా నేడు (బుధవారం) ఈసినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు త్రినాథరావు నక్కిన, రాజేష్ దండా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

నిర్మాత రాజేష్‌దండా మాట్లాడుతూ, "బచ్చలమల్లి' తర్వాత ఒక డిఫరెంట్ సినిమా చేయాలని ఈ సినిమా చేశాను. ఇదొక మంచి ఎంటర్‌టైనర్. ఫ్యామిలీ సినిమా. డైరెక్టర్ త్రినాథ్ రావు, రైటర్ ప్రసన్న స్టయిల్‌లో ఉండే మాస్ ఎంటర్‌టైనర్. సినిమా చూశాను. చాలా మంచి సినిమా అవుతుంది. మంచి ఎంటర్‌టైన్మెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా. ఇంటర్వెల్‌కి మంచి ట్విస్ట్ ఉంటుంది. అది సెకండ్ హాఫ్‌ని ఎలా లీడ్ చేస్తుందో చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. సందీప్, రావు రమేష్ సీన్స్, సందీప్, రీతు లవ్ స్టోరీ, అలాగే రావు రమేష్, అన్షు ట్రాక్ చాలా బావుంటుంది. సందీప్‌కి భైరవ కోన' కంటే బెటర్ సినిమా అవుతుంది. ఈ సినిమా బిజినెస్ విషయంలో చాలా హ్యాపీగా ఉన్నాను. ప్రాఫిట్స్‌లో రిలీజ్ చేస్తున్నాను. సందీప్ కిషన్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ రిలీజ్' అని తెలిపారు. 'నా మార్క్‌తో ఉండే సినిమా ఇది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. సినిమా ఫలితంపై చాలా నమ్మకంగా ఉన్నాం' అని దర్శకుడు త్రినాథరావు అన్నారు.



నిధి అగర్వాల్, పవన్ కళ్యాణ్

'కొల్లగొట్టినాదిరో'..


పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఇప్పుడు ఈ సినిమా నుంచి రెండవ గీతంగా విడుదలైన 'కొల్లగొట్టినాదిరో' పాట అద్భుతంగా ఉంది. ఈ పాట సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్ళింది. పాట ప్రారంభం నుంచి ముగింపు వరకు.. ఎంతో వినసొంపుగా, శ్రోతలను కట్టిపడేసేలా సాగింది. ఇక పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రజెన్స్ లిరికల్ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ సరసన జంటగా నటించిన నిధి అగర్వాల్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. తెరపై ఈ జోడి చూడముచ్చటగా ఉంది. అలాగే ఈ పాటలో అనసూయ భరద్వాజ్, పూజిత పొన్నాడ మెరిసి తమ నృత్యంతో అదనపు ఆకర్షణగా నిలిచారు. కీరవాణి స్వరపరిచిన ఈ గీతం సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేస్తోంది. బహుళ భాషల్లో విడుదలైన ఈ గీతాన్ని ప్రతిభగల గాయనీ గాయకులు మంగ్లీ, రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల, ఐరా ఉడిపి, మోహన భోగరాజు, వైష్ణవి కన్నన్, సుదీప్ కుమార్, అరుణ మేరీ ఆలపించి పాటకు మరింత మాధుర్యం తీసుకొచ్చారు తెలుగులో చంద్రబోస్, తమిళంలో పా. విజయ్, మలయాళంలో మంకొంబు గోపాలకృష్ణన్, కన్నడలో వరదరాజ్, హిందీలో అబ్బాస్ టైరేవాలా సాహిత్యం అందించారు.

ఈ చిత్రానికి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

నవచిత్రం

అర్జున్ సర్కార్ విశ్వరూపం



నాని

నాని నటిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ 'హిట్ 3 : ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రమిది.

వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. నాని పుట్టినరోజు సందర్భంగా సర్కార్స్ లాఠీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

పోలీసులను కలవరపెట్టే వరుస రహస్య హత్యల నేపథ్యంలో టీజర్ స్టార్ట్ అవుతుంది. వారు ఎంత ప్రయత్నించినా హంతకుడిని పట్టుకోవడంలో విఫలమవుతారు. చివరి ప్రయత్నంగా టెర్రిఫిక్, బ్రూటల్ ఇన్వెస్టిగేటర్ అర్జున్ సర్కార్‌ని ఆశ్రయిస్తారు. అర్జున్ సర్కార్‌గా నాని పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో కట్టిపడేశారు. బ్రూటల్, కనికరంలేని పాత్రలో ఆదరగొట్టారు. అతని ఇంటెన్స్ ప్రజెన్స్, యాంగర్ టెర్రిఫిక్‌గా ఉన్నాయి. ముఖ్యంగా ఓ సన్నివేశంలో అతను నేరస్థుడిని పొడిచి కత్తిని పైకి లాగడం, రూఫ్ పై రక్తం చిమ్మడం - అతని పాత్ర క్రూరత్వాన్ని హైలెట్ చేస్తూనే నాని నటన విశ్వరూపాన్ని చూపిస్తోంది. దర్శకుడు శైలేష్ కొలను హిట్ సిరీస్‌ను అద్భుతమైన కథనం, గ్రేట్ విజువల్స్‌తో నెక్స్‌లెవల్‌కి తీసుకెళ్ళాడు. సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీ అదిరిపోయింది. మిక్కీ జె మేయర్ నేపథ్య సంగీతం ఇంపాక్ట్‌ని మరింత పెంచుతుంది.

ప్రశాంతి తిపిర్నేని, నాని ప్రొడక్షన్స్ వాల్యూస్ అత్యున్నతంగా ఉన్నాయి. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం మే 1న థియేటర్లలో విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు.

భైరవి నటన అత్యద్భుతం..



భైరవి

తెలుగు తెరకు మరో కథానాయిక పరిచయం కాబోతోంది. అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించేందుకు నూతన నాయిక భైరవి రెడీ అవుతోంది. సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటిస్తున్న చిత్రంలో కథానాయికగా మనకి కనిపించబోతోంది.

తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 1గా ఓ సినిమా రూపొందుతోంది. శివ వర ప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. సీనియర్ నటీనటులు రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు నటించారు.

ఈ సందర్భంగా నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ, 'ఈ మూవీ విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో రూపొందిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రమిది. 'సర్కార్ నౌకరి' ఫేమ్ ఆకాష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా హీరోయిన్‌గా భైరవిని తెలుగు తెరకు పరిచయం చేస్తున్నాం. అచ్చమైన పల్లెటూరి అమ్మాయి పాత్రలో భైరవి అద్భుతంగా నటించింది. హీరోకి మరదలుగా ఆమె పాత్ర సినిమాలో హైలెట్ ఉంటుంది. ఇది ఆమెకు డెబ్యూ మూవీ అయినప్పటికీ తన ప్రతిభతో, ఎంతో పరిణితితో నటించింది. సెంటిమెంట్, ఎమోషనల్ వంటి సీన్లలో ఆమె యాక్టింగ్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే టైటిల్, విడుదల తేదీ ప్రకటిస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం:శివ, నిర్మాత: తాటి బాలకృష్ణ, సహ నిర్మాత: తాటి భాస్కర్, సంగీతం: యశ్వంత్.

అంతకు మించి నవ్విస్తాం..



బ్లాక్‌బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్'ను ప్రకటించినప్పటి నుండి సినీ ప్రియులంతా ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటలు ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఈ చిత్ర టీజర్ మంగళవారం విడుదలైంది. రిలీజైన నిమిషాల్లోనే ఈ టీజర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వేసవికి ఈ సినిమా ప్రేక్షకులకు మరిచిపోలేని వినోదాన్ని పంచనుందని టీజర్‌తో స్పష్టమైంది.

'మ్యాడ్' సినిమాలో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు.

మొదటి భాగంలో తమ అల్లరితో నవ్వులు పూయించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ మరియు విష్ణు ఓఐ (లడ్డు).. 'మ్యాడ్ స్క్వేర్'లో అంతకుమించిన అల్లరి చేయబోతున్నారు. టీజర్‌లో వారి అల్లరి, పంచ్ డైలాగ్‌లు కడుపుబ్బా నవ్విస్తున్నాయి. ఈ చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రేక్షకులు ఊహించిన దానికంటే ఎక్కువ వినోదాన్ని, ఎక్కువ మ్యాడ్ నెస్‌ను ఈ సినిమాలో చూడబోతున్నారని చిత్ర బృందం తెలిపింది. మార్చి 29న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

మహిళా సాధికారత నేపథ్యంలో..



మిమో చక్రవర్తి, సాషా చెత్రి

బాలీవుడ్ నటుడు, సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి, ఎయిర్ టెల్ ఫేం సాషా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'నేనెక్కడున్నా'. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాతో మాధవ్ కోదాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈనెల 28న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు గంగాధర్, గోపీనాథ్ రెడ్డితో పాటు టాలీవుడ్ నుంచి పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. వీవీ వినాయక్, బ్రహ్మాజీ, ప్రేమ్ రక్షిత్ వీడియో బైట్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా హీరో మిమో చక్రవర్తి మాట్లాడుతూ, 'ఈ ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. అందరూ చాలా గొప్పగా నటించారు. ఈ సినిమాకు మెయిన్ హీరో మాధవ్. మా నాన్నలా నేను కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో భాగమవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది' అని అన్నారు.

'చాలా గొప్ప సినిమా ఇది. మహిళలపై ఇలాంటి సినిమా, నేను ప్రధాన పాత్రలో నటించడం అంతా డ్రీమ్‌లా ఉంది' అని హీరోయిన్ సాషా చెత్రి చెప్పారు. దర్శకుడు మాధవ్ కోదాడ మాట్లాడుతూ, 'మహిళా సాధికారత నేపథ్యంలో ఈ సినిమా తీశాం. నాకు తెలిసిన స్ట్రాంగ్ మహిళ మా అమ్మ ఆడవాళ్లకు స్వేచ్ఛ ఇస్తే ఆకాశమే హద్దు అనేరీతిలో తమ ప్రతిభ చూపిస్తారు. వాళ్ల గొప్పదనం చాటి చెప్పేలా, జర్నలిజం నేపథ్యంలో సినిమా చేశాం. మిమోకి తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ ఉంది. యాక్షన్ సీన్స్ ఇరగదీశారు. సాషా కూడా బాగా చేశారు. తనికెళ్ల భరణి చిన్న చిన్న ఎక్స్‌ప్రెషన్స్‌తో కంటతడి పెట్టించారు. మ్యూజిక్ డైరెక్టర్ రాజేష్ తన నేపథ్య సంగీతంతో సినిమాను నెక్స్ట్ లెవల్‌కు తీసుకువెళ్లారు. ట్యాలెంటెడ్ టెక్నీషియన్లు పని చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయి. అందరూ సినిమాను చూసి, మమ్మల్ని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

మాజీ ఎంపీటీసీ గౌర వెంకటేష్ వర్ధంతి..



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయితీ చౌరస్తాలో జీవయూత్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ గౌర వెంకటేష్ 11వ వర్ధంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాదర్‌గుల్ గ్రామంలోని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో విశేష అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నదికుడి యాదగిరి, సూర్దగంటి అర్జున్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సామ సంజీవ రెడ్డి, గౌర శ్రీనివాస్, సాయి కుమార్, రాళ్ళగుడం శ్రీనివాస్ రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, చిత్రం శ్రీను, గట్టు మహిపాల్, బాలకృష్ణ, సూర్దగంటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



నవతెలంగాణ-హయత్ నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసుస్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ సుధీర్ బాబు మంగళవారం హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీ టీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐలు లింగా రెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మి నారాయణ తదితరులు ఉన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైన్ కోసం
రూ.10కోట్లు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైన్ కోసం రూ.10కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి నియోజక వర్గ పరిధిలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గానికి దాదాపు రూ.10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రధానంగా చింతల కుంట ఎల్.పీ.టీ.మార్కెట్ వెనుక నుంచి సరస్వతి నగర్ వరకు నూతన యూ.జీ.డీ.పైప్ లైన్స్ వేయాలని కోరారు. నూతన పైప్ లైన్స్ వేయడం వలన చుట్టు పక్కల కాలనీ వాసులకు మేలు చేకూరుతుందని చెప్పారు. అలాగే బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీ, సాహేబ్ నగర్ వీకర్ సెక్షన్ నందు దాదాపు 30 సంవత్సరాల కిందట యూ.జీ.డీ.పైప్ లైన్స్ వేయడం జరిగిందని తెలిపారు. అ స్థానంలో నూతన పైప్ లైన్స్ వేయాలని వాటర్ వర్కర్స్ ఎండీని కోరారు. అలాగే సాహేబ్ నగర్ అజ్మయ్య గూడ నందు నూతన లైన్స్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా ఈ పనులు పూర్తి చేసి, మిగతా పనులు దశల వారీగా పూర్తి చేయాలని అన్నారు. దానికి మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి.. నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు రవి ముదిరాజ్, జక్కిడి రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

ఏఐఎస్ఎఫ్



నవతెలంగాణ-హయత్‌నగర్

2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రైవేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, హయత్‌నగర్ మండల కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్ గౌడ్‌లు మాట్లాడారు. 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్ల పేరిట విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్న దారుణాన్ని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా ఖండించిందన్నారు. ఈ విధమైన ఫీజు దోపిడీని అరికట్టాలని, నిర్బంధంగా నడుస్తున్న విద్యాసంస్థల గుర్తింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ అనుమతులు లేకుండా కొత్త బ్రాంచీలు తెరిచి, లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గానీ, సంబంధిత విద్యాశాఖ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అండదండలతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారం నిర్వహించడం చాలా బాధాకరమని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు పెద్ద నగరాల్లోని ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ముందస్తుగా అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేలా మాయ మాటలు చెప్పి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ విధంగా విద్యా వ్యవస్థను లాభాల కోసం దోచుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ముందస్తు అడ్మిషన్లు చేపట్టే విద్యాసంస్థల గుర్తింపులను రద్దు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి, బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే, విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ కాటి శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి చింతా వెంకటేష్, హయత్ నగర్ మండల ఉపాధ్యక్షుడు ఈనపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- రంజాన్ మాసం సందర్భంగా అధికారులతో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-బడంగ్ పేట్

ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రీమియర్ ఫంక్షన్ హాల్లో రంజాన్ మాసం సమీపిస్తున్న సందర్భంగా అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో 198 ప్రార్థన మందిరాలు ఉన్నాయని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో కూడా తాగునీటి సరఫరా, శానిటేషన్, డ్రైనేజ్ వ్యవస్థ, విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈద్గా, మసీదులు జల్‌పల్లి మున్సిపాలిటీలో 7 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కంటే ముందు ఇప్పుడున్న



ప్రభుత్వం ముస్లిం ప్రార్థన మందిరాలకు ఉచిత విద్యుత్ అందజేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి 14 నెలలు గడిచిన నేటికీ వారికి అందజేయలేదని, తక్షణమే వారికి ఉచిత విద్యుత్ అందించి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ మస్జిద్‌లో పనిచేసే ఇమామ్‌లకు నెలసరి వేతనం అందజేసేవారని, కానీ ఇప్పుడున్న ప్రభుత్వం వారి వేతనాన్ని ఆపివేయడం జరిగిందని, తక్షణమే వారందరి కూడా వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషనర్ బి. వెంకట్రామ్, ఏఈ అయేషా, మాజీ చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది, వైస్ చైర్మెన్ యూసఫ్ పటేల్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు పల్లపు శంకర్, షేక్ అఫ్జల్, శంషోద్దీన్ దస్తగిర్, యాహియా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు షర్ఫుద్దీన్ హమీద్, యంజాల జనార్ధన్, యూత్ అధ్యక్షులు యంజాల అర్జున్, ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యం వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

విద్యార్థుల నైపుణ్యం వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో దోహదపడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. ఎల్బీనగర్ కాకతీయ కాలనీలోని కాకతీయ హై స్కూల్లో మంగళవారం నిర్వహించిన క్యూరియాసిటీ కార్నివల్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కుంభ మేళా, రామాలయం సైన్స్, మ్యాథమేటిక్స్ మెదలైన అంశాల్లో వారు ప్రాజెక్టులను తిలకించి.. సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లీ రాజశేఖర్ రెడ్డి, ఉమా రెడ్డి, కాకతీయ హై స్కూల్ ప్రిన్సిపాల్ సుచిత్ర రెడ్డి, కిషోర్, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించకుంటే తిరుగుబాటే

- బడ్జెట్‌లో పేదోడి తిండి లాగి.. పెద్దోడికి కట్టబెడుతున్నరు
- సీఐటీయూ, రైతు సంఘాల రాష్ట్ర నేతల హెచ్చరిక



నవతెలంగాణ-తుర్కయంజాల్

కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకమైనదని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘాల రాష్ట్ర నేతలు విమర్శించారు. బడ్జెట్ ను సవరించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే సకల ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్పొరేటర్ అనుకూలమైన, పేదల జీవనోపాధిని పెంచలేని బడ్జెట్‌ను దేశ ప్రజలు భరించలేరన్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో 'కేంద్ర బడ్జెట్- ప్రజలపై ప్రభావం' అనే అంశంపై రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ ఏబీఆర్ కన్వెన్షన్ హాల్లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.రామచందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. రాజు, వ్యకాస జిల్లా అధ్యక్షులు పి. అంజయ్యల అధ్యక్షతన మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం వెలగడం లేదని, నలిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా, ఎయిడ్స్ కంటే భయంకరమైన పేదరికం దేశంలో పెరుగుతోందని ఆందోళన చెందారు. 20 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ, 2 లక్షల ఉద్యోగులు ఇస్తామన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనలో మీ ప్రభుత్వాల స్థానం ఎక్కడుందో పరిశీలించుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బడ్జెట్లో పేదోడి తిండి లాగి పెద్దోడికి కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పేదల జీవనోపాధిని పెంచకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

తాగునీటి అవసరాల కోసం గత బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం రూ.74 వేల కోట్లు మాత్రమే కేటాయించి.. కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని మండిపడ్డారు. మరోవైపు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేంద్రం ఆహార భద్రత కోసం 27శాతం నిధులను కోత విధించిందన్నారు. ఇక పేదలకు పౌష్టికాహారం ఎలా అందుతుందని ప్రశ్నించారు. 30 కోట్ల మంది జనాభా భూమిపై శ్రమను చేస్తూ దేశ ఆర్థిక స్థితిని పెంచుతున్నారని గుర్తు చేశారు. వీరికి రెండున్నర లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాల్సి ఉంటే కేవలంరూ.80వేల కోట్లు బడ్జెట్ కేటాయించి కేంద్రం చేతులు దులుపుకుంటోందన్నారు. కేంద్రం ఆవాస్ యోజన పథకానికి కేవలం రూ.50 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. దేశంలో పేదోడి సొంతింటి కల ఎలా నెరవేరుతుందని ప్రశ్నించారు. కేంద్రం ప్రతి పేదోడి ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు కలిపి రూ.15 లక్షలు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. వచ్చే బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని సూచించారు. రైతాంగానికి సబ్సిడీల కోత విధించడం సరికాదన్నారు. కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు సరిగ్గా లేవన్నారు. సమాజంలో సకల జనులకు సమానత్వంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పేదోడి తలరాతను పెంచే బడ్జెట్ గా ఉండాలన్నారు. అసమానతలు, పేదరికం లేని బడ్జెట్ కేటాయింపులు జరగడం లేదని విమర్శించారు. ప్రతి కార్మికుడికి రూ.26 వేల కనీస వేతనం అమలు చేయకుండా, విద్య, వైద్యం, కుటుంబ పోషణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.



రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్.రావులు మాట్లాడుతూ.. దేశంలో 500 మంది కుబేరుల వద్ద రూ.324 లక్షల కోట్ల ఆదాయం పోగై ఉందని విమర్శించారు. దేశంలో రాజకీయాలు కూడా వ్యాపారమయంగా మారాయన్నారు. విద్య, వైద్యం సైతం వ్యాపార వర్గంల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. చివరకు భూమిని కూడా ప్రయివేట్ పరం చేసే యోచనలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. దేశంలో వ్యవసాయరంగం నుండి రూ.70లక్షల కోట్ల ఆదాయం సమకూరుతుందని గుర్తుచేశారు. ఈ తరుణంలో వ్యవసాయ రంగాన్ని కూడా సంక్షోభంలో నెట్టేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. అందులో భాగంగానే కేంద్రం తీసుకు వచ్చిన మూడు నల్ల చట్టాలని గుర్తు చేశారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతాంగం ఉద్యమించి విజయం సాధించారని చెప్పారు. ఈ పోరాటంలో సుమారు 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు కేంద్రం వెనక్కి తగ్గినట్టు చెబుతున్న మరో మార్గంలో ఆ చట్టాలను అమలు చేసేందుకే పూనుకుంటుందని విమర్శించారు. 2006లో వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. దేశంలో 12 కోట్ల మంది రోజుకు రూ.182 ఆదాయంతోనే బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 23 కోట్ల మంది కటిక దరిద్రంలో బతుకుతున్నారన్నారు. 20 కోట్ల మంది రేషన్ బియ్యం పైనే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా తమ విధానాలను మాత్రం మార్చుకోవడం లేదని మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ పేరుతో రైతులను నిర్వాసితులను చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాజు, చంద్రమోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య, కే జగన్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్ రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్, డి జగదీష్, జె. రుద్రకుమార్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి కవిత, నర్సిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పుష్పమ్మ, సి హెచ్ జంగయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆర్ జంగయ్య, జిల్లా నాయకులు కే.జంగయ్య, శ్యాంసుందర్, తావునాయక్, టీ నరసింహ సి హెచ్ బుగ్గరాములు, సి హెచ్ ఎల్లేష్ మండల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'పత్తిలో అధిక దిగుబడి హర్షనీయం'



నవతెలంగాణ-హయత్‌నగర్

పత్తి సాగులో క్రీడా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో అధిక దిగుబడి సాధించడం గొప్ప విషయమని ఆటారీ, ఐసిఏ ఆర్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా హర్షం వ్యక్తం చేశారు. హయత్ నగర్‌లో వ్యవసాయ పరిశోధన కేంద్రం క్రీడాలో కిసాన్ మేళా-రైతు సదస్సును మంగళవారం నిర్వహించారు. తర్వాత రైతుల కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను రైతులతో కలిసి తిలకించారు. పత్తి ఉత్పాదకతను పెంచడానికి ఉత్తమ పద్ధతుల యొక్క పెద్ద-స్థాయి ప్రదర్శనలు జరిగాయి. రంగారెడ్డి జిల్లా నుండి దాదాపు 425 మంది రైతులు కిసాన్ మేళాలో చురుకుగా పాల్గొని సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ మేళా యొక్క ప్రధాన దృష్టి (హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్) యొక్క ప్రాథమిక అంశాలు, తెగుళ్ళు, వ్యాధులు, నీటి నిర్వహణ, విత్తడంలో యాంత్రీకరణ పాత్ర (న్యూమాటిక్ ప్లాంటర్ ఉపయోగించి), కపాస్ పికింగ్ మొదలైన వాటిపై సామర్థ్య నిర్మాణం, జ్ఞానాన్ని పంచుకోవడంపై ఉందన్నారు. నాగ్‌పూర్‌లోని (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్-సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్) భారతదేశంలో పత్తి ఉత్పత్తిని పెంచడానికి, పత్తిపై ప్రత్యేక ప్రాజెక్ట్(హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్)ను ప్రారంభించిందన్నారు. గుర్తింపు, అనుసరణ, ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం, విభిన్న పరిస్థితులలో పత్తి సాగు యొక్క ఉత్పాదకత, స్థిరత్వం, స్థితిస్థాపకతను మెరుగుపరచడం, భారతదేశంలోని నిర్దిష్ట పర్యావరణ, వాతావరణ పరిస్థితులకు సరిపోయే ఉత్తమ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టడంతోపాటు, పత్తి సాగులో కొత్త సాంకేతికతలు, ఉత్తమ పద్ధతులను స్వీకరించడాన్ని ప్రోత్సహించడంలో రైతులకు ఆర్థిక సహాయం అందించడంపై దృష్టి పెట్టిందన్నారు. దాని కార్యకలాపాలు, వ్యవసాయంలో యాంత్రీకరణ గురించి వివరించినట్టు పేర్కొన్నారు. సకాలంలో విత్తనాలు వేయడం, పురుగుమందుల వాడకం, నీటిపారుదల వంటి ఈ ప్రాజెక్టు కింద ఇవ్వబడిన సూచనలను పాటించాలని అన్నారు. ఈ సేవలు పంట ఉత్పాదకతలో గణనీయమైన మెరుగుదలకు, సాగు ఖర్చులను తగ్గించడానికి, నేల, నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించడానికి దోహదపడ్డాయని తెలిపారు. హెచ్‌డిపిఎస్‌లో పత్తి సాగును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహా రావు, ఏడీ సుజాత, డాక్టర్ విజయ్ కుమార్, సైంటిస్ట్ చంద్ర కాంత్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రజలకు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహాడి షరీఫ్‌లోని ప్రీమియర్ పంక్షన్ హాల్లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులైన 63 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో కాలం వెళ్లబుచ్చుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిన ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు సౌకర్యం కల్పించడం కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తారని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల తహశీల్దార్ ఇందిరా దేవి, జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ బి. వెంకట్రామ్, మాజీ చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాధి, మాజీ వైస్ చైర్మెన్ యూసఫ్ పటేల్, మాజీ కౌన్సిలర్లు పల్లపు శంకర్, షేక్ పమిద అఫ్జల్, శంషోద్దీన్, యాజియా, దస్తగిర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, యూత్ అధ్యక్షులు యంజాల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టిస్ జీ ఫ్లోర్ ఇంటర్వెన్షనల్
కార్డియాలజీ క్యాత్ ల్యాబ్' ప్రారంభం



- గుండె సంబంధిత వైద్యంలో మరో ముందడుగు
- హైదరాబాద్‌లో అత్యాధునిక అధునాతన ఫీచర్స్‌తో కొత్త 2వ క్యాత్ ల్యాబ్ రెనోవా సెంచరీ హాస్పిటల్స్‌లో ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు రాష్ట్రాల ప్రజలు, గుండె సంబంధిత వైద్య చికిత్సల కోసం అందరికీ అనుకూలంగా హైదరాబాద్‌లోనే అత్యాధునిక కార్డియాలజీ వైద్య సదుపాయాలను 'రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్' అందిస్తోంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో ఉన్న రెనోవా సెంచరీ హాస్పిటల్స్‌లో కొత్త "ఆర్టిస్ జీ ఫ్లోర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ క్యాత్ ల్యాబ్" అందుబాటులోకి వచ్చింది. మంగళవారం ప్రారంభమైన ఈ ల్యాబ్‌ను హాస్పిటల్ యాజమాన్యం ఓ పేషెంట్‌తో ప్రారంభింపజేయడం విశేషం. ఈ ల్యాబ్ ప్రపంచ వైద్య రంగంలోనే అత్యాధునికమైనది. ఇది, వివిధ రకాల గుండె జబ్బులను ఖచ్చితంగా నిర్ధరించి, చికిత్స అందించడంలో మార్గదర్శనం చేస్తుంది. ఈ హాస్పిటల్‌లో ఈ క్యాత్ ల్యాబ్ రెండోది. ఈ సందర్భంగా రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మెన్ అండ్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.కె.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ నూతన సాంకేతికతలు ఆరోగ్య సంరక్షణ విధానాల్లో ఎప్పటికప్పుడు మార్పులు తెస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు వినియోగిస్తున్న పద్ధతి రేపటికి పాతబడిపోవచ్చునీ, ట్రెండ్‌కు తగ్గట్టుగా నిలిచే 'ఆర్టిస్ జీ ఫ్లోర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ క్యాత్ ల్యాబ్' వంటివి మాత్రమే ప్రజల ఆరోగ్య భవిష్యత్‌కు భద్రతను ఇస్తాయని చెప్పారు. కార్డియాలజీలో సంక్లిష్ట విధానాల సంఖ్య పెరుగుతోందని చెప్పిన డాక్టర్ బి.కె.ఎస్. శాస్త్రి, ఆపరేషన్లలో 3డీ ఇమేజింగ్ చాలా కీలకంగా మారుతోందని వివరించారు. ఈ తరహా టెక్నాలజీ పెరగడంతో ఇప్పుడు ఓపెన్ సర్జరీలు తగ్గిపోయాయనీ, చిన్నపాటి రంధ్రంతో పెద్ద శస్త్రచికిత్స చేయగల స్థాయికి ఎదిగామని వెల్లడించారు. ఈ ల్యాబ్ ప్రతి చిన్న విషయాన్ని కూడా వివరంగా చూపిస్తుందన్నారు. ప్రతి రోగికి, ప్రతి కేసులో, ప్రతిసారీ నాణ్యమైన చిత్రాలను అందిస్తుందని వెల్లడించారు. దీనివల్ల, శస్త్రచికిత్స సమయంలో ఖచ్చితమైన నిర్ణయం తీసుకునే వీలవుతుందని వివరించారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ అయినా, ఇంటర్వెన్షనల్ న్యూరోరేడియాలజీ అయినా, 'ఆర్టిస్ జీ' అన్ని విధాలుగా సరళంగా ఉంటుందనీ, రోగి వ్యక్తిగత అవసరానికి అనుగుణంగా మార్చుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, డైరెక్టర్, క్లినికల్ కార్డియాలజీ డాక్టర్ నిర్మల్ కుమార్, డైరెక్టర్ కార్డియోథొరాసిక్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ డాక్టర్ కె.వి.రాజశేఖర రావు, డాక్టర్ సయ్యద్ అక్రమ్ అలీ, డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్ అంజని కిరణ్మయి, డాక్టర్ మల్లంపాటి సమీర్, డాక్టర్ ఉషారాణి, హాస్పిటల్స్ సీఓఓ రవీంద్రనాథ్ గరగ, హెచ్‌సీఓఓ శ్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

వికలాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం తులసి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికలాంగులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత లభించే విధంగా కృషి చేస్తానని వారి ఎదుగుదలకు తన సొంత నిధులు ఇచ్చి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట వికలాంగుల సంఘం అధ్యక్షులు మంద బిక్షపతి యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

యుద్ధభేరి గోడపత్రిక ఆవిష్కరణ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఏకీకృత పెన్షన్ విధానం వ్యతిరేకిస్తూ మార్చి 2న ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ యుపీఎస్‌పై యుద్ధభేరి గోడ పత్రికను మంగళవారం బొగ్గుల కుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆవిష్కరిస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, కోశాధికారి శ్యాం సుందర్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రావు, పబ్లిసిటీ కార్యదర్శి అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి శివకుమార్, ఈసీ మెంబెర్ సుధాకర్, అనిల్, మల్లేష్, టెక్స్ట్ బుక్ ప్రెస్ ఎంప్లాయిస్ జేఎంసీ అధ్యక్షులు ఈశ్వరయ్య, నరేష్, నటరాజ్ , దేవాదాయ ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్

సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

● రాంకీ ఒప్పందం రద్దు చేయాలి ● సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం.మీనా..



నవతెలంగాణ-ధూల్‌పేట్

జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం.మీనా డిమాండ్ చేశారు. చార్మినార్ జోన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మొగల్ పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్- 9 కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కార్మికులుగా గత కొన్ని దశాబ్దాల తరబడి విధులను నిర్మహిస్తున్న పర్మినెంట్, కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. కార్మికులు విధి నిర్వహణలో అనేక రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 60 ఏండ్ల పైబడినా, ప్రమాదాల్లో మరణించినా, మెడికల్ సెలవులు, లాంగ్ అబ్సెంట్ ఉన్న కార్మికుల స్థానంలో వారి వారసులను పనిలో తీసుకోవడానికి ఏండ్లు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పారిశుద్ధ్య కార్మికులు, పార్క్ వర్కర్స్, మలేరియా, ట్రాన్స్‌పోర్ట్, ఎస్‌ఎఫ్తాలకు కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికుల హాజరు పట్టీలో జరుగుతున్న అవకతవకలను, అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. పారిశుద్ధ్య సేవల్లో రాంకీ తదితర ప్రయివేట్ కంపెనీల ప్రయివేటీకరణ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సూపర్వైజర్ (ఎస్‌ఎఫ్‌ఎ)లకు రూ.35వేల వేతనం పెట్రోల్ అలవెన్సులు, ట్యాబ్స్ ఇవ్వాలన్నారు. వయసు పైబడిన, మరణించిన, అనారోగ్య కారణాల వల్ల లాంగ్ అబ్సెంట్ పెట్టుకున్న వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. స్వీపర్లకు ఇతర రక్షణ సామాగ్రిని అందజేయాలన్నారు. రాత్రి డ్యూటీ చేసేవారికి ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం, పని ప్రదేశాలలో రెస్ట్ రూమ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారాలు, పండుగల సందర్భంగా అందరికీ వర్తించేలా సెలవులు ఇవ్వాలని, ఏడాదికి 15 రోజుల క్యాజువల్ సెలవులను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి హామీ ప్రకారం డబుల్ బెడ్రూమ్, ఇందిరమ్మ ఇండ్లు కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయు జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్, గులాబ్ నర్సింగ్, యాదమ్మ, ఆండాలు, అనిల్, బబ్లు, వెంకటయ్య కార్మికులు తదితరులు

డంప్ యార్డుగా ఎన్టీఆర్ స్టేడియం

● కంపుకొడుతున్న ప్రాంగణం
● పట్టించుకోని అధికారులు





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర నడిబొడ్డన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ స్టేడియం చెత్త డంప్ యార్డుగా తలపిస్తోంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాకర్స్‌తో పాటు చిన్నారుల ఆటపాటలు, క్రికెట్ ఆటలకు కేంద్రంగా నిలిచిన ఎన్టీఆర్ స్టేడియం చెత్త డంప్‌గా మారింది. మహోన్నతమైన ఆశయాలతో చంద్రబాబు నాయుడు 2001లో ఎన్టీఆర్ స్టేడియం పేరుతో శిలాఫలకం వేసి ప్రజలకు అంకితం చేశారు. అటువంటి ఎన్టీఆర్ స్టేడియాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు నిర్లక్ష్యం చేసింది. తెలంగాణ కళాభవన్ నిర్మాణం చేపడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అందుకు స్థానికులతో పాటు నగర తెలుగుదేశం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో ఆ తెలంగాణ కళాభవన్ నిర్మాణాన్ని విరమించుకున్నారు. కానీ స్టేడియంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలకు వేదికలాగా అద్దెకు ఇచ్చుకుంటూ కాలంగడుపుతోంది. కానీ ఎన్టీఆర్ స్టేడియాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదే అదునుగా కొందరు పార్కింగ్ స్థలంగా వినియోగిస్తుంటే, మరికొందరు చెత్తాచెదారం వేస్తున్నారు. ఇక జీహెచ్‌ఎంసీ సిబ్బంది దాన్ని డంపింగ్ యార్డుగా మార్చేసింది. అక్కడ క్రీడలు ఆడేవారితోపాటు, వాకర్స్‌కు, ఆ మార్గాన వెళ్లే పాదాచారులకు అక్కడ వెదజల్లే కంపుతో ముక్కుమూసుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎంతో ప్రాధాన్యతకలిగిన స్టేడియాన్ని...

నగరంలో యువకుల కోసం క్రీడా ప్రాంగణాలు పెద్దగా లేవు. ఉన్నా అవి అపరిశుభ్రంగా లేదా స్థానికులకు దూరంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో యువకులకు క్రీడలు ఆడేందుకు నగర శివారు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. లేదా డబ్బులు చెల్లించి ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే తరహాలో ఆర్టీసీ ఎక్స్ రోడ్డు, అశోక్‌నగర్‌తోపాటు స్థానికంగా నివాసముంటున్న వారికి ఎలాంటి క్రీడా ప్రాంగణాలు లేవు. దాంతో నగర నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలోనే వేలాది మంది పిల్లలు క్రికెట్, ఫుట్‌బాల్, షటిల్ ఆడుతున్నారు. ఇక సెలవు రోజులు, ఆదివారం వస్తే చెప్పనక్కలేదు. ఇసుకేస్తే రాలనంతాగా యువకులు, మైనర్లు ఆటలాడుతూ కనిపిస్తారు. కొందరు సైకిలింగ్ చేయడం, మరికొందరు కార్లు నడుపుతూ కన్పిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన స్టేయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్త డంపుయార్డును తీసుకొచ్చి ఎన్టీఆర్ స్టేడియంలో వేసి డంప్ యార్డ్‌గా తయారు చేస్తున్నారు. మరికొందరు కార్లు, వ్యాన్లు, భారీ వాహనాలను సైతం స్టేడియంలోనే పార్కుచేస్తున్నారు.

స్టేడియాన్ని దుర్వినియోగం చేయడం విచారకరం

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ఎన్టీఆర్ స్టేడియాన్ని డంప్ యార్డ్ మార్చడంలో ప్రభుత్వ ఆంతర్యమేమిటో స్పష్టం చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు సాయిబాబా అన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ స్టేడియాన్ని దుర్వినియోగం చేయడం విచారకరమన్నారు. నగరంలో అంతంత మాత్రంగా ఉన్న క్రీడా ప్రాంగణాలుంటే, వాటిని నాశనం చేస్తున్న ప్రభుత్వానికి క్రీడలపై ఉన్న చిత్తశుద్ధి ఎంటో తెలియజేయాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియం జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు.? చుట్టూ జనావాసాలకు మధ్యలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలోని చెత్త వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపానా పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్టీఆర్ స్టేడియాన్ని పూర్తి స్థాయిలో శుభ్రపరిచి ఇద్దరు సిబ్బందిని సెక్యూరిటీగా నియమించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

● పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్ ప్రదీప్, వి. అజయ్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, రాగానే దాని అమలుకు చేయడం లేదని, తక్షణమే అమలు చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. ఎస్ ప్రదీప్, వి. అజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్య నగర్ లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్ ప్రదీప్, వి.అజయ్‌లు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం పదేండ్లు ఉన్నా, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి అమలు చేయలేదన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశంలో నిరుద్యోగులపై ప్రత్యేకంగా చర్చించి, బడ్జెట్ కేటాయింపులు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం మందులు కూడా పంపిణీ చేయలేని దుస్థితి ఉందన్నారు. ఇక ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల వసూళ్లపై ప్రభుత్వ నియం త్రణ లేదన్నారు. ఈ సమస్యపై పీవైఎల్, పీఓడబ్ల్యు మూడు నెలలుగా పోరాడిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం.రవి కుమార్, ఎన్.వి రాకేష్, సభ్యులు జె. భరత్, బి.ఎస్ కృష్ణ, దేవ, కుర్సా రామకృష్ణ, నవీన్, అనీస్, తదితరులు పాల్గొన్నారు.

'నీటి పంపకాల్లో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి'

● భారత్ నేషనల్ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నీటి పంపకాల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని భారత్ నేషనల్ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నీరు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం జరిగిందని, ఈ తరుణంలో నీటిని తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతే తెలంగాణ రైతులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని చెప్పారు. గతంలో నీరు లేక ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గతంలో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

● బహుదురపూర-1 డిప్యూటీ ఐవోఎస్ హరి నారాయణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని బహుదురపూర- 1 డిప్యూటీ ఐవోఎస్ హరి నారాయణ అన్నారు. మంగళవారం అంధుల పాఠశాల దారుల్‌షేఫాలో డీ.ఈడీ నెలరోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలో రాణించాలన్న ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని ఈ వృత్తిని ఎంచు కున్న వారందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖుద్సీయా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల రోజుల శిక్షణ కార్యక్రమం విజయ వంతం గా పూర్తి చేశారని అభినందిం చారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు మహేందర్, వెంకటేష్, రాజు, నర్సింలు, నాగరాజు, మహేష్, నరేందర్, శివరాజ్, నాగేష్, సదానందం పాల్గొన్నారు. అంతకు ముందు విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధూల్‌పేట్ రహీంపురలో శివరాత్రి ఏర్పాట్లు..





నవతెలంగాణ-ధూల్‌పేట్

ధూల్‌పేట్ రహీంపురలో మహా శివరాత్రి సందర్భంగా శంకరజీ హనుమాంజి కల్యాణ మండపంలో శ్రీ శివ మహా జాగరణ ఏర్పాట్లు చేశారు. శివరాత్రి ప్రత్యేకంగా సముద్రంలో రాళ్లు విసురుతున్న వానరసైన్యం.. ఆలయంలో ఉగ్ర రూపంలో శివుడు.. అనంత పద్మనాభ, మాటేశ్వరి, ఇతర దేవతలు.. వివిధ దశావతరాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..



తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జనశక్తి ప్రీ మియర్ లీక్ క్రికెట్ టోర్నమెంట్-2025 6వ సీజన్‌ను ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షులు పి.వికాస్ కుమార్, గోవింద్ బక్ష్ జితేందర్, ప్రేమ్ కుమార్, పి.శ్యామ్ గణేష్ మల్లాజీ రమేష్, అన్నమోహన్, శ్రీనివాస్, రాఘవేందర్ అంజనేయులు, సిద్ధులు, నాయి బ్రాహ్మణ యువత పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



బాప్టిస్టు ట్రస్ట్ పాఠశాలలో సోమవారం హైదరాబాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ శ్రీరామ్ బృందం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 340 మంది విద్యార్థిని, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రెవ, జి. డేవిడ్ ప్రశాంతే, వైస్ చైర్మెన్ విజయకుమార్, కన్వీనర్ ప్రణుతి కుమారి పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

'ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఇంక్విలాబ్ సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎం.ఎం.హుస్సేన్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకట నలో విమర్శించారు. ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, మహిళలకు చేయూత, రైతు రుణమాఫీ, విద్యార్థులకు విద్య భరోసా వంటి తదితర హామీలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి తుంగలో తొక్కి బడుగు బలహీన, అణగారిన వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తు న్నా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పరిమిత వ్యవసాయ రుణాల మాఫీ వంటి కొన్ని పథకాలను పాక్షికంగా మాత్రమే అమలు చేసిందని, రూ.2,500 మహిళలకు నెలవారీ సాయం, రైతులకు ఎకరాకు రూ.15,000 రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు చిత్తుగా ఓడించాలని సూచించారు.

నిత్యం సమాజం కోసం పరితపించిన ఏఎల్ మల్లయ్య

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

అనునిత్యం సమాజం కోసం ఏఎల్ మల్లయ్య పరితపించేవారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రదేశం గంగపుత్ర సంఘం గంగపుత్ర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఏఎల్ మల్లయ్య రెండవ వర్ధంతి సభలో పలువురు ప్రముఖులు హాజరై చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ చైర్మెన్ వకులభరణం కృష్ణ మోహన్‌రావు, ప్రొఫెసర్లు సుదర్శన్ రావు, మురళీ మనోహర్, బాగయ్య, ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నరసయ్య, ఏసీపీ సంపత్ కుమార్ తదితరులు హాజరై మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలోని బీసీ ప్రజానీకానికి, బీసీ ఉద్యమ నిర్మాణాల్లో ప్రముఖ పాత్ర వహించాడని అనునిత్యం సమాజం కోసం పరితపించేవారన్నారు. బీసీ కులాలన్నీ ఒక తాటి మీదికి వచ్చి రాజ్యాంగ వచ్చిన హక్కులను ఏ విధంగా మనం పరిరక్షించుకోవాలి ఆ హక్కులను ఉపయోగించుకొని ఏ విధంగా మనం అన్ని రంగాల్లో ముందుకు పోవటానికి అవకాశం ఉందో అతను ప్రధానంగా అమోఘమైన కృషి చేశాడన్నారు. జాతీయ మత్స్యకారుల హక్కుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, సెంట్రల్ బోర్డు ఫిషరీస్ మెంబర్‌గా ఏఎల్ మల్లయ్య దేశవ్యాప్తంగా మత్స్యకారుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రదేశ్ గంగపుత్ర సంఘాని పటిష్టమైన సంఘంగా తీర్చిదిద్దారు. మల్లయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంఘాలు ఎన్ని ఉన్నా ఐక్యతతో పోరాడి సమాజంలో మనమేందో ప్రభుత్వానికి తెలియజేసే విధంగా హక్కులను సాధించుకునే దిశగా ముందు కెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూస నరసింహ, లక్ష్మణ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

టి.శ్రీనివాస్ మృతికి సంతాపం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్సనల్ సెక్రెటరీ టి. శ్రీనివాస్ అకస్మాత్తుగా పరమపదించడం పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు కర్పూరి రాగూర్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా టి.శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణ, చంద్రశేఖర్ , సురేష్ , రామకృష్ణ , విజయ్ , సుధాకర్ , రూపుకరన్ , వేణు కుమార్ , నవీన్ , సుమన్, వెంకటేష్ , ఆంజనేయులు, నాగరాజు ,గోరఖ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబర్‌పేట ఫ్లైఓవర్ ఓపెన్

● తాత్కాలికంగా వాహనాలకు అనుమతి
● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

నేటి నుంచి అంబర్‌పేట ఫ్లైఓవర్ నుంచి వాహనాలను అనుమతించి.. కింద రోడ్డు నిర్మాణం, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భూసేకరణ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహాశివరాత్రి (నేటి) నుంచి అంబర్‌పేట ఫ్లైఓవర్‌నగర వాసులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మంగళవారం గోల్నాక చర్చ్ నుంచి అంబర్‌పేట వాణి ఫోటో స్టూడియో వరకు ఫ్లైఓవర్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పరిశీలించి అధికారులతో వివరాలను అడిగి తెలుసు కున్నారు. కేంద్ర మంత్రితో పాటు రోడ్లు భవనాల శాఖ, నేషనల్ హైవే అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారులు, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ చాదర్ ఘట్‌నుంచి వరంగల్‌కు వెళ్లే జాతీయ రహదారికి గతంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రోడ్డు వైండింగ్ చేశారు. అంబర్‌పేట చే నెంబర్ వద్ద శ్మశాన వాటిక ఉండటంతో రెండు వైపులా రోడ్డు వైండింగ్ కుదరలేదు. గతంలో నేను అంబర్‌పేట ఎమ్మెల్యేగా, ఎంపీగా చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి.. ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని కోరాను. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. స్థానికులు సైతం నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ మంజూరు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని అడిగి నప్పుడు ఆయన వెంటనే అంగీకరించి మంజూరు చేశారని తెలిపారు. భూసేకరణ అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని కనుక తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చి మిగతా ఐదు చోట్ల భూసేకరణ చేసి కేంద్రానికి సహకరించాలని ఒకచోట భూసేకరణకు సంబంధించి రూ.2 కోట్ల 51 లక్షలు చెక్కు తీసుకున్న తర్వాత కూడా భూసేకరణకు స్థలం నేషనల్ హైవే అథారిటీకి అప్పగించలేదు. దాన్ని త్వరగా అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరించాలి.

రోడ్డు, బ్యూటిఫికేషన్ పనులు చేయాలి

జీహెచ్‌ఎంసీ నేషనల్ హైవే అధికారులతో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అంబర్ పేట్ ఫ్లైఓవర్ కింద రోడ్డు వేయడంతోపాటు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చేయాలని అధికారులను సూచించారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సాధ్యం కాదని అధికారులు తెలిపారు. ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ట్రాఫిక్ ను పైనుంచి పంపి.. కింద రోడ్డు, బ్యూటిఫికేషన్ పనులు చేయాలని వారికి సూచించారు. కనుక మిగిలిన 6 చోట్ల కూడా కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చేసి నేషనల్ హైవే అథారిటీకి అప్పగిస్తే ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేస్తామని వెల్లడించారు.

నేడు ఫ్లైఓవర్ ఓపెన్

నేటి నుంచి ఫ్లైఓవర్ నుంచి వాహనాలను అనుమతించి.. కింద రోడ్డు నిర్మాణం, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలన్నారు. ఈ అంబర్ పేట్ ఫ్లైఓవర్‌కు సంబంధించి గతంలో అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి పలు లేఖలు ఆయన రాశానని ప్రభుత్వం వెంటనే స్పందించి మిగిలిన 6 చోట్ల భూసేకర ణను చేపట్టాలని కిషన్‌రెడ్డి కోరారు. ఈ ఫ్లైఓవర్ కోసం ఇప్పటి వరకు రూ.338 కోట్లు ఖర్చు చేయగా, ఏండ్ల తరబడి నెలకొన్న ట్రాఫిక్ కష్టాలకు ఈ శివరాత్రితో కొంత ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు వనం రమేష్, ఎక్కాల చైతన్య కన్నా, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమాల ఆనంద్‌గౌడ్, నాయకులు అజయ్ కుమార్, నాగభూషణంచారి, చింతల శ్రీనివాస్, రామచందర్ గుప్తా, పెంటమ్ రాజ్, నరేష్ గౌడ్, శ్రీధర్ గౌడ్, దయాకర్ యాదవ్, మనోజ్ యాదవ్, తదితరులున్నారు.

'పెబ్బేరు గోదామును తగలబెట్టిన దోషులను గుర్తించండి'

తెలంగాణ డీజీపీకి బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ వినతి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వనపర్తి జిల్లా పెబ్బేరు మార్కెట్ యార్డు గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ వేగవంతం చేసి దోషులను గుర్తించాలని తెలంగాణ డీజీపీ డా.జితేందర్‌కి బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లక్డికాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి అగ్ని ప్రమాద ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 01.04.2024న వనపర్తి జిల్లా పెబ్బేరు మార్కెట్ యార్డు గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.10 కోట్లకు పైగా విలువ చేసే రూ.12.94 లక్షల గన్నీ బ్యాగులు ధ్వంసమైన ఘటనపై పెబ్బేరు పోలీసులు ఇప్పటి వరకు ఎటువంటి చర్య తీసుకోవడం లేదన్నారు. ఈ సంఘటన మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు గోదాములు సైతం నిరుపయోగంగా మారాయని, వాటి విలువ దాదాపు రూ.10 కోట్లకు పైగానే ఉంటుందన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ, విచారణ ముగింపునకు రాకపోవడం, నెలల తరబడి ఛార్జ్‌షీటు దాఖలు చేయకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ముఖ్యమైన ఆర్థిక, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా బాధ్యులపై ఛార్జ్‌షీట్, అవసరమైన చట్టపరమైన చర్యలను త్వరగా దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ కనెక్షన్ లేకపోవడం వల్ల ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం లేదని, ఇది ఉద్దేశపూర్వకంగా కాల్పులు జరిపినట్లుగా పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. జిల్లా సరఫరా అధికారి (డీఎస్ఓ) సంఘటన జరగడానికి కొద్ది రోజుల ముందు సెలవుపై వెళ్లారని, పౌరసరఫరాల సంస్థ వనపర్తి ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ ఆ అధికారేనని, ఈ విషయంపై మరింత లోతుగా విచారణ చేయాల్సిందిగా డీజీపీని కోరినట్లు తెలిపారు. తమ ఫిర్యాదుపై డీజీపీ సానుకూలంగా స్పందించారని, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, న్యాయపరంగా పటిష్టమైన విచారణ జరిపి జాప్యం లేకుండా చార్జిషీట్ దాఖలు చేసి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం తమకుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వజాగౌని వెంకటన్న గౌడ్, డాక్టర్ అశోక్, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు గుర్రం రాఘవేందర్, నాయకులు దేవర శివ, చంద్రయ్య, గౌతమ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకిన యువకుడు..



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

భవనంపై నుంచి దూకిన ఓ యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం చిట్టిబాబు అనే వ్యక్తి శ్రీరామ్ నగర్ కాలనీలోని మూడంతస్తుల భవనంపై నుంచి దూకాడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి బాధితుడిని దగ్గరలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సూరారం పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. సదరు వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఒక్కసారిగా భవనం పైకి ఎక్కి కిందకు దూకాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి బి.కార్తీక్ గౌడ్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్‌ల ఆదేశాల మేరకు మంగళవారం ఏ.ఈ.స్వాతి,వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్ దగ్గరుండి పనులు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నయీమ్,హాషమ్,ఈశ్వరి,రమేష్ గౌడ్, బాబా, అల్లావుద్దీన్, శ్రీను,రాజు,బస్తీ వాసులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం



- ఇద్దరు నిందితులు రిమాండ్
- తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించిన పోలీసులు
- పిల్లలు పుట్టడం లేదని బాలుడి కిడ్నాప్..!
- వివరాలు వెల్లడించిన డీసీపీ సురేష్ కుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పెండ్లయ్యి 20 సంవత్సరాలు గడిచినా తనకు పిల్లలు పుట్టడం లేదని ఫుట్ పాత్ పై తల్లిదండ్రుల పక్కన పడుకున్న 8 నెలల బాలుడిని అపహరించిన సంఘటన నగరంలో సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించింది. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలు మంగళవారం సాయంత్రం షాపూర్ నగర్ లోని బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ.సురేష్ కుమార్ వెల్లడించారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రనికి చెందిన కలివల గీత,రాధే దంపతులు గత కొన్ని నెలల క్రితం బతుకుతెరువు నిమిత్తం సనత్ నగర్ పరిధిలోని ఫతేనగర్ శివాలయం రోడ్డులో చెత్త ఏరుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు 8 సంవత్సరాల బాలుడితో పాటు,శివం(8) ఉన్నారు. ఈ నెల 22న శివాలయం రోడ్డుపై విపిన్ ఇండస్ట్రీ షట్టర్ ముందు ఇద్దరు పిల్లలతో కలిసి వారు నిద్రిస్తున్నారు.అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో గుర్తు తెలియని వారు బాలుడిని అపహరించారు .బాలుడు ఏడవకుండా నిందితులు జాగ్రత్త పాటించారని పోలీసులు తెలిపారు.తల్లిదండ్రులు ఉదయం లేచి చూసేసరికి బాలుడు లేకపోవడంతో లబోదిబోమంటూ రోదించారు.చుట్టుపక్కల వెతికిన ఇరుగుపొరుగు వారిని వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తమ కొడుకును ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని 23న సనత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. సీఐ.కే.శ్రీనివాసులు,బాలనగర్ ఎస్.ఓ.టి, సి.సి.ఎస్.సంయుక్త ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు.ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి బాలుడిని కిడ్నాప్ చేసినట్లు నిర్ధారించి విచారణ చేపట్టారు. నిందితులు బీహార్ రాష్ట్రం,చాప్రా జిల్లాకు చెందిన సత్యనారాయణ రామ్, సన్నీ కుమార్ పాండే(24) లుగా గుర్తించారు.ఇదిలా ఉండగా సత్యనారాయణ రామ్ బాలనగర్ ప్రాంతంలోని గౌతమ్ నగర్ లో ఉంటూ ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవిస్తున్నాడని, సన్నీ కుమార్ పాండే డ్రైవర్ గా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. తాను వచ్చి పోయే మార్గంలో బాలుడిని గమనించి ఎత్తుకెళ్లి పెంచుకోవాలని అనుకున్నట్టు సత్యనారాయణ రామ్ పోలీసులకు వివరించాడు. ఇద్దరు నిందితులు పోలీసుల కళ్ళు కప్పి బాలుడిని తీసుకొని పారిపోతుండగా చాకచక్యంగా వలపన్ని పట్టుకున్నారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు. 24 గంటల వ్యవధిలోనే కేసు చేధించిన పోలీసులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. నిందితుడి వద్ద నుంచి AP 28 TD 7112 నెంబరు గల టాటా యోధ ట్రక్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ సమావేశంలో ఏసిపి. హనుమంతరావు, సిఐ.కే.శ్రీనివాసులు, ఎస్సై ఎండి. అబ్దుల్ హాయ్యూమ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్‌లకు బిల్డ్‌నౌ డీసీఆర్‌పై శిక్షణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ కోసం అధునాతన సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్ అమలులో భాగంగా బిల్డ్‌నౌ శిక్షణ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటిని సిస్టం ద్వారా నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం, వేగవంతమవుతుందని తెలిపారు. బిల్డ్ నౌ ద్వారా నగర పౌరులు ఆన్ లైన్ లోనే తమ నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చుని, అదేవిధంగా అనుమతులను త్వరితగతిన పొందవచ్చున్నారు. ఈ విధానం పారదర్శకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నగర పౌరులకు, సంబంధిత అధికారులకు, ఆర్కిటెక్ట్‌లకు, ఇంజినీర్లకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. నిర్మాణ అనుమతులు నిర్దీత కాల వ్యవధిలో పొందడంతో పాటు అన్ని అనుమతులు సింగిల్ విండో సిస్టంలో తీసుకునేలా రూపొందించడం జరిగిందన్నారు. బిల్డ్ నౌ శిక్షణ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకొని బాగా నేర్చుకోవాలని ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్లకు మేయర్ సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... జీహెచ్ఎంసీలో బిల్డ్ నౌ కార్యక్రమాన్ని ప్రారంభించామని, దీంతో ఉన్న సిస్టమ్ కు కొత్త ఫీచర్స్ తో నిర్మాణ అనుమతుల ప్రక్రియకు వన్ సింగిల్ ఫ్లాట్ ఫాంగా పనిచేస్తుందన్నారు. అప్లికేషన్స్, అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా, సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. సీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ బిల్డ్ నౌ స్క్రూటిని సిస్టం ద్వారా నిర్మాణాలకు సంబంధించి పలు సమస్యలు వేగవంతంగా పరిష్కారం కాగలవని తెలిపారు. బిల్డ్ నౌ శిక్షణ కార్యక్రమం మార్చి 9 వరకు ప్రతిరోజు రోజు రెండు సెషన్ లలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు 10 తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అయ్యే అవకాశం ఉందని. ఇట్టి శిక్షణ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్, ఆర్కిటెక్ట్ లు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించాలి



- ఆర్.ఐ.పద్మజ
- నాసాలో చింతల్ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు విద్యతోపాటు,శాస్త్ర సాంకేతిక రంగాలలో మేధాశక్తిని పెంపొందించుకొని ఆ దిశగా ప్రతిభ కనబరచాలని ఆర్.ఐ.పద్మజ అన్నారు. ఇటీవలే నిర్వహించిన నాసా లైవ్ ఇన్ హెల్తీ స్పేస్ కాంటెస్ట్ (2024)లో చింతల్ బ్రాంచ్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆర్.ఐ.పద్మజ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువుతోపాటు వారి మనోభావాలకు అనుగుణంగా వారిలోని నైపుణ్యతను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల కృషితోనే రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించగలిగామని సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల క్యాంపస్‌లో ఆర్.ఐ.పద్మజ తో పాటు జోనల్ కోఆర్డినేటర్‌లు మురళీ కృష్ణ, వెంకట శివ,ప్రిన్సిపల్ శ్వేత రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు..

మహా శివరాత్రి శుభాకాంక్షలు : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆ మహాదేవుడి కృపా కటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శివ పార్వతులను కోరుకుంటున్నానని అన్నారు.



పలుగుల రామచంద్రయ్యకు ప్రతిష్టాత్మక అవార్డు

నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజుకాలనీ ప్రాంతానికి చెందిన హెచ్ఏఎల్ విశ్రాంత ఉద్యోగి, వయోవద్ధుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగుగుల రామచంద్రయ్య ప్రతిష్టాత్మక అవార్డు పొందారు. ఇటీవల రాజస్థాన్ లోని ఉదయ్ పూర్‌లో జరిగిన జాతీయ వయోవద్ధుల వార్షిక మహా సభలలో రాజస్థాన్ గవర్నర్ హరిభౌ బగాడే చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం వయో వద్ధుల సంఘం తరుపున ఆయన చేస్తున్న విశిష్ట సేవలను అభినందిస్తూ ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2007లో ప్రభుత్వం వయోవద్ధుల సంరక్షణకు చట్టం అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. 2011, 2022 లో ఆ చట్టాన్ని మరింత పటిష్టంగా సవరించిందన్నారు. వయో వద్ధుల అభ్యున్నతికి వారి సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ ఐస్కాన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో పాటు 1500 మంది పాల్గొనగా తెలంగాణ నుంచి 72 మందితో పాటు తెలంగాణ వయోవద్ధుల సంఘం ఉపాధ్యక్షులు విశ్వనాథం, దేవిదాస్ దేశ్ పాండేలు, కార్యదర్శి రాజన్న, సంయుక్త కార్యదర్శి సైడ్ల మొండయ్య, కోశాధికారి దయా నంద్, ప్రతిని ధులు గోపి సత్యనారాయణ, బోనగిరి రాజరెడ్డి, కోయల్కార్ నారాయణ, కొనరెడ్డి మల్లారెడ్డి, ఈగ సత్యనారాయణ, శ్రీనివాసచారి, పళ్ళ నారాయణ, రామ్, కల్యాణి కుట్టి, పుష్పాలత, సువర్ణ హాజరయ్యారు.

కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా మంగళవారం నియోజకవర్గ ప్రజలను కలిసి వారి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మన రాష్ట్రాన్ని ఆధునిక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి చాలా కృషి చేస్తున్నారన్నారు.ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించి హైదరాబాద్ మహా నగరాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చడమే సీఎం రేవంత్ రెడ్డి ,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు లక్ష్యం అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందాన్నారు. నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు







నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

నేటి శివరాత్రి మహోత్సవాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని శివాలయాలు సర్వంగసుందరంగా ముస్తాబయ్యాయి. కుత్బుల్లాపూర్, సూరారం శివ హిల్స్‌లోని శ్రీ ఉమా మహేశ్వరస్వామి శైవ క్షేత్రంలో సకల ఏర్పాట్లు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు ముద్దాపురం మదన్ గౌడ్ విద్యుత్ దీపాలు, కాషాయం తోరణాలతో ఆలయ పరిసరాలను అలంకరింపజేశారు. శ్రీ ఉమా మహేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు తాగునీరు, వాహన పార్కింగ్, భక్తులు సేదతీరేందుకు, జాగారం చేసేందుకు అవసరమైన చలువ పందిళ్లను వేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా స్వామివారి దర్శనం సులువుగా జరిగేలా అన్ని చర్యలు, జాగ్రత్తలు , సదుపా యాలను కల్పించినట్టు ఆయన తెలిపారు. నేడు (బుధవారం) మహాశివరాత్రి జాతర, లింగోర్భవ మహా పూజ... స్వామి వారి అభిషేకములో పాల్గొను భక్తులకు లడ్డూ ప్రసాదం.. వద్దులకు చంటిపిల్లల తల్లులకు ప్రత్యేక పాసులు ఇవ్వనున్నట్టు తెలిపారు. 27న అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కపకు పాత్రులు కాగలరని కోరారు.

పార్వతి పరమేశ్వరుల కళ్యాణంలో బండి రమేష్



నవతెలంగాణ-కూకట్‌పల్లి/బాలానగర్

మహాశివరాత్రిని పురస్కరించుకుని, పలు శివాలయాలలో పార్వతిపరమేశ్వరుల కళ్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో మహాదేవుడి కళ్యాణం కమనీయంగా, వీనుల విందుగా జరిగింది. ఉత్సవాలకు కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి, ముఖ్య అతిథిగా హాజరై దేవేరుల కళ్యాణం తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందారు. గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, పుష్ప రెడ్డి ,కుక్కల రమేష్, మేకల రమేష్, కుక్కల రాజు, గూడెపు నాగరాజు, వరహాల స్వామి, శివా చౌదరి, బాలరాజు, నరేష్, రాజ్ పటేల్ ,జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు బండి రమేష్‌కు ఆహ్వానం

కేపీహెచ్‌బీ : మహా శివరాత్రి సందర్భంగా ఐడీఎల్ రంగాధముని చెరువు రోడ్డులో ఉన్న శ్రీ పాపా నాశేశ్వరా దేవాలయం (పాప గుడి)లో నిర్వహించే మహా శివరాత్రి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం కాంగ్రెస్ కూకట్ పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సప్పిడి వినోద్, సప్పిడి భాస్కర్, పందిరి సాయిరాం కాంగ్రెస్ నాయకులు ఎండీ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.



నిత్య నూతనమైందే టెక్నాలజీ

- అభివృద్ధి సాధనలో కృతిమ మేధ, డిజిటల్ సాంకేతికత అవసరం
- ఇఎస్‌సీఐ జాతీయ సెమినార్‌లో ప్రసంగించిన పలువురు మేధావులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టెక్నాలజీ అనే పదం నిత్య నూతనమైనదని, ప్రాచీన కాలంలోనే మనిషి రవాణా సాధన కోసం చక్రాన్ని కనిపెట్టడం వలన ఈరోజు కోట్లాది మైళ్ళ దూరాన్ని వేగంగా చేరుకోవడానికి సాధ్యమైందని రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మెన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి అన్నారు. ఇక నేవిగేషన్ ద్వారా ప్రపంచంలోని ఎక్కడెక్కడో వున్న ప్రదేశాలను కనుక్కోవడం, ప్రింటింగ్ ప్రెస్ మొదలు, నాటి పారిశ్రామిక విప్లవం నుంచి నేటి కత్రిమ మేధ వరకు మనిషి ఇంకా ఇంకా మెరుగైన జీవితం కోసం పాటు పడుతున్నారని, ఇప్పటికే ఆర్టిఫిషల్ ఇంటిలెజెన్స్ ఏరో స్పెస్, హెల్త్ కేర్, ఫైనాన్స్, రిటైల్, మ్యానుఫాక్చరింగ్, ట్రాన్స్ పోర్టేషన్ . లాజిస్టిక్స్, మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎడ్యుకేషన్, టెక్స్‌టైల్స్ తదితర అనేక రంగాల్లో ప్రవేశించి వినూత్న అభివృద్ధికి దోహదపడుతున్నదని తెలిపారు. కత్రిమ మేధ, ఆధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించుకుంటూ సుస్థిర అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా(ఇఎస్‌సీఐ) ఆధ్వర్యంలో జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్, అవినాష్ గ్రూప్ అఫ్ ఇనిస్టిట్యూషన్స్ సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్కి ప్రాంగణంలోని కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ సమావేశంలో వివిధ కాలేజీలకు చెందిన సుమారు వేయి మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ, వికసిత భారత్ లక్ష్యంగా ప్రపంచ దేశాలతోనే పోటీ పడుతున్న భారతదేశంలో 65 శాతం ఉన్న యువత టక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్ వేర్ అండ్ సర్వీస్ కంపెనీ (నాస్కామ్) వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సంధ్య చింతల మాట్లాడుతూ స్టీమ్ ఇంజన్ కనుక్కోవడం ఒక టెక్నాలజీ అయితే, విద్యుత్ విప్లవం మరొక గొప్ప టెక్నాలజి కాగా ప్రస్తుతం కంప్యూటర్ సిస్టమ్స్ నుండి అగ్మెంటేడ్ రియాలిటీ, రోబోటిక్స్, బ్లాక్ చైన్, 3డి ప్రింటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, న్యానో టెక్నాలజీ అన్నీ కూడా ఆర్థిక రంగం నుండి ఆరోగ్య సంరక్షణ వరకు ప్రపంచ వ్యాప్తంగా ఒక నూతన సాంకేతిక విప్లవాలకు నాంది పలికాయన్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు మాట్లాడుతూ తమ కాలేజి ద్వారా నిత్య నూతనంగా వచ్చే అన్ని టెక్నాలజీలపై సంబంధిత విషయ పరిజ్ఞానం వున్న నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తామని, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు ఏడు వేల మందికి ఏటా శిక్షణ ఇస్తామన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద సుమారు 17 కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో యూజ్ అఫ్ ఏఐ ఇన్ ప్రివెంటింగ్ , ఫోర్ కేస్టింగ్ డెటెక్టింగ్ మ్యాటర్స్ రిలేటెడ్ టు ఎర్త్, ఎయిర్, వాటర్, స్కై అండ్ ఎనర్జి విషయమై రిటైర్డ్ ఐజి డాక్టర్ ఎస్. ఉమాపతి, క్యారీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఏఐ, డ్రైవింగ్ సోషల్ ఇంపాక్ట్ పై అసోసియేట్ వైస్ ఛాన్సలర్ యూనివర్సిటీ అఫ్ ఎమెర్జింగ్ టెక్నాలజీస్ డాక్టర్ హఫీజ్ భాష, ,సైబర్ సెక్యూరిటీ రెసెర్చర్ శ్రీనివాస్ భూసారపు, ఎండ్ నౌ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ అనిల్ రాచమళ్ళ తమ అభిప్రాయాలను తెలిపారు. ఇంటిలిజెంట్ ట్రాఫిక్ మేనేజిమెంట్ -ఈ చలాన్ సిస్టమ్‌పై తెలంగాణ పోలీస్ కమాండెంట్ కంట్రోల్ కార్యాలయంలో పనిచేస్తున్న పోలీస్ ఉన్నతాధికారి నర్సింగ్ రావుతోపాటు తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటున్న తెలంగాణ విద్యార్థులు భవిష్యత్తులో కత్రిమ మేధపై మరిన్ని పరిశోధనలు చేసి ప్రపంచానికి మరొక కొత్త విషయాన్నీ చెప్పే విధంగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమం మొత్తం ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ సెల్ హెడ్ ఇంజనీర్ సాయి కిషోర్ ఆధ్వర్యంలో జరిగింది.



పిల్లలు క్రీడల్లోనూ పట్టు సాధించాలి

- మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ పట్టు సాధించాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేస్ గ్రౌండ్‌లో తెలంగాణ జాగతి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా పిల్లలలో పోటీ స్ఫూర్తి పెరిగి లక్ష్యం వైపునకు పరిగెడుతారన్నారు. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా తోడ్పడుతుందని తెలిపారు. పోటీలను నిర్వహిస్తున్న జాగతి స్టూడెంట్స్ ఫెడరేషన్ వారిని అభినందించారు. సుకుమార్, అహ్మద్, వర్షిత్, రాధ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవానికి డా.సత్యం శ్రీరంగం

నవతెలంగాణ - బాలానగర్

మహాశివరాత్రిని పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణి నగర్, ఫతేనగర్‌లలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఆలయంలో, కూకట్ పల్లి లోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలలో నిర్వహిచిన స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణలతో మధ్య అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సత్యం శ్రీరంగంను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్న సత్యం శ్రీరంగం మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్పారెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ హరిచంద్, మాజీ కార్పొరేటర్ కష్టాగౌడ్, కంచి మహేందర్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్ ముదిరాజ్, కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, రాజు ముదిరాజ్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ లు నరసింహారావు, నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు వరహాల స్వామి, గుండ జ్యోతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం ముస్తాబు...





బిజ్జిలి సాంబయ్య

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాశీ శైవక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన సుభాష్ నగర్ లోని " శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి" ఆలయం మహా శివరాత్రికి ముస్తాబైంది. మంగళ వారం ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, అష్టోత్తర పూజ, 10 గంటలకు నాగమతిక గ్రహణం పూజా, అంకురా ర్పణ, కలశ స్థాపన, పుణ్యహ వాచనం , అఖండ దీపారాధన , గణపతి నవగ్రహ రుద్ర హెూమం.. స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. నేడు మహాశివరాత్రిని పురస్కరించుకొని... అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్ని మౌలిక వసతులను సమకూర్చినట్టు ఆలయ వ్యవస్థాపకులు, ధర్మకర్త బిజ్జిలి సాంబయ్య తెలి పారు. ఆలయ పరిసర ప్రాంతంలో సువిశాలమైన ప్రదేశా లలో ద్విచక్ర వాహనాలు , ఫోర్ వీలర్ వాహనాలకు వేరువేరుగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. భక్తుల దర్శనం కోసం ఆలయంలో ప్రత్యేకకు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉదయం 3 గంటలకు మహా రుద్రాభిషేకం , మధ్యాహ్నం 1 గంటలకు రుద్ర హెూమం, నవగ్రహ హెూమం, రాత్రి 12 గంటలకు లింగార్భవ కాలంలో " శ్రీ పార్వతీ పరమేశ్వర కళ్యాణ " ఉదయం 8 నుండి రాత్రి లింగోర్భవ కాలం వరకు శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి భజన మండలి వారిచే భజన కార్యక్రమం.. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు సాంబయ్య తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా కోరారు.

లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యూసుఫ్‌గూడా డివిజన్‌లోని ఎమ్మార్వో ఆఫీసులో 15 మంది లబ్దిదారులకు కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, ఆర్డీవో సాయిరాం ఎమ్మార్వో నయుముద్దీన్‌తో కలిసి షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ. లక్ష 116 చొప్పున మొత్తం 15 లక్షల ఒక వెయ్యి 740 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ దాస్, దొంగల రామ్ నగర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా సినీ కార్మికుడు మృతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

అనుమానాస్పదంగా సినీ కార్మికుడు మృతి చెందిన ఘటన ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిల్మ్ నగర్ ఎంఆర్‌సీ కాలనీలో నివసించే మద్ది హుస్సేన్(55) సినీ ఇండస్ట్రీలో లైట్‌మ్యాన్‌గా పనిచేసేవాడని, షూటింగ్ లేనప్పుడు మద్యం సేవించేఅలవాటు ఉన్న హుస్సేన్ మంగళవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న డోరు దగ్గర పడుకొని ఉండటం గమనించిన కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించిన అతడు లేవలేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి అతను మృతి చెందాడని నిర్ధారించుకున్నారు. పక్కనే ఉన్న సీసీ కెమెరా చూడగా.. మృతుడు ఇంటి పక్కనే నూతనంగా నిర్మిస్తున్న భవనం పిల్లర్ గుంతలో పడిపోగా అతన్ని భవన యజమాని బయటకు తీసాడు. అతడిని పోలీసులు విచారించగా గుంతలో పడిపోయి ఉన్న విషయాన్ని గమనించి బయట తీసి పడుకో పెట్టానని తెలిపాడు. మృతుడి తలపై, మోకలిపై, నుదిటి పై గాయాల ఆధారంగా అనుమానాస్పద మృతిగా భావించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం



- పీఎస్‌యూ

నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాల, న్యూ సెమినార్ హాల్లో పీడీఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన ప్రస్తానాన్ని నెమరు వేసుకుంది. ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులు విద్య, సామాజిక సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యచరణ, తీర్మానాలు చేసి నూతనంగా హాజరైన విద్యార్థులతో చర్చించారు. పీడీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం, ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీఎస్‌యూ)గా కొనసాగుతుందని విద్యార్థి లోకానికి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధిక ఫీజుల దోపిడీ నిలిపివేయాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం వెనక్కి తీసుకోవాలని, తీవ్రమవుతున్న విద్యా కాషాయీకరణ, విద్యా కేంద్రీకరణలను వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి. యూనివర్సిటీలలో ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలని, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లకు, గురుకులాలకు పక్కా బిల్డింగులు నిర్మించాలని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో డిటెన్షన్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి. కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి. నిత్యవసర వస్తువులపై రోజురోజుకు పెరుగుతున్న అధిక ధరలను వ్యతిరేకిస్తూ ఉద్యమిద్దామన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల ప్రతినిధులు ఆవుల నాగరాజు, కోట ఆనంద్, ఎం రాజశేఖర్, యం.హరీర్, కుమార్, పవన్, ప్రశాంత్ కన్నా, వినోద్, సంపత్, ప్రభుదాస్, వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్, ప్రశాంత్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

పండుగ తర్వాత నోటిఫికేషన్



- ప్రాజెక్టుల వారీగా ఖాళీల వివరాల సేకరణ పూర్తి
- మొత్తం 169 మంది టీచర్లు, 356 ఆయాల భర్తీ

హైదరాబాద్ జిల్లా పరిధిలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) కింద 5 ప్రాజెక్టులున్నాయి. జిల్లాలోని ఖైరతాబాద్, నాంపల్లి, చార్మినార్, గోల్కొండ, సికింద్రాబాద్‌లోని ఆయా ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 970 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిల్లో 801 మంది టీచర్లు, 614 మంది ఆయాలు పనిచేస్తున్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అమలుతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంగా ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఇటీవల సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి సీతక్క రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్స్ పోస్టుల భర్తీకి ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల భర్తీకి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే అయిదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో వివరాలు సేకరించారు. అందుకు సంబంధించిన నివేదికను కూడా సిద్ధం చేశారు. భర్తీకి సంబంధించిన విధివిధానాల కోసం ఎదురుచూస్తున్నారు. ఆ శాఖ డైరెక్టర్ నుంచి గైడ్‌లైన్స్ వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపించనున్నారు. కలెక్టర్ ఆమోదం లభించిన వెంటనే నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేస్తారు. పండుగ తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు చెప్పారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) కింద 5 ప్రాజెక్టులున్నాయి. జిల్లాలోని ఖైరతాబాద్, నాంపల్లి, చార్మినార్, గోల్కొండ, సికింద్రాబాద్‌లోని ఆయా ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 970 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిల్లో 801 మంది టీచర్లు, 614 మంది ఆయాలు పనిచేస్తున్నారు. దీంతో ఖాళీగా ఉన్న 169మంది టీచర్లతో పాటు 356 మంది ఆయాల పోస్టులను భర్తీ చేయనున్నారు. కోవిడ్ పిరియడ్ 2021లో అయిదు ప్రాజెక్టుల పరిధిలో ఖాళీలు ఏర్పడిన చోట టీచర్లు, ఆయాలను భర్తీ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇప్పటివరకు ఎలాంటి నియమాకాలు జరగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో పోస్టుల భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇదిలావుంటే అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టులకు ఇంటర్మీడియట్ విద్యార్హతగా నిర్ణయించారు. ఇకపోతే రోస్టర్ పాయింట్స్ కేటాయింపు ప్రక్రియతో పాటు దరఖాస్తులు స్వీకరణ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా చేపట్టాలనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. మరో నాలుగైదు రోజుల్లో వీటిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఇదిలావుంటే ఖాళీ పోస్టుల భర్తీతో కేంద్రాల నిర్వహణ మెరుగుపడి పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం జిల్లాలో 1నుంచి ఆరేండ్లలోపు వయసు ఉన్న చిన్నారులు 1,16,291 మంది ఉన్నారు. 11వేలకుపైగా గర్భిణీలు, బాలింతలు ఉన్నారు..



అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సంఖ్య ఇలా..

ప్రాజెక్టు	మంజూరు	వర్కింగ్	ఖాళీలు
చార్మినార్	274	230	44
గోల్కొండ	163	143	20
ఖైరతాబాద్	151	132	19
నాంపల్లి	201	161	40
సికింద్రాబాద్	181	135	46
మొత్తం	970	801	169

ఆయాల సంఖ్య ఇలా..

ప్రాజెక్టు	మంజూరు	వర్కింగ్	ఖాళీలు
చార్మినార్	274	175	99
గోల్కొండ	163	109	54
ఖైరతాబాద్	151	90	61
నాంపల్లి	201	131	70
సికింద్రాబాద్	181	109	72
మొత్తం	970	614	356

నేను బీసీ బిడ్డనే నన్ను ఆశీర్వదించండి



- డాక్టర్ బండారు రాజ్ కుమార్

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్రంలో బీసీల్లోనే ఐక్యత కొరబడిందని ఎమ్మెల్సీ అభ్యర్థి బండారు రాజ్ కుమార్. బీసీ బిడ్డనైన తనకు బీసీ సంఘాలు, బీసీ కులాలు కొన్ని మాత్రమే మద్దతు ఇస్తున్నాయని, బీసీ బిడ్డగా గుర్తించకపోవడం శోచనీయమని అతను ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సతీమణి డా. కృష్ణ ప్రియా, శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల బరిలో ఉన్న తన 37 సీరియల్ నెంబర్‌కు ఓటు వేసి గెలిపిస్తే అక్షర యోధుల కష్టాలు తీర్చడమే కాకుండా మహిళలకు విద్యలో సమ ప్రాధాన్యత ఇవ్వటం సమస్యలను పరిష్కరించుకునే విధంగా కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రాష్ట్రంలో మున్నూరు కాపుల సంఖ్యను తగ్గించినట్టే ప్రస్తుతం మునూరు కాపులకు మద్దతు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తపరచారు.

రంజాన్ ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ సమావేశం

- మసీదు పరిసర ప్రాంతాల్లో శుభ్రత
- ఎంటమాలజీ విభాగం ద్వారా ఫాగింగ్
- నిరంతర విద్యుత్ సరఫరా, నీటి సరఫరా..
- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

రంజాన్ పండుగ, రంజాన్ ఉపవాస నెల ప్రార్థనలు విజయవంతంగా జరగడానికి కావాల్సిన ఏర్పాట్లపై గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ నియోజకవర్గ మసీదుల పెద్దలు, ప్రభుత్వ అధికారులు, పోలీస్‌లు, జలమండలి, విద్యుత్, జీహెచ్‌ఎంసీ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ.. మసీదు పరిసర ప్రాంతాల్లో శుభ్రతను పాటించాలని, మసీదులకు వెళ్లే మార్గాల శుభ్రంగా ఉంచాలన్నారు. రహదారుల మరమ్మతులు చేసి, నాణ్యమైన రహదారులను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. లైన్ మార్కింగ్ నిర్వహించాలని సూచించారు. ఇఫ్తార్ తరువాత వ్యర్థాల తొలగింపు, ప్రత్యేక శుభ్రత సిబ్బందిని పేర్కొన్నారు. ఎంటమాలజీ విభాగం ద్వారా ఫాగింగ్ కార్యక్రమం, దోమలు వంటి సమస్యల నివారణకు ప్రతి మసీదుల వద్ద ఫాగింగ్ చేయలని కోరారు. వీధుల్లో తిరిగే కుక్కల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి వీధిలో వీధి దీపాలను అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం అందుబాటులో ఉంచాలని, డ్రయినేజి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధించిన అధికారులకు సూచించారు. పండుగకు సంబంధించి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పండుగ బజార్లకు అనుమతి ఇవ్వడం, మసీదుల సమీపంలో ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌తో ప్రత్యేక చర్యలు, శుభ్రతకు సంబంధించి జీహెచ్‌ఎంసీ తోపాటు ఆరోగ్య శాఖ కూడా సంయుక్తంగా పని చేయడం అవసరం ఉందన్నారు. రంజాన్ మాసం ప్రతి ముస్లిం సోదరులకు పవిత్రమైనది. ఈ నెలలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో అన్ని అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. ఆమె గత రంజాన్ అనుభవాలను ప్రస్తావిస్తూ.. గతంలో జరిగిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూనే, ఈ సారి మరింత మెరుగైన సేవలతో ప్రజల సంక్షేమం కోసం ప్రయత్నిస్తాం. మసీదులకు వెళ్లే మార్గాలు సులభంగా ఉండేలా చూడటం, రాత్రి వేళల్లో వీధి దీపాలను సక్రమంగా వెలిగించటం, అలాగే దోమల సమస్యలను నివారించే ఫాగింగ్ కార్యక్రమాలను జాగ్రత్తగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

సర్వే వివరాలు తెలుసుకున్న బీసీ కమిషన్ చైర్మెన్



నవతెలంగాణ-ఓయూ

బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ కులగణన సర్వేలో భాగంగా మంగళవారం బౌద్ధ నగర్, సీతాఫల్‌మండీ డివిజన్లలో పర్యటించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఉన్నారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి కులగణన సర్వే వివరాలు ప్రజల నుండి తెలుసుకొని సర్వే కానీ ఇంటికి ఎన్యూమరేటర్లను పంపి సర్వే చేయించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కుటుంబం కులగణ సర్వేలో పాల్గొనాలని ఒకవేళ సర్వేలో భాగంగా అందుబాటులో లేనివారు. 040 21111111 నంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలియజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ (మాజీ) ఉపాధ్యక్షులు ఆదం సృజన్ కుమార్, జలంధర్ రెడ్డి, షకీల్ ఖాన్ అనిల్ కుమార్, వాయిదుద్దీన్, లడ్డు, ప్రతాప్, చక్రధర్, బబ్లు, కుద్దూస్ శేఖర్, శోభ, రాధా, కల్పన, కిరణ్, మహేష్, ప్రేమ్, బాలరాజ్, బ్రహ్మాజీ, నిస్సార్, రమేష్, జనార్ధన్, ఆమెర్, పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకున్న సీఎన్ రెడ్డి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన సభ్యులు మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని నియామక పత్రం అందుకున్నారు.

ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రసీద

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 ఏసీపీగా ఎన్. ప్రసీద మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఖైరతాబాద్ ఆఫీసులో డీటీసీ ప్లానింగ్ శాఖలో పని చేస్తూ.. బదిలీపై యూసుఫ్‌గూడా సర్కిల్‌కు వచ్చారు. ఎవరైనా సర్కిల్‌లోని ప్రజలు స్వయంగా వచ్చి తనను కలవాలని, ప్రజలకు సేవలు చేయుటకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని ప్రజలను నాయకులను కోరారు.

యువత మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి

- తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డా.ఎం.ఏ.కరీం



నవతెలంగాణ-బేగంపేట్

లక్ష్య సాధనలో ఎదురయ్యే అవాంఛిత ఆలోచనలకు యువత దూరంగా ఉండాలని, ఆత్మన్యూనత నుంచి ఆత్మవిశ్వాసం వైపు అడుగులు వేయాలని అందుకు తమ మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డా.ఎం.ఏ.కరీం అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని యూత్ హాస్టల్‌లో యువకుల కోసం యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో యువతలోని మానసిక దృఢత్వాన్ని పెంపొందించుటకు వారి మనోవికాసానికి దోహదపడే విధంగా నిర్వహించిన మానసిక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యువత భావి జీవితానికి అద్దం పట్టే విధంగా మానసిక శక్తి కేంద్రీకరణ పద్ధతులు వాటి ఉపయోగలపై శిక్షణ ఇచ్చారు. ఆత్మ గౌరవం ఆత్మవిశ్వాసం ఉంటేనే భవిష్యత్తులో విజయ శిఖరాలను అధిరోహించగలరని, యువత తమ ప్రతిభ, నైపుణ్యాలను అనుగుణంగా లక్ష్యాలను ఉన్నతంగా ఎదిగేలా తీర్చి దిద్దుకోవాలన్నారు.

వృత్తిపై దాడి చేస్తే ఊరుకోం.. ఉద్యమిస్తాం

- మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

వృత్తిపై దాడి చేస్తే ఊరుకోం ఉద్యమిస్తామని, నీరా.. నిండా ముంచే పని పెట్టుకున్న ప్రభుత్వ ఆగడాలను ఇక సాగానివ్వమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు మార్చి 17న గౌడల మహా ధర్నకూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవికుమార్, ఎల్లికట్టి విజయ్ కుమార్ గౌడ్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. మార్చి 17న హైదరాబాద్ నగరంలోనీ ఇందిరా పార్కు వద్ద జరిగే గౌడల మహా ధర్నకూ కదిలి రావాలని 33 జిల్లాల గౌడలను కోరారు. ఈ సందర్భంగా వారి ప్రధాన డిమాండ్‌లను తెలిపారు. గ్రామానికి ఐదు ఎకరాలు భూమి, చనిపోయి వారికి 10 లక్షలు, ధర్మ భిక్షం ప్రదెక్ష్, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు, ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం, గౌడ ఆత్మ గౌరవ భవనం, ఎన్నికల ప్రచారంలో ప్రకటించన 16 కోట్లు నిధులు కేటాయించాలి పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని, గౌడ కులస్తులైన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. కులానికి చెందినా వారికి ఆపదోస్తే అదుకోరా అని, మంత్రి పొన్నం ప్రభాకర్ నీరా కేఫ్‌ను ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చిన స్పందించక పోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. భారీ సంఖ్యలో ఇందిరా పార్కు వద్దకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చి ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఇది ఆరంభమే దీంతో ప్రభుత్వం పతనం తప్పదనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, గౌడ కల్లుగీత సంఘాల నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, అంబాల నారాయణ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘాల జేఏసీ నుంచి అయిలి వెంకన్న, సాయిలు గౌడ్, నాగభూషణం గౌడ్, గౌడ విద్యార్థి సంఘం నుంచి శ్రీకాంత్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, గౌడ అఫిషియల్స్ నుంచి డా.బండి సాయన్న, బిజినెస్ నెట్‌వర్క్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ఇతర నేతలు రామ్మోహన్‌గౌడ్, మానసగౌడ్, బీఆర్ఎస్వీ నేతలు రమేశ్‌గౌడ్, పంజాబ్ హర్యానా రాష్ట్రాల గౌడ సంఘం అధ్యక్షుడు మోహన్‌సింగ్, కారింగు బిక్షమయ్య గౌడ్, ఉపాధ్యక్షులు (గోపా) తదితర నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉపాధికి పెద్దపీట



- వెస్లీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.విమల్ సుకుమార్
- ప్లేస్ మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన

నవతెలంగాణ-ఓయూ

తమ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఉన్నత విద్యాతో పాటుగా వారికి ఉపాధి కల్పన కోసం కృషి చేస్తామని వెస్లీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ డా.బి.విమల్ సుకుమార్ అన్నారు. మంగళవారం వెస్లీ కళాశాలలో ప్లేస్ మెంట్స్ సెల్ ఆఫీసర్ పి.శ్రావిన్ కృపాకర్ ఏర్పాటు చేసిన ప్లేస్ మెంట్స్ డ్రైవ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తమ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా విద్యా అందిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్లేస్ మెంట్ డ్రైవ్‌లో టెక్ మహీంద్రా, కమల్ క్యూ, కార్పొన్, జీనియస్, కనెక్ట్, క్వాన్ లాంటి ప్రతిష్టాత్మకం అయిన సంస్థలు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నాయని తెలిపారు. అంతేకా కుండా వివిధ కంపెనీలు పలువురు విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. వారికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరంలో పలు విద్యా సంస్థల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 3న దక్షిణాది రాష్ట్ర కమిటీ సమావేశం



- ప్రొ. గాలి.వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ

నాన్ ములికి నార్త్ ఇండియా గో బ్యాక్ నినాదంతో మార్చి 3న సాయంత్రం 3 గంటలకు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ హైదరాబాద్‌లో దక్షిణాది జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసినట్టు జాక్ చైర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం జాక్ కార్యక్రమంలో కో చైర్మెన్‌లు నకిరేకంటి సంజీవరావు, నడిమిదొడ్డి ఆనంద్ కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రయివేట్ ఉద్యోగాల్లో 75 శాతం తెలంగాణ నిరుద్యోగులకు 25 శాతం దక్షిణా ది వారికి ఇవ్వాలని అలాగే వ్యాపార వాణిజ్య రంగాలతో పాటు అన్ని రంగాల్లో వాటా దక్కాలని, కాని ఉత్తరాది రాష్ట్రల వారు మా అవకాశలను దోచుకొని తింటున్నారని వాటి పరిరక్షణ కోసం డీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించడంలో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ సమావేశంలో అందరు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

బీసీలంతా రెడ్ల పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం

- జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో రాజకీయాలు క్రియాశీలకంగా మారాయని, బీసీలంతా ఓటును ఆయుధంగా మలిచి రెడ్ల పాలనకు చరమగీతం పాడబో తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ జోస్యం చెప్పారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటెలె క్చువల్ ఫోరం చైర్మెన్ మాజీ ఐఎఎస్.చిరంజీవుతో కలిసి జాజుల మాట్లాడారు. బడుగుల ఆత్మగౌరవం, బలిసినోళ్ల ఆధిపత్యం మధ్య జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు ప్రసన్నహరికిషన్, పూల రవీందర్, మల్క కొమురయ్యల విజయం పక్కా అయిందనీ ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తన ఆదిలాబాద్ పర్యటనలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓడిపోతారని విషయాన్ని కూడా పరోక్షంగా ఒప్పుకొ న్నారని గుర్తుచేశారు. అగ్రకులాల నోట్లను తిరస్క రించి బీసీలకు ఓటు వేయలానే నినాదంతో బీసీలకు గత ప్రభుత్వ సీఎంకూ బహిరంగ లేఖ రాశాన్నారు. బీసీ అభ్యర్థులను గెలిపించుకొంటే తెలంగాణ ఉద్యమం కంటే వంద రెట్లతో బీసీల రాజకీయ ఉద్యమం ప్రారంభమవుతుందని చెప్పారు. తద్వారా రెడ్ల, వెలమల రాజ్యాన్ని కూల్చేసి, 2028లో బీసీ బిడ్డ సీఎం పీట మీద కూర్చోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కరీంనగర్ బిజెపి అభ్యర్థి అంజిరె ఓడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి, నల్లగొండలో పీఆర్‌టీయూ రెడ్డి అభ్యర్థుల ప్రలోబాలకు, డబ్బులకు లొంగవద్దని సూచించారు. అగ్రకులాలకు ఓటేస్తే మోరిలో వేసినట్టేనని, ఆత్మగౌరవానికి అమ్ము కొన్నట్టేనని తెలిపారు. బీసీ వాదం చూసే ఈ ముగ్గురు బీసీ అభ్యర్థులకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చిరంజీవులు మాట్లాడు తూ..బీసీలకు ఓట్లు వేస్తే గెలుస్తారని అనే నానుడి బలపడుతుందన్నారు.

రానున్న కాలంలో బీసీలే రాష్ట్రంలో రాజ్యాధికారాన్ని అందుకోబోతున్నాయని దానికి ఫౌండేషన్‌ను ఇక్కడి నుంచి వేయాలని ఆయ న బీసీ సంఘాలను కోరారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ గణేశాచారి, కన్వీనర్ బాలరాజ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ తదితర నేతలు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో భాగస్వామ్యులు కావాలి

● నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో ప్రజలు భాగస్వామ్యులు కావాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగారంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో స్వచ్ఛ్ సర్వేక్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ్ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగస్వామ్యమై చెత్త ,ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దుటకు ప్రజలందరూ కృషి చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శనం, రఘు, డీఆర్‌సీసీ కన్సల్టెంట్ కార్తీక్ , మహిళా స్వశక్తి సంఘాలూ ,మున్సిపల్ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



నవతెలంగాణ -శామీర్‌పేట

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాల వ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వాహకులు శివాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పచ్చని తోరణాలను ఏర్పాటు చేయడంతో శివాలయాలు శివరాత్రి శోభను సంతరించుకున్నాయి.

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద 2కే రన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

2025 ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచేందుకు ఆర్బీఐ సూచనల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం 2కే వాక్‌ను నిర్వహించారు. ఈ వాక్‌ను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఏడాది ఈ కార్యక్రమానికి థీమ్ "మహిళా శ్రేయస్సు" అని ఆర్థిక ప్రణాళిక, సూక్ష్మ పొదుపులు, నష్ట తగ్గింపుపై దష్టి సారించాలనేది ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా సంక్షేమాధికారి, బీసీ వెల్ఫేర్ అధికారి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి, డీఆర్డీఓ, ఎల్డీఎం, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి

ఎన్నికైన వారికి సర్టిఫికేట్లు ప్రదానం




నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి ఎన్నికైన వారికి మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగిన నేపథ్యంలో గెలుపొందిన వారికి సెక్రటరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా గెలుపొందిన 15 మందిలో 10 మందికి సర్టిఫికెట్ అందజేశారు. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత, అక్బర్ బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మిన్హాజుద్దీన్, చాంద్రాయణగుట్ట కార్పొరేటర్ అబ్దుల్ వహాబ్, ఘాన్సీ బజార్ కార్పొరేటర్ ప్రవీణ్ సుల్తానా, దూద్ బౌలి కార్పొరేటర్ మహమ్మద్ సలీమ్, టోలి చౌకి కార్పొరేటర్ డా.ఆయేషా హుమేరా, హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ, రహమత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప ఉన్నారు.

ప్రాజెక్ట్ వర్క్‌పై

ఒక రోజు విద్యార్థి అభివృద్ధి సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైసెస్ సంయుక్తంగా మంగళవారం లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల ప్రాంగణంలో "ప్రాజెక్ట్ వర్క్‌పై అవగాహన సదస్సు (డిగ్రీ ,పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు) నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అదేవిధంగా కళాశాలలు కూడా జాతీయ విద్యా విధానం 2020 సూచించిన విధంగా సమాజ అవసరాలకు ఉపయోగపడే వివిధ రకాల సాంకేతిక కోర్సులను అందించాలన్నారు. హైదరాబాద్‌లో ఉన్న అన్ని కళాశాలలోకెల్లా నిత్యం విద్యార్థులతో ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహింపచేస్తూ వారిలో ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీస్తున్న కళాశాలలు ఒకటి ఐఐఎంసి అని, ఇంకొకటి ఐపీఈ అని తెలియజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ ఐపీఈ, ఐఐఎంసీ కళాశాలలు సంయుక్తంగా గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులలో పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్టు వర్క్ గైడెన్స్ పైన సదస్సును నిర్వహిస్తున్నాయన్నారు. సదస్సు కోఆర్డినేటర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో పరిశోధనపై అవగాహన కలిగించి ఉత్తమ పరిశోధనలు చేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని తెలియజేశారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ అతిథులతో కలిసి పరిశోధనా విధానంతో కూడిన "ప్రాజెక్ట్ వర్క్ గైడెన్స్" అనే పాకెట్ డైరీని ఆవిష్కరింపజేశారు. సదస్సులో ఓయూకు చెందిన ప్రొ.పాట్రిక్, ప్రొ. రంజిని, ప్రొ.నరేంద్రనాథ్, ప్రొ. సత్యనారాయణ ,ప్రొ. కళ్యాణి, డా.స్వాతి, ఐపీఈకి చెందిన ప్రొ. అనంత కుమార్ ప్రొ. రామకృష్ణ, ప్రొ. చంద్రశేఖర్,ప్రొ. సింజు శంకర్ పరిశోధన విధానం, సమాచార సేకరణ ,సమాచార విశ్లేషణ, నివేదిక రూపకల్పన, పరిశీలనా గ్రంథాల క్రమం మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జంట నగరాలకు చెందిన 50 కళాశాల నుంచి 800 పైగా విద్యార్థులు పాల్గొని పరిశోధన గురించి చాలా విషయాలు నేర్చుకున్నామని ఈ సదస్సు తాము ప్రాజెక్టు వర్క్ చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ఐఐఎంసీ ఐపీఈ వారి ఉచిత కిట్, ఉచిత పాకెట్ ప్రాజెక్టు వర్క్ గైడ్, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా. తిరుమలరావు, డా. సంతోషి, అధ్యాపక ,అధ్యాపకేతర బందం, స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థి సభ్యులు, విద్యార్థి నాయకులు పాల్గొని వారి సహకారాన్ని అందించారు.

కారు ఢీకొని ఇద్దరు మృతి

నవతెలంగాణ-కీసర

కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 24న సోమవారం రాత్రి సమయంలో గూడూరు చంద్రశేఖర్ (32), అతని తమ్ముడు మత్స్యగిరి (27), అల్లుడు శ్రీను (17) బంధువుల ఇంటి నుంచి తిరిగి ఇంటికి యాద్గార్‌పల్లి మీదుగా వెళుతుండగా ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద చీర్యాల్ సమీపంలో మహీంద్రాథార్ (TS 08 JJ9549) కారు అతివేగంగా వెళ్ళి వారి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ బైక్‌పై నుంచి పడిపోయారు. ఈ ప్రమాదంలో గూడూరు చంద్రశేఖర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మత్స్యగిరి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. శ్రీను ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కీసర పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వేసవిలో నీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

• జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వసంత



నవతెలంగాణ - జవహర్ నగర్

వేసవిలో ప్రజలకు నీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జవహర్ నగర్ మున్సి పల్ కమిషనర్ వసంత పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జవహర్ నగర్ పరిధిలోని ప్రజలకు ఎటువంటి నీటి కొరత లేకుండా సరిపడ నీటిని సరఫరా చేయాలని, వాటర్ పైప్స్ లీకేజ్ లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మాధవ చారి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజర్ కౌశిక్, వాటర్ మెన్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీల సమస్యలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బాలికలు, స్త్రీలపై జరిగే హింసను ఆపి, వారికి అండగా ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకులు సలోమి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్‌లో సఖీ కేంద్రం అల్వాల్, శ్రీగంగా చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేర్ల అనిల్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సలోమి, డాక్టర్ అఖిల, విశిష్ట అతిథిగా శ్రీగంగా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు బీర్రు బాల మల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థినిలు, స్త్రీల సంక్షేమంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత ధ్యానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీగంగా చారిటబుల్ ట్రస్టు వైస్ ప్రెసిడెంట్ కే ఎల్ నారాయణ రెడ్డి, సంఘ సేవకులు నర్సింహగౌడ్, అంబేద్కర్ భవన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని ఇంద్రానగర్ కాలనీలో రూ.46 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి సహకారం అందిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఈ సీసీ రోడ్డు పీర్లకోట నుండి బాక్స్ రేట్ వరకు ఉన్న నాలుగు లైన్లలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కార్పొరేటర్ ప్రభుదాస్ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు వంజలి ప్రవీణ్, గుమ్మడి జంపాల్ రెడ్డి, నవీన్ ముదిరాజ్, దుర్గారెడ్డి, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, పూస రమేష్, శశి రాజ్, మహేష్, గణేష్, రామకృష్ణ, చారి, నిస్సార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కీసరగుట్టలో పూజలు



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలల్లో భాగంగా రెండోరోజు ఆలయంలో వైదిక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు రుద్రస్వాహకార హెరీమన్ని నిర్వాహించారు. బిల్వార్చన, ప్రదోషకాల పూ జ, హరతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు వైభవపేతంగా నిర్వహించారు.

కీసరలో పోచమ్మ అంగడి

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతి ఏటా మహాశివ రాత్రికి ముందురోజు మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలోని అమ్మవారిని నగరంలోని యాప్రాల్, మ్యుగూడ, అల్వాల్ ప్రాంతాల నుండి వచ్చే తమిళులు దర్శించుకున్ని కీసరగుట్టకు జాతరకు ఎడ్ల బండ్లు, వాహనాలతో బయలుదేరుతారు. అమ్మవారి ఆలయం వద్దే మేకలు, కోళ్లను కోసి వంటవార్పు చేసుకుని భోజనం చేసి బయలుదేరుతారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

స్వామి వారిని దర్శించుకున్న ఆర్డీవో

కీసర గుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలో భాగంగా కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో క్యు లైన్లు పరిశీలించారు. క్యు లైన్‌లో అంతా చెత్త ఉండడంతో పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చెయ్యాలి

• జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇల్లంబర్తికి కార్పొరేటర్ శ్రవణ్ వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీంలో అప్లై చేసుకున్న వారి వెరిఫికేషన్స్ పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు పంపాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇల్లంబర్తిని మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆధార్ కార్డులో హైదరాబాద్ అని ఉన్నవారి అప్లికేషన్స్ హైదరాబాద్ కలెక్టర్ వద్ద ఆగి పోయాయని , వాటిని సమన్వయం చేసుకోవాలని అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌ను పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం స్కిల్డ్ లేబర్ కోసం పెట్టిన స్కీమ్స్ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వారికి దూరం అవుతున్నాయని తెలిపారు.

పరీక్షలంటే భయం వద్దు





• మనసుతో స్నేహం చేయండి.. మేధావులు కండీ • డాక్టర్ హిప్నోపద్మా కమలాకర్

నవతెలంగాణ - చర్లపల్లి

మనుషుల అంతర్గత శక్తి సామర్థ్యాలను ఆవిష్కరించే మనో విజ్ఞానమే "హిప్నాటిజం" అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నోపద్మా కమలాకర్ అన్నారు. మంగళవారం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్‌కు చెందిన వివేకానంద యూత్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థలకు పరీక్షలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. యూత్ క్లబ్ వ్యవస్థాకులు శరత్ సుదర్శి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి డా.హిప్నోపద్మా కమలాకర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి తన మనసుతోనే స్నేహం చేస్తే, మేధావులు కావచ్చని అన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. కంప్యూటర్‌లో కీబోర్డ్, మౌస్ ఉపయోగించినట్లే... పంచేంద్రియాలు, ఊహాశక్తితో మానవ మేధస్సును ప్రోగ్రామింగ్ చేసుకోవచ్చున్నారు. విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే దానికనుగుణంగా మేధస్సు సమీకృతం చేసుకోవచ్చున్నారు. న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్ (ఎన్.ఎల్.పి) ఆధారంగా ఎలా సాధ్యమో ఆచరణాత్మకంగా విద్యార్థులకు నేర్పించారు. భవిష్యత్ పట్ల ఆకాంక్ష చదువుపై ఆసక్తి, ఏకాగ్రతను ఏర్పరుస్తుందన్నారు. తద్వారా గ్రహణశక్తి పెరిగి జ్ఞాపకం ఉంచుకోగల్గుతారన్నారు. అధిక సమయం విరామం లేకుండా చదివితే మెదడులో ఆక్సిజన్, గ్లూకోజ్ స్థాయిలు తగ్గి గ్రహణం సామర్థ్యం సన్నగిల్లుతుందన్నారు. అందుకే ప్రతి 45 నిముషాలకు పది నిమిషాలు విరామం ఇవ్వాలనా న్నరు. ఆ విరామంలో పుస్తకం మూసి అప్పటి వరకు చదివిన విషయాలను నెమరు వేసుకోవాలన్నారు. అలా ఆ విషయాలు వచ్చేదాకా చదవాలన్నారు. అనంతరం 7రోజులకు, 21రోజులకు, 42 రోజులకు పునశ్చరణ చేస్తే శాస్వతంగా జ్ఞాపకం ఉంటుంద న్నారు. పరీక్షలంటే భయానికి కారణం... తాము నేర్వని విషయాలు పరీక్షా పత్రంలో వస్తాయేమోనన్న అనుమానమేన న్నారు. ఎంత మేధావులైనా తమకు తెలియని విషయాలు చెప్పడం, రాయడం చేయలేరన్నారు. తాము నేర్చిన మేరకు పరీక్ష పత్రం లో ఏమిచ్చినా రాయగలనన్న విశ్వాసంతో విద్యార్థులు పరీక్ష భయాన్ని అధిగమించవచ్చన్నారు. మనుషుల అంతర్గత శక్తి సామర్థ్యాలను ఆవిష్కరించే మనో విజ్ఞానమే "హిప్నాటిజం" అన్నారు. సూచనలతో మానసిక, శారీరక స్థితిగతులను, సామర్థ్యాలను ప్రేరేపించవచ్చని ఆచరణాత్మకంగా చేసి చూపించా రు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు సినిమా అనుకోని పరీక్షలకు వెళ్లాలన్నారు. ఇంకొకరితో పోల్చుకోవద్దని చెప్పారు. ఎవరి శక్తి సామర్థ్యాలు వారివేనన్నారు. ఎలా, ఎప్పుడూ చదవాలో టెక్నిక్స్ ద్వారా ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సమన్వయ కర్తలు టీనా, ఉదయశ్రీ, సహస్రిక, లితిక, సుమన్, అజయ్, ఈసీ నగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ ప్రసాద్, సత్తిరెడ్డి, మల్లేష్ తో పాటు రాష్ట్ర ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాగర్ల రఘు, జయశ్రీ, పాల్గొన్నారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు..

కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్



నవతెలంగాణ - చర్లపల్లి

మహాశివరాత్రి సందర్భంగా ప్రజలకు గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ శుభాకాంక్షలు తెలిపారు. "సర్వ సృష్టికి సంకేతంగా, స్థావర జంగమ సంగమ స్వరూపంగా, లింగమయ్యగా జంగమయ్యగా, శివుడిగా భవునిగా సాంబశివుడిగా, నిత్యం కొలుచుకుం టున్న పరమ శివునిడి పర్వదినం శ్రీకరం శుభకరం సకల మంగళకరం. పార్వతీ పరమేశ్వరుల శుభాశీ స్సులు అందరికీ అందాలని కోరుకుంటున్నాను" తెలిపారు.

అన్న ప్రసాద వితరణ



నవతెలంగాణ - శామీర్ పేట

శామీర్‌పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో దొంతరబోయిన హన్వికశ్రీ జన్మదినం సందర్భంగా వారి తల్లిదండ్రులు దొంతరబోయిన కార్తీక్- వర్షిత దంపతులు, అలాగే కూకట్ పల్లికి చెందిన బి.వీరేష్ - బి విజయ మహేశ్వరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు సాయి తేజస్విని, సాయి చరణ్‌లు అన్నదానం చేశారు. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

సెయింట్ పాల్స్ స్కూల్‌లో ఇంగ్లీషు ఫెయిర్

• హాజరైన కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ సెయింట్ పాల్స్ పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లీష్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలుక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇది విద్యార్థుల అవృద్ధికి ఎంతో ఉపయోగంగా ఉంటుందనీ, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఇంగ్లీష్ ఫెయిర్ ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ అభివృద్ధికి ఎంతో దోదపడుతుందని కరస్పాండెంట్ సత్యరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యారెడ్డి, ఉపాధ్యాయులు వజ్రవతి, శాలిని, మణికుమారి, లక్ష్మీనాయుడు, రెహేనా, చంద్రలేఖ, ప్రేమలత, సంధ్యఠాగూర్, ఉమ, సబిత, సునీత, ప్రతిక్ష, హరిత, శిల్ప, షాహిద, గీతిక, సుమిత్ర, రాజ్యలక్ష్మి, జయంతి స్థానిక నాయకులు నిస్సార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి



• సత్యసాయి విద్యాసంస్థల చైర్మెన్ గడ్డం సాయికిరణ్

నవతెలంగాణ-ఉప్పల్

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి తమ సత్తా చాటాలని, సైన్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని సత్యసాయి విద్యాసంస్థల చైర్మెన్ గడ్డం సాయికిరణ్ అన్నా రు. మంగళవారం సత్యసాయి విద్యానికేతన్ పాఠశాలలో మైండ్‌స్పేస్ 3.0 అనే పేరుతో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గడ్డం సాయి కిరణ్ ముఖ్యతిథిగా హాజరై విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకతను జోడించి ఖగోళ, భౌతిక, రసాయన శాస్త్ర ఆవిష్కరణలు చేశారు. నృత్య కళలు, ఒగ్గు కథ, బుర్ర కథ, తోలు బొమ్మలాట, గురుకులం, పండుగల విశిష్టతను, సహజ వనరులను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్య కతను తెలియజేసే అంశాలు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ గడ్డం సాయి కిరణ్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది లాగే విద్యార్థులు తమ మేథో శక్తిని తట్టిలేపి, ఆలోచనలకు పదు ను పెట్టి రకరకాల ఆవిష్కరణలు, ఆలోచనలతో చేసిన విజ్ఞాన ప్రదర్శన తమను ఎంతగానో ఆక ట్టుకున్నాయని తెలిపారు. ఇలాంటి సృజనాత్మకత విద్యార్థి దశనుండే అలవర్చుకుంటే భవిష్యత్తులో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గడ్డం వెంకట్ సాయి, ప్రకాష్, శివ, శైలజ మరియు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నికైన చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను చర్లపల్లి డివిజన్ బంజారా సంఘ్ సేవ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. - నవతెలంగాణ - చర్లపల్లి



షాటోఖాన్ మార్షల్ట్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



• సాధన చేస్తాం.. పతకాలు సాధిస్తాం
• ది బెస్ట్ కరాటే కోచ్‌గా కరాటే మాస్టర్ రవికుమార్ గౌడ్

నవతెలంగాణ - చర్లపల్లి

ది బెస్ట్ కరాటే కోచ్, కరాటే మాస్టర్ రవికుమార్ గౌడ్‌ను సినీ హీరో సుమన్ అభినందించారు. హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో కుషాయిగూడ, చర్లపల్లికి చెందిన చాంపియన్ షాటోఖాన్ మార్షల్ట్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. కరాటే పోటీలలో పది బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలు, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారని ఛాంపియన్ షాటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ బుడిగే రవికుమార్ గౌడ్ తెలిపారు. వీరిలో శ్రీశాంత్ గౌడ్, నిశాంత్, శ్రీ శౌర్యా, సహస్ర, సాయి ప్రతీక్ శర్మ, తేజస్వి, క్రితిన్, ప్రబావ్, ధనుష్, భార్గవ్, బంగారు పతకాలు సాధించారు. అలాగే ధ్రువ్, వరలక్ష్మి పరిణిక, సాయి మనస్విని, తేజష్, అద్వైత్ వెండి పతకాలు సాధించారు. అలాగే ప్రణవ్, ఈశ్వర్, శ్రీనిష్, మాన్విశ్రీ, ప్రణవ్ మారోజు, బ్రాహ్మిని, మనస్విని, అద్విక్ రెడ్డి కాంస్య పతకాలు సాధించారు. ఈ కరాటే పోటీలకు ముఖ్య అతిథిగా వచ్చిన సినీ హీరో సుమన్ తల్వార్ కరాటే మాస్టర్ రవికుమార్ గౌడ్‌ను ది బెస్ట్ కరాటే కోచ్‌గా అభినందించి, శాలువాతో సన్మానించి మెమొంటోను అందజేశారు. గెలిచిన విద్యార్థులకు పతకాలు, ప్రశంస పత్రాలను అందజేశారు.



ప్రతిఘటనకు ఓ సాధనంగా...



మారా కలెక్టివ్... హింసకు గురైన మహిళల స్వరాన్ని ప్రపంచానికి వినిపిస్తోంది. బాధిత అందునా దళిత మహిళలు తమ కథలను తిరిగి రాయడానికి అవసరమైన శక్తినిస్తోంది. గ్రామీణ మధ్యప్రదేశ్‌లో లైంగిక, కుల ఆధారిత హింస నుండి బయటపడినవారు దళిత మహిళా నాటక రచయితలు మారారు. నాటకాన్ని తమ ప్రతిఘటనకు ఒక సాధనంగా మలుచుకున్నారు. ఇప్పటి వరకు వినని తమ మనసులోని వేధనను ధైర్యంగా సమాజానికి చాటిచెబుతున్నారు.

మారా లైంగిక హింస, అత్యాచారానికి గురైన మొదటి వ్యక్తి కథలను వివరిస్తుంది. 'మీలో చెప్పలేని కథను మోయడం కంటే గొప్ప వేదన మరొకటి లేదు' అంటారు తన 'ఐ నో వై ది కేజ్డ్ బర్డ్ సింగ్స్' (1969) అనే కవితా సంపుటిలో ప్రముఖ రచయిత్రి మాయా ఏంజెలో. 2018లో గ్రామీణ భారతదేశంలోని దాదాపు వంద మంది మహిళలు లైంగిక, లింగ ఆధారిత హింస అనుభవాలను వివరించారు. వాటిని విన్న తర్వాత అంగారికా గుహ, అనుషి అగర్వాల్ ఓ ఆలోచన చేశారు. బెంగళూరుకు చెందిన 'మారా' అనే సంస్థ ఆధ్వర్యంలో ఆ బాధిత మహిళల అనుభవాలను 'చు కర్ దేఖో' (టచ్ అండ్ సీ) అనే నాటకాన్ని రూపొందించారు.

సామూహిక ప్రతిధ్వని

మారా కలెక్టివ్ సభ్యులలో మమతా సోలంకి ఒకరు. ఊహించలేని హింసకు గురైన తర్వాత సోలంకి నిశ్శబ్దంలోకి నెట్టబడింది. భర్త ఆమెను విడిచిపెట్టి వెళ్లిన తర్వాత ఇండ్లలో వంట చేసుకుంటూ బతికింది. అనేక కష్టాలు అనుభవించింది. ఒక రోజు క్యాటరింగ్ ఆర్డర్ ఇస్తామని చెప్పి ఆమెను సుదూర గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆధిపత్య కులానికి చెందిన వ్యక్తుల బృందం ఆమెను బంధించి రెండు రోజులు లైంగికంగా వేధించింది. కానీ పోలీసులు ఆమె చెప్పిన విషయాన్ని నమ్మలేదు. నిందితులపై చర్య తీసుకోవడంలో ఆలస్యం చేశారు. చివరికి నేరస్థులను అరెస్టు చేసినా కోర్టు వారికి వెంటనే బెయిల్ ఇచ్చేసింది. విడుదలయ్యాక ఆమెపై మళ్లీ దాడి చేసి బెదిరించడం మొదలుపెట్టారు. దాంతో సోలంకి తన గ్రామంలో ఇక జీవించడం కష్టమని నిర్ధారించుకున్నారు. గుహ, అగర్వాల్‌లను మొదటిసారి కలిసినప్పుడు ఆమె వారితో మాట్లాడలేక పోయింది. బయటకు అడుగు పెట్టడానికి కూడా భయపడింది. కానీ 'చు కర్ దేఖో' చూసిన తర్వాత సోలంకిలో ఏదో మార్పు వచ్చింది.

ప్రేక్షకులకు వేరే మార్గం లేదు

'వేదికపై మా కథలు చూసినప్పుడు చలించిపోయాను. కానీ నేను ఒంటరిగా లేను, నా చుట్టూ ఉన్న చాలా మంది మహిళలు కూడా ఏడుస్తున్నారు. ఆ క్షణంలో, మేమందరం కోలుకోవడం ప్రారంభించామని నేను అనుకుంటున్నాను. చాలా కాలంగా సమాజం నన్ను నమ్మడానికి, నా బాధను అంగీకరించడానికి నిరాకరించింది. కానీ ఇప్పుడు, నేను ప్రపంచం ముందు నిలబడి నా సొంత మాటలలో నా కథను చెప్పాను. నేను వేదికపై ఉన్నప్పుడు ప్రేక్షకులకు వినడం తప్ప వేరే మార్గం లేదు. వారు అసౌకర్యంతో కూర్చోవాలి, వారి మనసులలో, శరీరాలలో దానిని అనుభవించాలి, దానిని అంగీకరించాలి. ఎందుకంటే నేను ఇకపై కనిపించను' అంటూ ఆమె గుర్తు చేసుకున్నారు.

ధైర్యంగా చెప్పడానికి

సమాజంలో చాలా మంది మహిళలు చదవలేరు, రాయలేరు. అందుకే వారు స్కెచ్‌లు గీయడం ప్రారంభించారు. అవి స్టోరీబోర్డులుగా మారాయి. ఈ మహిళలు థియేటర్‌ను ప్రతిఘటన రూపంగా మలుచుకున్నారు. తమలోని బాధను, నిజాలను సమాజానికి ధైర్యంగా చెప్పడానికి ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. సమాజంలో తమను తాము ఓ శక్తిగా నిలబెట్టుకుంటున్నారు. దీని నుండి రూపుదిద్దుకున్న మొదటి నాటకం 'నజర్ కే సామ్నే' (ఇది ఇప్పుడు బ్యాంకాక్‌లో 50 ప్రదర్శనలు పూర్తి చేసింది). ఈ నాటకం మహిళల జీవిత అనుభవాల ద్వారా హింసలోని గతిశీలతను అన్వేషిస్తుంది. అయితే ఇది హింసను ఒక ఏకైక సంఘటనగా చూడటాన్ని తిరస్కరిస్తుంది. దీనికి బదులుగా బాధిత మహిళలు స్వేచ్ఛగా, ఇష్టంగా, ఎలాంటి భయం లేకుండా ఇంటి నుండి బయటకు అడుగు పెట్టే హక్కును అన్వేషిస్తుంది. డ్రాయింగ్, ఇంప్రూవైజేషన్, కదలికల ద్వారా స్క్రిప్ట్‌ను రూపొందించారు.



అవమానంగా భావించారు

మరొక సభ్యురాలైన వర్ష మాల్వియా.. ఆమె శరీరం, మనసు భరించిన హింసను వివరిస్తుంటే ఇప్పటికీ ఆమె వణికిపోతుంది. అగర్వాల్, గుహతో మొదటిసారి తన కథను పంచుకోమని అడిగినప్పుడు ఆమె అపరాధ భావన, సిగ్గుతో కుంగిపోయింది. 'నన్ను నా ఇంటి నుండి కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, డెహ్రా డూన్‌లో అమ్మేశారు. నేను తప్పించుకుని తిరిగి ఇంటికి వెళితే కుటుంబ సభ్యులు నన్ను నిరాకరించారు. నన్ను వాళ్లు అవమానంగా భావించారు. చాలా కాలం పాటు నేను కూడా దాన్ని నమ్మాను. జరిగిన ప్రతిదానికీ నన్ను నేను నిందించుకున్నాను' అని ఆమె పంచుకున్నారు. మారా బృందంతో రోజుల తరబడి కూర్చున్న తర్వాతే ఆమె అవగాహన మారిపోయింది. 'ఇది నేను భరించాల్సిన అవమానం కాదని, అసలైన నిజం ఏమిటో స్పష్టంగా కనిపించడానికి వారు నాకు సహాయం చేసారు' అంటూ జత చేశారు. తర్వాత ఆమె పంచాయితీ హాళ్ళు, కమ్యూనిటీ స్థలాలు, గ్రామాలలో ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించారు. ఇక్కడ పితృస్వామ్య, కుల ఆధారిత హింస రోజువారీ వాస్తవికత. కొన్నిసార్లు ప్రేక్షకులలోని ఆధిపత్య కుల పురుషులు నాటకం ఇతివృత్తాలను తోసిపుచ్చారు. కొన్ని సార్లు భద్రతా కారణాల రీత్యా ప్రదర్శనలను తరలించాల్సి వచ్చింది. అయినప్పటికీ మహిళలు చూడటానికి వచ్చారు.

థియేటర్ ఉపయోగించుకుంటూ...

ఈ బృందం ఇప్పుడు మార్జు ఔర్ మోయినా కి కహానీ అనే కొత్త నాటకాన్ని విడుదల చేసింది. ఇది ఇద్దరు యువతులు తమ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న అవినీతిపరుడైన రాజు, మంత్రిపై పోరాడే కథ. అయితే ఇది వ్యక్తిగత చరిత్రల నుండి ఉద్భవించిన నజర్ కే సామ్నే మాదిరిగా కాకుండా, మహిళలు వారి సొంత అనుభవాల నుండి బయటపడటానికి, విస్తృత అధికార వ్యవస్థలను విమర్శించడానికి థియేటర్‌ను ఉపయోగించడానికి ఈ నాటకం వీలు కల్పిస్తుంది. ప్రదర్శన ఈ మహిళలకు చలనశీలత, స్వాతంత్ర్యం, కొంతమందికి ఆర్థిక స్థిరత్వాన్ని కూడా ఇచ్చింది. ఒకప్పుడు గ్రామాలకే పరిమితమైన వారు ఇప్పుడు ప్రదర్శనల కోసం నెలకు 15-20 రోజులు ప్రయాణిస్తారు. నగరాల్లో, స్త్రీవాద సమావేశాలలో, అంతర్జాతీయ ప్రదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. మారా చేస్తున్న కృషికి స్త్రీవాదులు, వ్యక్తిగత దాతలు మాత్రమే మద్దతు ఇస్తున్నారు. అయితే నిధులు పొందడం వీరికి ఎప్పుడూ ఒక సవాలే.

గర్భిణీలకు ఆహార జాగ్రత్తలు

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మించాలన్నా.. ఆమె హెల్తీగా ఉండాలన్నా గర్భిణీలు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆహారం తీసుకునే విషయంలో కొన్ని సూచనలు పాటించాలి. గర్భిణీ సమయంలో తల్లి ఆరోగ్యానికి, బిడ్డ పెరుగుదలకు సరిపోయేంత ఆహారం కొంచెంకొంచెంగా ఎక్కువ సార్లు తినాలి. కాల్షియం, ఇనుము అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. వీటితో పాటు పుల్లటి పండ్లు తీసుకోవాలి. పాలు, మాంసం, గుడ్లు, చేపలు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం మంచిది. అలాగే సరైన విశ్రాంతి తీసుకోవాలి. గర్భిణీలలో ముఖ్యంగా రక్తహీనత సమస్య ఉంటుంది. దీని వలన బరువు తక్కువ ఉన్న బిడ్డలు పుట్టడం, తల్లికి అధిక రక్తస్రావం కావడం జరుగుతుంది. కాబట్టి ఇనుము ఎక్కువగా ఉన్న ఆహారం అంటే ఆకుకూరలు,



బెల్లం, రాగులు, ఎండిన పండ్లు (కర్జూరం, ద్రాక్ష), నువ్వులు, చెరుకురసం, ఉలవలు తీసుకోవాలి.

రోజుకు ఒకటి చొప్పున ఐరన్ మాత్రలు వేసుకోవాలి. కొన్ని రకాల పండ్లు, ఆహార పదార్థాలు తినడం వల్ల సమస్యలు వస్తాయన్న అపోహలు ఉన్నాయి. బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం అవుతుందనడం ఎంత మాత్రం నిజం కాదు. ఇందులో అధిక కేలరీలు ఉంటాయి. అందుకే తొందరగా జీర్ణం కాదు. కొబ్బరి నీళ్లలో ఎక్కువ మోతాదులో పొటాషియం, లవణాలు ఉంటాయి. బీట్‌రూట్‌లో ఇనుము, బీటా కెరోటిన్లు... క్యారెట్ కన్నా ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందువల్ల బీట్‌రూట్ కన్నా క్యారెట్ కొంత వరకు మంచిదే. అరటిపండు తినడం వల్ల పిల్లలు నల్లగా పుట్టరు. జున్ను తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీనిలో ఎక్కువగా కొవ్వు పదార్థాలు ఉంటాయి. అందువల్ల ఎక్కువ తింటే అజీర్ణం చేయవచ్చు . అందుకే మిరియాలను కలుపుకొని తినాలి. దానివల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు.



ఇరాన్ షాడో ట్యాంకర్లపై
అమెరికా ఆంక్షలు

భారత కంపెనీలపైనా ప్రభావం

వాషింగ్టన్ : ఇరాన్ నుంచి చమురును ఎగుమతి చేయకుండా అడ్డుకొనేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. ఇరాన్ షాడో ట్యాంకర్లు, వాటి ఆపరేటర్లు, మేనేజర్లను లక్ష్యంగా చేస్తూ అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. వివిధ దేశాలకు చెందిన 30మంది వ్యక్తులు, కంపెనీలు, ట్యాంకర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో భారతీయుల పేర్లు కూడా చేర్చినట్లు సమాచారం. వీరంతా ఇరాన్ చమురు విక్రయాలు, బ్రోకరేజీల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. హాంకాంగ్, యుఎఇలోని చమురు బ్రోకర్లు, నేషనల్ ఇరానియన్ అయిల్ కంపెనీలు ఉన్నాయి. 'ఇరాన్ తరచూ లక్షల పీపాల చమురును ఎగుమతి చేయడానికి రహస్య ట్యాంకర్లు, షిప్పింగ్ కంపెనీలు, బ్రోకర్లపై ఆధారపడుతోంది. ఇలా వచ్చిన నిధులను ఇతర దేశాలను అస్థిరపరిచే చర్యలకు వాడుతోంది. ఇరాన్ చమురు సరఫరా గొలుసుకట్టు వ్యవస్థలను దెబ్బతీయడానికి అమెరికా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తోంది. ఎవరైనా ఇరాన్‌తో ఆయిల్ డీల్స్ చేస్తే తమ ఆంక్షల పరిధిలోకి వస్తారు" అని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ తెలిపారు.ఈ తాజా ఆంక్షల పరిధిలోకి భారత్‌లోని కొన్ని కంపెనీలు రానున్నాయి. బిఎస్‌ఎం మారిటైమ్ లిమిటెడ్ లైబులిటీ పార్టనర్‌షిప్, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్, కాస్మోస్ లైన్స్ ఐఎన్‌సీ సంస్థలు ఉన్నాయి. ఇవన్నీ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్‌తో కలిసి చమురు రవాణా, కొనుగోలు, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు అమెరికా చెబుతోంది. అలాగే, ఫ్లక్స్ మారిటైమ్ ఎల్‌ఎల్‌పీ సంస్థ ఓ నౌకకు టెక్నికల్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ ఓడ లక్షల టన్నుల ఇరాన్ ముడి చమురును రవాణా చేసిందని అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. ఇరాన్‌పై వీలైనంత ఆర్థికఒత్తిడిని పెంచాలని ట్రెజరీ సెక్రటరీని ఆదేశిస్తూ ఈనెల ప్రారంభంలో ట్రంప్ ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. అలాగే, విదేశాంగ శాఖను కూడా ఆయన ఆదేశించారు. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయేలా చూడాలన్నారు.

అలుపెరుగని పోరాటం చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

మినిమమ్ బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు మంజూరు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత సాధించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్, సీఆర్టీలకు మినిమమ్ బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టుల మంజూరు, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వీటితోపాటు ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

డాలర్ దెబ్బ.. రూపాయి వామ్మో

న్యూఢిల్లీ : అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చిత్తులకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ భారీగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్‌ఐఐలు తరలిపోవడంతో రోజు రోజుకు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.23కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్సేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.23కి పడిపోయింది. తుదకు 51 పైసలు కోల్పోయి 87.23 వద్ద ముగిసింది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తలోదారి!

న్యూయార్క్ : సోమవారం జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సమావేశం రెండు తీర్మానాలను ఆమోదించగా ఓటింగుకు భారత్ గైర్హాజరు అయింది. వీటిలో ఒక దానికి ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్ మద్దతు ఇవ్వగా మరో తీర్మానాన్ని అమెరికా ప్రతిపాదించింది. అయితే అట్లాంటిక్ దేశాలు కొన్ని సవరణల ద్వారా తీర్మానాల్లో మార్పులు చేశాయి. ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించేందుకు అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఇమ్మానుయేల్ మాక్రాన్ వాషింగ్టన్‌లో సమావేశమైన సమయంలోనే పశ్చిమ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం గమనార్హం. కాల్పుల విరమణ ఏ మేరకు విజయం సాధించిందన్న విషయంపై ఇరువురు నేతలు పరస్పర విరుద్ధంగా స్పందించారు. రష్యాకు ఉక్రెయిన్ శాశ్వతంగా భూమిని కోల్పోవాల్సిందేనని అమెరికా అంటోంది. దీనిపై మాక్రాన్ స్పందిస్తూ 'శాంతి అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదు. గ్యారంటీలు లేకుండా కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు అర్థమూ కాదు' అని స్పష్టం చేశారు.

సర్వసభ్య సమావేశంలో...

యుద్ధంపై రష్యాకు వ్యతిరేకంగా ఈయూ, ఉక్రెయిన్ తీర్మానాన్ని ప్రతిపాదించగా అమెరికా, రష్యా, బెలారస్, ఉత్తర కొరియా వ్యతిరేకంగా ఓటేశాయి. తీర్మానానికి అనుకూలంగా 93 ఓట్లు, వ్యతిరేకంగా 18 ఓట్లు వచ్చాయి. 65 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. రష్యా ప్రతిపాదించిన సవరణ కూడా వీగిపోయింది. ఇక అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి యూరోపియన్ దేశాలు భారీగా సవరణలు ప్రతిపాదించాయి. ఇవన్నీ ఉక్రెయిన్‌కు అనుకూలమైనవే. అమెరికా తీర్మానాన్ని ఐరాస సమావేశం ఆమోదించినప్పటికీ చివరికి దానిని ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. సవరణలకు 93 దేశాలు అనుకూలంగా ఓటేయగా కేవలం 8 దేశాలు మాత్రమే వ్యతిరేకించాయి. 73 దేశాలు ఓటింగుకు గైర్హాజరు అయ్యాయి.

ఓటింగుకు దూరంగా భారత్

అందరూ భావించినట్లుగానే రెండు తీర్మానాలపై జరిగిన ఓటింగుకు భారత్ దూరంగా ఉంది. రష్యాను విమర్శిస్తూ ఈయూ ప్రతిపాదించిన తీర్మానంపై జరిగిన ఓటింగులో భారత్ పాల్గొనలేదు. గత మూడు సంవత్సరాల కాలంలో భారత ప్రభుత్వం ఇంత బహిరంగంగా ఎన్నడూ తన వైఖరిని బహిర్గతం చేయలేదు. అమెరికా ప్రతిపాదించిన తీర్మానంలో కఠినమైన భాషను వాడకపోవడంతో దానికి మద్దతుగా భారత్ ఓటింగులో పాల్గొంటుందని అందరూ అనుకున్నారు. అయితే రష్యా ఆక్రమణను వ్యతిరేకిస్తూ సవరణ ప్రతిపాదించగానే భారత్ ఓటింగుకు దూరమైంది. ఐరాసలో ఉక్రెయిన్‌పై గతంలో చేసిన తీర్మానాల విషయంలో ఎలా వ్యవహరించిందో ఇప్పుడూ అదే వైఖరి తీసుకుంది. ఐరాస సమావేశంలో అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి ఫ్రాన్స్ తెచ్చిన మూడు కీలక సవరణలు ఆమోదం పొందాయి.

భద్రతా మండలిలోనూ...

సోమవారం మధ్యాహ్నం జరిగిన ఐరాస భద్రతా మండలి సమావేశంలో ఉక్రెయిన్‌పై అమెరికా, ఈయూ మధ్య మరోసారి విభేదాలు బయటపడ్డాయి. రష్యాను సమర్థించేలా అమెరికా తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానికి ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. తీర్మానాన్ని 10 దేశాలు సమర్ధించగా యూరోపియన్ కౌన్సిల్ దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్, గ్రీస్, స్లొవేనియా, డెన్మార్క్ గైర్హాజరు అయ్యాయి. దీంతో ఉక్రెయిన్‌పై భద్రతామండలి మొట్టమొదటిసారిగా తీర్మానాన్ని ఆమోదించింది. గతంలో రెండుసార్లు ఆ ప్రయత్నం జరిగినప్పటికీ రష్యా వీటో చేసింది.

విభేదాలకు బీజం

అట్లాంటిక్ ప్రాంతంలో విభేదాలకు ఈ నెల ప్రారంభంలోనే బీజం పడింది. ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చించారు. యుద్ధాన్ని ఆపేందుకు చర్చలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పరిణామంపై యూరోపియన్ యూనియన్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. యూరోపియన్ నేతలను పట్టించుకోకుండా ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తారేమోనని అవి భావించాయి. అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బ్రెజెల్స్, మ్యూనిచ్‌లో పర్యటన జరిపిన తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏదేమైనా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై పశ్చిమ దేశాల మధ్య నెలకొన్న విభేదాలు ఐరాస సర్వసభ్య సమావేశంలోనూ, భద్రతా మండలిలోనూ బయటపడ్డాయి. మండలిలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యాలు యూరోపియన్ యూనియన్ మద్దతిచ్చిన తీర్మానాన్ని వ్యతిరేకించాయి.

సర్వసభ్య సమావేశంలో చైనా ఓటింగుకు దూరంగా ఉండగా బ్రిటన్, ఫ్రాన్స్ ఆ తీర్మానానికి మద్దతు ఇచ్చాయి. హంగరీ మినహా మిగిలిన ఈయూ దేశాలన్నీ రెండు తీర్మానాలకూ అనుకూలంగా ఓటేశాయి. నాటో సభ్య దేశాల విషయానికి వస్తే అమెరికా, హంగరీ మాత్రమే ఈయూ కూటమితో విభేదించాయి. జీ-77లోని 134 దేశాల మధ్య కూడా ఏకాభిప్రాయం కన్పించలేదు. ఆసియా, ఆఫ్రికా దేశాల మధ్య ఈ విభేదాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. దక్షిణాసియా దేశాల్లో మిశ్రమ స్పందన కన్పించింది. భారత్, పాకిస్తాన్, శ్రీలంక దేశాలు రెండు తీర్మానాల ఓటింగుకూ దూరంగానే ఉన్నాయి. నేపాల్, మాల్దీవులు, భూటాన్ దేశాలు ఈయూ తీర్మానానికి అనుకూలంగా ఓటేయగా దానికి బంగ్లాదేశ్ దూరంగా ఉండిపోయింది. కానీ ఆ తర్వాత అమెరికా తీర్మానానికి చేసిన సవరణలకు మద్దతు ఇచ్చింది.

కిం కర్తవ్యం ?

కెనడా వీసా నిబంధనాలతో భారతీయుల ఇబ్బందులు



న్యూఢిల్లీ : వలసలను నివారించేందుకు కెనడా ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యల కారణంగా వేలాది మంది విదేశీ విద్యార్థులు, కార్మికులు సమస్యల వలయంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వీరిలో భారతీయులు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పని, నివాస పర్మిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై కూడా కెనడా నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపుతోంది. కెనడా ప్రభుత్వం విధించిన తాజా వీసా నిబంధనలు ఈ నెల ప్రారంభం నుండే అమలులోకి వచ్చాయి. విద్యార్థులు, కార్మికులు, వలసవాదుల వీసా హోదాను ఏ సమయంలో అయినా మార్చేసే అధికారాన్ని సరిహద్దు అధికారులకు కట్టబెడుతూ కెనడా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఈ గందరగోళానికి కారణమైంది. నూతన ఇమ్మిగ్రేషన్-రెఫ్యూజీ ప్రొటెక్షన్ నిబంధనల ప్రకారం తాత్కాలిక నివాస పత్రాలను నిరాకరించే లేదా తిరస్కరించే అధికారం కెనడా సరిహద్దు సిబ్బందికి ఉంటుంది. అంటే దీనర్థం సరిహద్దు అధికారులు అలాంటి పత్రాలను రద్దు చేయవచ్చు. వీటిలో వర్క్ పర్మిట్లు, స్టూడెంట్ వీసాలు కూడా ఉన్నాయి. అయితే పర్మిట్లు, వీసాలు రద్దు చేసేందుకు కొన్ని మార్గదర్శకాలను రూపొందించారు. నూతన నిబంధనలు అనిశ్చితికి దారితీసే అవకాశం ఉన్నదని, వేలాది మందిపై ప్రభావం పడుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కెనడాలో నివసిస్తున్న విదేశీ విద్యార్థులు, ఉద్యోగుల్లో భారతీయుల సంఖ్యే అధికం. భారతీయ విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, చట్టబద్ధమైన వలసవాదులకు కెనడా అనువైన ప్రదేశం. కెనడాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్యే 4.2 లక్షలకు పైగా ఉంటుంది.

విద్యార్థి, కార్మికుడు, ఉద్యోగి లేదా వలసదారుడు...ఎవరైనా సరే తిరస్కరణకు గురైతే దేశంలో ప్రవేశించే చోటే నిలిపివేసి స్వదేశానికి పంపుతారు. ఒకవేళ పర్మిట్ రద్దయిన వ్యక్తి అప్పటికే అక్కడ నివసిస్తున్నా, చదువుకుంటున్నా నిర్దిష్ట సమయం లోగా దేశం విడిచి వెళ్లాల్సిందిగా నోటీసు ఇస్తారు. విద్యార్థులు, ఉద్యోగులే కాదు. పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో కెనడా వెళుతుంటారు. వారందరికీ తాత్కాలిక పర్మిట్లు జారీ చేస్తారు. ఎంత కాలం నివసించవచ్చో నిర్దేశిస్తారు. గత సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో కెనడా 3.6 లక్షల మందికి పైగా భారతీయులకు పర్యాటక వీసాలు జారీ చేసింది. కాగా ఒకవేళ పర్మిట్లు, వీసాలు రద్దయితే అప్పటికే మదుపు చేసిన సొమ్ము గతి ఏమిటన్నది ఇంకా తెలియడం లేదు. విద్యకో, రుణానికో, తనఖాకో, అద్దె రూపంలోనో చెల్లించిన డబ్బు బూడిదలో పోసిన పన్నీరేనా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

అన్ని బడుల్లో

'తెలుగు' తప్పనిసరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ సహా ఇతర బోర్డు పాఠశాలల్లో కూడా తెలుగు సబ్జెక్టును అమలు చేయాల్సిందేనని ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2025-26 విద్యాసంవత్సరంలో తొమ్మిదో తరగతి, 2026-27 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని కోరారు. సీబీఎస్‌ఈ సబ్జెక్టు జాబితా ప్రకారం సింగిడి (ప్రామాణిక తెలుగు) స్థానంలో వెన్నెల (సులభమైన తెలుగు)ను ప్రవేశపెట్టామని తెలిపారు. మాతృభాష తెలుగును రాష్ట్రంలో ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్‌తోపాటు గుర్తింపు పొందిన సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, ఇతర బోర్డు యాజమాన్యాల్లోని పాఠశాలల్లో కూడా తెలుగును తప్పనిసరిగా బోధించాలని ఆదేశించారు. 2018, మార్చి 30న చట్టం 10 ద్వారా ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వివిధ కారణాల వల్ల తెలుగు భాషను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో అమలు చేయలేదని తెలిపారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తెలుగు భాషను రాష్ట్రంలో తప్పనిసరిగా అమలు చేయాలనే సంకల్పంతో చర్యలను చేపట్టిందని వివరించారు. అందులో భాగంగానే సీబీఎస్‌ఈ యాజమాన్యాల బోర్డుతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు తెలుగు బోధించి పరీక్షలను నిర్వహించామని నిర్ణయించామని పేర్కొన్నారు. తెలుగును సరళీకృత విధానంలో బోధించి చదువుకునే వారి అభిరుచి పెంచుతూ చదువును కొనసాగించడానికి సులభతర తెలుగు వాచకం వెన్నెలను పాఠ్యాంశంగా తొమ్మిది, పదో తరగతి సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ యాజమాన్యాల్లో పరీక్షలను నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. సులభమైన తెలుగును అమలు చేయడం ద్వారా మాతృభాషేతర విద్యార్థులకు అలాగే ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సులభమైన తెలుగును అమలు చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ ఇతర బోర్డు పాఠశాలల్లోని విద్యార్థులకు తొమ్మిది, పదో తరగతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని వివరించారు. 2025-26 విద్యాసంవత్సరం ఆయా యాజమాన్యాల్లో విధిగా తెలుగు భాషా బోధనా, పరీక్షల నిర్వహణ ఒకటి నుంచి పదో తరగతి వరకు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

పైసా.. కైసా...?

(మొదటిపేజీ తరువాయి)


కూడా ఇప్పుడు భరించే స్థితిలో లేం కాబట్టి, కొత్త పింఛన్ల జోలికి కూడా పోవటం లేదని ఓ అధికారి తెలిపారు. ఈ రకంగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేయలేక, కొత్త పింఛన్లు ఇవ్వలేకా ప్రభుత్వం సతమతమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు అంగన్‌వాడీల్లోని టీచర్లకు ఇచ్చే వేతనాన్ని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పింఛన్లకు అదనంగా వీటిని ఇవ్వాలనుకుంటే నెలకు అదనంగా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ కావాల్సి ఉంటుందంటూ ఆర్థికశాఖ లెక్కలేసింది. ఈ మొత్తాన్ని కూడా ఇప్పుడు భరించే స్థితిలో లేం కాబట్టి, కొత్త పింఛన్ల జోలికి కూడా పోవటం లేదని ఓ అధికారి తెలిపారు. ఈ రకంగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేయలేక, కొత్త పింఛన్లు ఇవ్వలేకా ప్రభుత్వం సతమతమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దీంతోపాటు అంగన్‌వాడీల్లోని టీచర్లకు ఇచ్చే వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామనీ, పీఎఫ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీనిచ్చింది. టీచర్లతోపాటు హెల్పర్లకు ఇచ్చే రిటైర్మెంట్ బెనిఫిట్లను రెట్టింపు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం వాగ్దానం చేసింది. ప్రస్తుతం టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేలను బెనిఫిట్లుగా ఇస్తున్నారు. ఇందుకోసం ప్రతీయేటా బడ్జెట్‌లో రూ.20 కోట్లను కేటాయిస్తున్నారు. వీటిని రెట్టింపు చేయాలంటే రూ.40 కోట్లు అవసరమవుతాయి. 'ఖజానా' కష్టాల నేపథ్యంలో సంబంధిత దస్త్రం కూడా పక్కకు పోయినట్టు సమాచారం.

చక్కటి ఆహ్లాదకర వాతావరణం చుట్టూ ఎత్తైన కొండలు. పచ్చని చెట్ల పొదలు.. పక్షుల కిలకిల రాగాలు తమ అందాలను ఆవిష్కరిస్తూ మెరిసే దృశ్యాల మధ్య పచ్చని చెట్టు నుంచి వచ్చే పరిశుభ్రమైన గాలిని పీల్చుకుంటూ మరో వైపు దైవ నామ స్మరణ చేసుకుంటూ కాసేపు అన్నీ మరచి కాలక్షేపం చేయాలంటే ఎవరికి ఇష్టం ఉండదు. ఈ దృశ్యాలన్నీ నగర ప్రాంతానికి అత్యంత చేరువలో ఉన్న కీసరగుట్టలో సందర్శకులను ఇట్టే ఆకట్టుకుంటాయి. నిత్యం కాలుష్యపు కోరల్లో సతమతమయ్యే నగర జీవికి ఒకింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే కీసరగుట్ట సందర్శకులకు ఒక మధురానుభూతిని మిగులుస్తుంది. జిల్లాలోని నలుమూలాల నుంచి వచ్చే భక్తులకు, యాత్రికులకు ఇక్కడి చారిత్రాత్మక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది.

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం...కీసరగుట్ట







నవతెలంగాణ-కీసర

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోనే అతి పురాతనమైన శైవక్షేత్రంగా పేరొందిన కీసరగుట్ట దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలతో సమానంగా వెలుగొందుతోంది. ఈ క్షేత్రంలో కొలువైన శ్రీరామలింగేశ్వర స్వామి ప్రతి యేటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులచే ప్రత్యేక పూజలందుకుంటున్నాడు. లక్షలాది మంది భక్తులు. వీఐపీలు, రాజకీయ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయం పశ్చిమాభిముఖంగా ఉండటం ఇక్కడి విశేషం. స్వామివారికి కుడి వైపున భవాని అమ్మవారు, ఎడమవైపున శివుదుర్గ అమ్మవారు విఘ్ననాయకుడు కొలువ య్యారు. కేసరిగిరి పురాణం ప్రకారం స్థలకథ ఇలా ఉందని భక్తులు చెబుతారు. ద్వాపర యుగంలో రావణుని సంహరించిన అనంతరం సీతా సమేతంగా అమోధ్యా నగరానికి బయలుదేరిన శ్రీ రాముడు బ్రహ్మహత్య పాపాన్ని పోగొట్టుకునేందుకు మహర్షుల సూచన మేరకు పలు ప్రాంతాల్లో శివలింగ ప్రతిష్ట చేయ సంకల్పించారు. అలా ఈ ప్రాంతం గుండా తన పరివారంతో వెళ్తున్న రాముడు ఇక్కడి ప్రకృతిని చూసి అనందించి శివలింగ ప్రతిష్ట చేయదలిచి మహర్షులను కోరాడు. వారు సంతోషించి సుమూహూ ర్తం నిశ్చయిం చారు. కాశీ క్షేత్రమునకు వెళ్లి గొప్ప శివలింగమును తేవాల్సిందిగా హనుమంతున్ని శ్రీరాముడు ఆజ్ఞాపిస్తాడు. కాశీకి వెళ్లిన హనుమంతుడికి ఈశ్వరుడు నూటొక్క శివలింగాల రూపంలో కనిపిం చాడు. దీంతో హనుమంతుడు. అన్ని శివలింగాలను తీసుకుని ఆకాశమార్గమున బయులుదేరుతాడు. ఇక్కడ మహర్షులు నిర్ణయించిన ముహూర్తం సమీపిస్తున్నా హనుమంతుడు రాలేదు. వెంటనే శ్రీరాముడు ఈశ్వరుడిని ప్రార్థించగా ఆయన ప్రత్యక్షమై శివలింగ రూపమును ధరించి ఇక్కడ కొలువైనాడు. అలా ఆ శివలింగానికి రామలింగేశ్వర స్వామి అనే పేరు వచ్చింది. అనంతరం శివలింగాలతో వచ్చిన హనుమంతుడికి శ్రీరాముడు జరిగిన కథని వివరిస్తా డు. తాను చేసిన పని ఉపయోగపడకపోవడంతో ఆగ్రహించిన హనుమంతుడు శివ లింగాలను విసిరివే యగా పరిసర ప్రాంతాల్లో చెల్లాచెదురుగా పడ్డట్టు భక్తులు విశ్వసిస్తారు. అప్పుడు హనుమం తుని పేరు మీద ఇది కేసరిగిరిగా ప్రసిద్ధి చెందుతుందని శ్రీరాముడు వరమిస్తాడు. శాంతించిన హనుమంతుడు విసిరిన లింగాల్లో ఒక దానిని శ్రీస్వామి వారి వామ భాగంలో ప్రతిష్టించాడు. అదే మారుతి కాశీ విశ్వేశరాలయం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.